Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 342 • శనివారం 24 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



అసెంబ్లీ కమిటీహాలులో రాజ్యసభ ఎన్నికల పోలింగ్.. ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీఎం కేసీఆర్, అసెంబ్లీ స్పీకర్ మధుసూధనా చారి, మంత్రులు ఈటల, హరీశ్, కేటీఆర్, తుమ్మల

26న శ్రీరామ నవమి సెలవు

ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఈనెల 26న (సోమవారం) ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆదివారం సాధారణ సెలవు దినం కావడంతో పండుగ సెలవును సోమవారానికి మారుస్తూ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి శుక్రవారం జీవో విడుదల చేశారు.

విజేతలకు కేసీఆర్ అభినందనలు

• ప్రగతిభవన్‌లో సీఎంను కలిసిన విజయసారధులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ విజేతలను ముఖ్యమంత్రి కెసిఆర్ అభినందించారు. ఫలితాలు వెల్లడించిన అనంతరం గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులు అర్పించిన నూతన రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండప్రకాష్, బడుగుల లింగయ్యలు అక్కడి నుండి నేరుగా ప్రగతిభవన్‌కు చేరుకుని ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు. బాగా పనిచేయాలని.. బలహీనవర్గాలకు అండగా నిలవాలని, పార్టీ ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'భగీరథ' పనులు గడువులోగా పూర్తవ్వాలి

• అధికారులకు మంత్రి కేటీఆర్ అల్టిమేటం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్ భగీరథ అర్బన్ పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అల్టిమేటం జారీ చేశారు. ఇందులో ఎలాంటి కాలయాపన జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం సిడిఎంఎ కార్యాలయంలో అధికారులు, వర్కింగ్ ఏజెన్సీలతో మంత్రి కేటీఆర్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు పనిచేయాలన్నారు. త్వరలో పనులు పూర్తి అయ్యే పట్టణాల జాబితాను తయారు చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి పట్టణంలో ఏఏ తేదీలోపల పనులు పూర్తి అవుతాయో తెలియజేయలన్నారు. అన్ని పట్టణాల్లో అమృత్ పనులు ప్రారంభం అయ్యాయని, వేగంగా సాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు.గడువులోగా పూర్తి చేసే ఏజెన్సీలకు ప్రభుత్వ పరంగా ప్రోత్సహాకాలు ఇస్తామన్న విషయాన్ని కేటీఆర్ మరోసారి గుర్తు చేశారు. వచ్చే వర్షాకాలం నాటికి పనులను సేఫ్ స్టేజీకి తీసు కరావాలన్నారు. కాగా ఆర్మూర్ పట్టణంలో పనులు 98 శాతం పూర్తి అయ్యాయన్నా రు. సిరిసిల్లా పట్టంలోనూ సుమారు 80శాతం పనులు పూర్తి అయ్యా యన్నా రు. రాష్ట్రంలో సగం నగర పాలికల్లో పనులు వేగంగా జరుగుతు న్నాయని, రాష్ట్రంలో నాలుగైదు నెలల్లో పనులు పూర్తి అవుతాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే మిషన్ భగీరథపైన వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులతో ఒక సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. మిషన్ భగీరథను ఇక వారంవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తానన్నారు.మిషన్ భగీరథలో వేసే ప్రతి పైపులైను వెంబడి ఖచ్చితంగా ఆప్టిక్ ఫైబర్ డక్ట్ వేయాల్సిందేనని అని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెద్దల సభకు ఆ ముగ్గురూ... సంతోష్‌ంగా!

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకోగా.. 107ఓట్లను పరిగణన లోకి తీసుకున్నారు. అత్యధిక ఓట్లు సాధించిన ముగ్గురినీ విజేతలుగా ఎన్ని కల రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు ప్రకటిం చారు.



కౌంటింగ్‌లో ట్విస్ట్

ఎన్నికల కౌంటింగ్ శుక్రవారం సాయంత్రం 5గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు సభ్యులు.. కాంగ్రెస్ ఏజెంట్ రేగాకాంతా రావుకు తమ ఓటు చూపించి టిఆర్ఎస్‌కు ఓటు వేశారని ఎన్నికల కమిషన్‌కు, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేశారు. అదే సమయంలో స్వతంత్రఅభ్యర్థి దొంతిమాధవరెడ్డి కాంగ్రెస్ ఏజెంట్‌కు చూపి ఓటువేశారని టిఆర్ఎస్ నేతలు ఫిర్యాదుచేశారు. దీనిపై రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు ఎన్నికల కమిషన్‌కు తదుపరి చర్యల నిమిత్తం వివరణ అడగ్గా, ఓటు ఏజెంట్‌కు చూపి వేసినందున టిఆర్ఎస్‌కు ఓటువేసిన ఏడుగురు సభ్యుల ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. అదే క్రమంలో తన ఓటును అవసరంలేకున్నా.. కాంగ్రెస్ ఏజెంట్‌కు చూపినందున నర్సంపేట ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి ఓటును తొలుత పెండింగ్ పెట్టారు. తాను కాంగ్రెస్ అనుబంధ సభ్యుడినని, గెలిచిన వెంటనే స్పీకర్‌కు ఈ మేరకు లేఖ ఇచ్చినట్లు కాంగ్రెస్ సభ్యులు తమ వాదన వినిపించగా, దీనిపై కాంగ్రెస్ అనుబంధసభ్యుడిగా.. స్పీకర్ గుర్తించాడో లేదో వివరణ తీసుకోమని ఎన్నికల కమిషన్ రిటర్నింగ్ అధికారికి సూచించింది. దీనిపై రిటర్నింగ్ అధికారి స్పీకర్ అభిప్రాయం కోరగా.. తాను కాంగ్రెస్ అనుబంధసభ్యునిగా ఎవరినీ గుర్తించలేదని పేర్కొనడంతో ఎన్నికల కమిషన్ సూచనమేరకు ఈ ఓటును అనర్హమైనదిగా ప్రకటించారు. విప్ ధిక్కారం, క్రాస్ ఓటింగ్‌ను చూపి టిఆర్ఎస్‌ను ఇబ్బందిపెడదామనుకున్న కాంగ్రెస్‌కు టిఆర్ఎస్ ఊహించని ఝలక్ ఇచ్చింది.

తొలి ఓటు ఈటల .. ఆఖరి ఓటు జీవన్‌రెడ్డి

రాజ్యసభ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ఉదయం తొమ్మిదిగంటలకు శాసనసభ సమావేశమందిరంలో ప్రారంభం కాగా, తొలి ఓటును రాష్ట్రఆర్థికశాఖా మంత్రి ఈటల రాజేందర్ వినియోగించుకున్నారు. ఆఖరిఓటును కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి వినియోగించుకున్నారు. టిఆర్ఎస్ పార్టీ పక్షాన ఎన్నికల ఏజెంట్‌గా టిఆర్ఎస్ఎల్పీ కార్యదర్శి రమేష్‌రెడ్డి వ్యవహరించారు. పార్టీ అభ్యర్థి బడుగుల లింగయ్యాయాదవ్ ఏజెంట్‌గా నాయిని రాజేశ్వరరావు, బండ ప్రకాష్ ఏజెంట్‌గా శ్రవణ్‌రెడ్డి, సంతోష్‌కుమార్ ఏజెంట్‌గా గట్టు రామచందర్ రావులు వ్యవహరించారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఏజెంట్‌గా రేగాకాంతారావు వ్యవహరించారు. సిపిఐ నుండి గెలిచిన.. రవీంద్రనాయక్ ఎవరికీ చూపకుండా ఓటేశారు.

ఓటింగ్‌కు దూరంగా..

శాసనసభకు వచ్చినా కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకోలేదు. తాను గతంలోనే రాజీనామా చేసినందున ఓటు వేయలేదని రేవంత్ చెప్పారు. శాసనసభలో ఉన్న 119మందిలో కోమటిరెడ్డి వెంటకరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాన్ని ఇటీవల ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో సభలో 117మంది సభ్యులున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి ప్రకటించారు. ఇందులో 108మంది ఓటుహక్కు వినియోగించుకోగా.. బిజెపికి చెందిన ఐదుగురు, టిడిపికి చెందిన ముగ్గురు, సిపిఎంకు చెందిన ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోలేదు.

సంబురాల హోరు..

రాజ్యసభ ఎన్నికల్లో విజయకేతనం ఎగరేసిన సంతోష్‌కుమార్, బండప్రకాష్, బడుగుల లింగయ్య యాదవ్‌ల గెలుపు ప్రకటించగానే.. అసెంబ్లీప్రాంగణంలో, గన్‌పార్క్ వద్ద సంబురాలు మిన్నంటాయి. ఎన్నిక కౌంటింగ్ ప్రారంభమయ్యే సమయానికే.. విజేతలను అభినందించేందుకు మంత్రులు, కార్పోరేషన్ చైర్మన్లు, ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, మేయర్లు, ముఖ్యనేతలు పెద్ద ఎత్తున శాసనసభకు చేరుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కడియంశ్రీహరి, మంత్రులు హరీష్‌రావు, ఈటలరాజేందర్, తుమ్మలనాగేశ్వరరావు, జగదీష్‌రెడ్డి తదితరులు విజేతలను అభినందించారు. కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలివచ్చి నేతలను అభినందనల్లో ముంచెత్తారు. సంబురాల్లో మునిగిపోయారు. రంగులు చల్లి, స్వీట్లు పంచి.. బాణాసంచాకాల్చి తమ అభిమానం చాటుకున్నారు.

బాధ్యత నెరవేరుస్తా: సంతోష్‌కుమార్



రాజ్యసభ అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, పార్టీకి రుణపడి ఉంటానని.. తనకు అప్పగించిన బాధ్యతను నూటికి నూరుపాళ్ళు నెరవేరుస్తానని టిఆర్ఎస్ తరుపున రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన జోగినిపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. రాజ్యసభ సభ్యునిగా విజ యం సాధించి.. రిటర్నింగ్ అధికారి ధృవపత్రం అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కార్యకర్తలకు, నాయకులకు, మద్దతు పలికినవారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆలోచనలకు, ఆదేశాలకు అనుగుణంగా రాజ్యసభలో గళం వినిపిస్తానని, ప్రజల పక్షాన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

బడుగులకు దక్కిన గౌరవం: లింగయ్యాయాదవ్

తమ విజయం బడుగులకు అంకితమని, యాదవులకు రాష్ట్రంలో పెద్దపీట వేస్తూ రాజ్యసభ గౌరవాన్ని ఇచ్చిన తొలిముఖ్యమంత్రి కెసిఆర్ అని ఎంపీగా విజయం సాధించిన బడుగుల లింగయ్యాయాదవ్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు కెసిఆర్ చేసినంతగా గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయలేదని, ముఖ్యమంత్రి.. పార్టీ ఆకాంక్షలకు అనుగుణంగా బలహీనవర్గాల అభ్యున్నతికి తనకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగిస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కెసిఆర్‌కు రుణపడి ఉంటా: బండప్రకాష్

రాష్ట్రచరిత్రలో తొలిసారి ముదిరాజ్‌లను రాజ్యసభకు పంపిన ఘనత కెసిఆర్‌దేనని, ఆయనకు బడుగు బలహీనవర్గాలంతా అండగా నిలవాలని రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన బండ ప్రకాష్ అన్నారు. విజయకేతనం ఎగరవేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు విస్తృత అవకాశాలు ఇస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అందరి ఆశీర్వాదం ఉండాలన్నారు. యావత్ ప్రజానీకం ఆయన వెంట ఉండి చిల్లర రాజకీయం చేస్తున్న చిల్లరపార్టీల భరతం పట్టాలన్నారు.



ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తదితరులు

వరంగల్ రూరల్ జిల్లాలో కొత్తగా పరకాల రెవెన్యూ డివిజన్

• ప్రతిపాదనకు సీఎం ఆమోదం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో కొత్తగా పరకాల రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఫైలుపై శుక్రవారం సంతకం చేశారు. పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెర, నడికుడ మండలాలతో ఈ కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రజల ఆకాంక్షమేరకు తమ ప్రతిపాదనను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి కేసీఆర్

ఆర్థిక మంత్రి ఈటల



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తున్నారని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వెనకబడిన కులాలను ఆదరిస్తూ వారిని ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా చేయూతనిస్తున్నారని కొనియాడారు. అందుకు రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేసిన బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్‌లే నిదర్శనమని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో రాజ్యసభ ఎన్నికలు ముగిసిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. ఎన్నడూ ఏదీ ఆశించకుండా ముది రాజ్‌లకు రాజ్యసభ టికెట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చిన్న వయసులో రాజ్యసభకు వెళుతున్న జోగినపల్లి సంతోష్ కుమార్‌కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని అన్నారు. బలహీన వర్గా లకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తూ వారి ఆదరాభి మానాలు పొందుతున్న తీరును చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేక పోతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కన్నుకుట్టిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఓటింగ్‌లో ఓడిపోతామని తెలిసి కూడా పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం 12 ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ పోటీకి అభ్యర్థిని బరిలోకి దింపడమే వారి ఓర్వలేని తనానికి నిదర్శనమన్నారు.

కాంగ్రెస్‌ది తెలివి తక్కువ పని : జగదీష్ రెడ్డి

రాజకీయ బలంలేని కాంగ్రెస్ పార్టీ ప్రతి సందర్భంలోనూ తెలివి తక్కువ తనాన్ని ప్రదర్శించు కుంటోందని మంత్రి జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి ఆ పార్టీకి చెందిన ఓట్లను కూడా వేయించుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు. ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం తప్పుడు నిర్ణయమని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో తెరాస, ఎంఐఎం మిన హా మరే పార్టీ గెలిచే అవకాశాలు లేవని అభిప్రాయం వ్యక్తంచేశారు.

బీజేపీ యూపేసింది

• 'పెద్ద' పోటీలో కాషాయపార్టీ జయభేరి • రాజ్యసభ ఎన్నికల్లో 27 సీట్లు గెలుపు
• యూపీలో తొమ్మిది స్థానాలు కైవశం • 87కి చేరిన ఎన్డీయే సంఖ్యాబలం
• కాంగ్రెస్ 10, తృణమూల్‌కు 4 స్థానాలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లో 59 రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఎన్డీయే జయభేరి మోగించింది. బీజేపీ సొంతంగా 27 సీట్లను నెగ్గింది. తద్వారా పెద్దలసభలో కాషాయపార్టీ సంఖ్యా బలం 58కి చేరింది. కాంగ్రెస్ 10 చోట్ల విజయం సాధించింది. శుక్రవారం ఆరు రాష్ట్రాల్లో 26 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 10 రాష్ట్రాల్లో 33 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. కేరళలో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. ఉత్తరప్రదేశ్, కర్నాటకలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. క్రాస్‌ఓటింగ్ ఆరోపణల నేపథ్యంలో లెక్కింపు కొద్దిసేపు నిలిపివేసి, ఆ తర్వాత కొనసాగించారు. మొదటి నుంచి ఉత్కంఠను రేపిన యూపీలో బీజేపీ పంతం నెగ్గించుకుంది. మొత్తం పది సీట్లకు గాను తొమ్మిదింటిని బీజేపీ కైవసం చేసుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికలు జరగ్గా, సాయంత్రం ఐదు గంటల నుంచి లెక్కింపు చేపట్టారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్నాటక, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో



పోటీనెలకొనడంతో ఎన్నికలు నిర్వహించారు. తెలంగాణలో జరిగిన మూడు స్థానాలను తెలంగాణ రాష్ట్ర సమితి దక్కించుకుంది. ఆ పార్టీ నుంచి సంతోష్ కుమార్, లింగయ్య యాదవ్, బండి ప్రకాశ్ ముదిరాజ్ గెలుపొందారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మూడు స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం అయింది. తెలుగు దేశం పార్టీ రెండు స్థానాలు, వైకాపా ఒక స్థానం దక్కించుకున్నాయి. తెదేపా నుంచి సీఎం రమేష్, కె రవీంద్ర కుమార్ రాజ్యసభకు ఎన్నికవ్వగా, వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి పెద్దల సభకు ఎన్నికయ్యారు.

2014 సాధారణ ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీ సాధించినప్పటికీ, పెద్దల సభలో మెజార్టీ లోకపోవడం బీజేపీకి ఇబ్బంది కరంగా మారింది. గత నాలుగేళ్లలో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాషాయపార్టీ కూటమికి రాజ్య సభలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు ఈ ఎన్నికలు దోహదం చేశాయి. అయినా, 245 మంది సభ్యులున్న ఎగువ సభలో ఎన్డీయే బలం 87కి చేరింది. యూపీఏ 57 స్థానాలకు పరిమితం కాగా, ఇతరులు 101 మంది పెద్దలసభలో ఉన్నారు.



మాయావతికి 'షా'క్..

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ దెబ్బకు దెబ్బ తీసింది. కొద్దిరోజుల కిందట జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఎస్పీ-బీఎస్పీ కూటమి రెండు స్థానాలను కైవసం చేసుకోవడంతో కాషాయపార్టీ ఖంగుతిన్నది. రాజ్యసభఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించడం ద్వారా నిన్నటి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్లు అయింది. ఎనిమిది మందికి మాత్రమే అవకాశం ఉన్నచోట, అనూహ్యంగా తొమ్మిదో అభ్యర్థిని రంగంలోకి దించడం ద్వారా ఎస్పీ-బీఎస్పీ కూటమిపై పోరాటానికి బీజేపీ తెరలేపింది. ఎస్పీ అభ్యర్థిని పార్టీలో చేర్చుకుని రాజ్యసభ రేసులో నిలబెట్టి వ్యూహాత్మకంగా వ్యవహరించింది. వాస్తవంగా ఇక్కడ సంఖ్యా బలం ప్రకారం బీఎస్పీ అభ్యర్థి అంబేద్కర్ తేలికగా విజయం సాధించాలి. కానీ అమిత్ షా రంగప్రవేశంతో సమీకరణలు రాత్రికి రాత్రే మారాయి. విందు సమావేశాలతో రాజకీయం తేలిపోయింది. ఎస్పీ-బీఎస్పీకి చెందిన ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో మాయావతి అభ్యర్థికి ఓటమి తప్పలేదు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో బీజేపీ అభ్యర్థి నరేష్ అగర్వాల్ విజయం సాధించారు.

ఏ పార్టీకి ఎన్ని సీట్లు

రాష్ట్రం	సంఖ్య	పార్టీ
తెలంగాణ	3	తెరాస (3)
ఆంధ్రప్రదేశ్	3	తెదేపా (2)
		వైకాపా (1)
కర్నాటక	4	కాంగ్రెస్ (3)
		బీజేపీ (1)
కేరళ	1	ఎల్‌డీఎఫ్
బీహార్	6	ఆర్జేడీ (2)
		జేడీయూ (2)
		బీజేపీ (1)
		కాంగ్రెస్ (1)
గుజరాత్	4	బీజేపీ (2)
		కాంగ్రెస్ (2)
హర్యానా	1	బీజేపీ (1)
ఛత్తీస్‌గఢ్	1	బీజేపీ (1)
హిమాచల్	1	బీజేపీ (1)
మధ్యప్రదేశ్	5	బీజేపీ (4)
		కాంగ్రెస్ (1)
మహారాష్ట్ర	6	బీజేపీ (3)
		కాంగ్రెస్ (1)
		శివసేన (2)
ఉత్తరప్రదేశ్	10	బీజేపీ (9)
		ఎస్పీ (1)
ఉత్తరాఖండ్	1	బీజేపీ (1)
ప.బెంగాల్	5	టీఎంసీ (4)
		కాంగ్రెస్ (1)
ఒడిశా	3	బీజేడీ (3)
రాజస్థాన్	3	బీజేపీ (3)
జార్ఖండ్	2	కాంగ్రెస్ (1)
		బీజేపీ (1)

ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 342 • శనివారం 24 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ సప్తమి ఉ. 10.01 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: మృగశిర మ. 3.40 వరకు, అనంతరం ఆరుద్ర; అమృతకాలం: ఉ. 7.20 నుండి 8.50 వరకు; వర్జ్యం: రా.వ 11.30 నుండి 12.58 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుండి 7.30 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

పెద్దల సభకు ఆ ముగ్గురూ...

సంతోషంగా!



• విజేతలకు సీఎం కేసీఆర్ అభినందనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రసమితి.. రాజ్యసభ ఎన్నికలలో విజయ భేరి మోగించింది. ఎన్నికలు జరిగిన మూడు స్థానాలనూ టిఆర్ఎస్ కైవసం చేసుకుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న స్థానాలను డబుల్ చేసుకుంది. మెదక్ ఉప ఎన్నికనుండి ప్రారంభ మైన విజయపరంపరను.. మరోసారి కొనసా గించింది. రాష్ట్రం నుండి రాజ్యసభకు మూడు స్థానాల కోసం ఎన్నిక జరగ్గా.. నలుగురు అభ్యర్థులు పోటీచేశారు. టిఆర్ఎస్ అభ్యర్థులు బండప్రకాష్ ముదిరాజ్ 33, సంతోష్‌కుమార్ జోగినిపల్లి 32, బడుగుల లింగయ్యయాదవ్ 32ఓట్లు సాధించగా.. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు 10ఓట్లు పోలయ్యాయి. శుక్రవారం జరిగిన పోలింగ్ ప్రకారం మొత్తం 108మంది ఓటుహక్కు

2వ పేజీలో...

ఎవరికెన్నెన్ని ఓట్లు

సంతోష్‌కుమార్: 32

బండ్ల ప్రకాష్ : 33

లింగయ్య యాదవ్ 32

కాంగ్రెస్ అభ్యర్థికి తప్పని ఓటమి

కౌంటింగ్‌లో ట్విస్ట్

దొంతిరెడ్డి ఓటు చెల్లదని నిర్ణయం



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు



శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ధర్నా. చిత్రంలో మల్లికార్జున్ ఖర్గే, సుబ్బిరామిరెడ్డి, తెలుగుదేశం ఎంపీ శివప్రసాద్ తదితరులు

అవిశ్వాసంలో కొత్త మలుపు!

మేము సైతం!

• కాంగ్రెస్ పార్టీ హఠాత్ నిర్ణయం • స్పీకర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు • పార్లమెంట్‌లో ఆరో రోజూ అదే తీరు • ఉభయ సభల్లో నిరసనల హోరు వచ్చేవారానికి వాయిదా

11లో



బీజేపీ యూపేసింది!

• పెద్ద పోటీలో కాషాయపార్టీ జయభేరి • 27 సీట్లు గెలుపు • యూపీలో తొమ్మిది స్థానాలు కైవసం • 87కి చేరిన సంఖ్యాబలం • కాంగ్రెస్-10, తృణమూల్‌కి 4

2

లాయర్ చిదంబరం!



శుక్రవారం ఢిల్లీ హైకోర్టు వద్ద లాయర్ కోటులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిదంబరం. తన కుమారుడు కీర్తి చిదంబరానికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

10లో

అన్నాహజారే మళ్లీ దీక్ష!



శుక్రవారం ఢిల్లీలో రామ్‌లీలా మైదానం వద్ద నిరవధిక నిరాహార దీక్షలో అన్నాహజారే. లోక్‌పాల్ కోసం ఏడేళ్ల తర్వాత మళ్లీ అదే మైదానంలో ఆయన ఆమరణ దీక్షకు దిగారు.

10లో

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట



20 మంది ఆప్ ఎమ్మెల్యేల సభ్యత్వాలను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో ఆప్ ఎమ్మెల్యే విజయోత్సాహం

10లో

పన్నులు మావి.. ఫలాలు మీవా?

దక్షిణాది దండయాత్ర



• 15వ ఆర్థికసంఘం తీరుపై దక్షిణాది రాష్ట్రాల ఫైర్

• పన్ను రాబడి పంపిణీ విధానంపై ఆందోళన

• 2011 జనాభా లెక్కల ప్రాతిపదికపై నిరసన

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలపై దక్షిణాది రాష్ట్రాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పన్ను రాబడి పంపిణీకి ఎన్డీయే వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలు చెల్లించే పన్నుల్లో గరిష్ట భాగం ఉత్తరాది రాష్ట్రాలకు దారిమళ్లించడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. తమ ప్రజల కష్టార్జితాన్ని ఉత్తరాదికి అప్పనంగా కట్టబెడతామంటే సహించేది లేదని హెచ్చరిస్తున్నాయి. పన్నుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై తెలంగాణ ముఖ్యమంత్రి వారం రోజులకిందటే ప్రస్తావించారు. 2017 ఆర్థికసంవత్సరంలో తాము 50వేల కోట్లు పన్నురూపంలో కేంద్రానికిస్తే, తమకు తిరిగి వచ్చింది కేవలం 24,561 కోట్ల రూపాయలేనని చెప్పారు. కేంద్రానికి తెలంగాణ 25,452 కోట్లు ఇస్తోందని, ఈ విషయాన్ని అమిత్‌షా గుర్తించుకోవాలని హెచ్చరించారు. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో

10వ పేజీలో...

రూ.40 కోట్ల చేనేత రుణాల మాఫీ

• ఒక్కొక్కరికి రూ.లక్ష వరకు రుణమాఫీ

• 2010 ఏప్రిల్ నుంచి అమలు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చేనేత కార్మికులకు రూ.40 కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2010 ఏప్రిల్ నుంచి ఈ రుణమాఫీ వర్తిస్తుందని, ఒక్కొక్కరికి లక్ష వరకు మాఫీ చేస్తున్నట్లు పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తూ గతంలో ఇచ్చిన జీవోను సవరిస్తూ నూతనంగా మరొక జీవో జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ జీవో ద్వారా 2010 నుంచి రుణాలు తీసుకున్న చేనేత కార్మికుల మూలధన రుణాలను లక్ష వరకు మాఫీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత చేనేత కార్మికులు జాతీయ బ్యాంకుల నుంచి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి చేనేత ఉత్పత్తులకై 2014

5వ పేజీలో...



శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దశాబ్ది వేడుక సందర్భంగా ఎయిర్‌పోర్ట్ విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ శంఖుస్థాపన. చిత్రంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు

మెట్రోరైల్ కనెక్టివిటీ రెండేళ్లలో పూర్తి

విమాన ఇంధనంపై పన్ను తగ్గింపు!

• 16 నుంచి 1శాతానికి తగ్గిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటన

• జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సిటీ దేశంలోనే అతిపెద్దది: జీఎంఆర్

6లో

ఔరా..!



ఫ్రాన్స్‌లో ఐఎస్ ఉగ్రవాది ఉన్మాదం

సూపర్ మార్కెట్ దిగ్బంధం

• కాల్పుల్లో ముగ్గురి దుర్మరణం

10లో



సుంకాల సమరం!

• దిగుమతులపై పరస్పర సుంకాలు • చైనా మేధోసంపత్తి చౌర్యం • డబ్ల్యూటీఓలో తేల్చుకుంటాం • డ్రాగన్‌కు అమెరికా సవాల్

• హక్కులు, ప్రయోజనాలకోసం ఏమైనా చేస్తాం

• చైనా స్పష్టీకరణ • ఇరు పక్షాల పంతం

• అమెరికాలో 20 లక్షల ఉద్యోగాలకు గండం



బీజింగ్: అమెరికా దిగుమతులపై భారీ సుంకాలు విధించే ప్రణాళికలను చైనా శుక్రవారం వెల్లడించింది. చైనా నుంచి దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై అమెరికా సుంకాల విధింపునకు ప్రతిగా 3 బిలియన్ డాలర్ల విలువైన 128 అమెరికా సరకులపై చైనా భారీ సుంకాలు విధించనుంది. ఈ మేరకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేసింది. పండ్లు, పప్పు గింజలు, మద్యం(వైన్స్), అతుకులేని ఉక్కు గొట్టాలు, తదితర సరకులపై 15 శాతం, పంది మాంసం, పునరుపయోగ అల్యూమినియం వస్తువులపై 25 శాతం దిగుమతి సుంకాన్ని విధించినుంది. పెంచిన సుంకాలను రెండు దశల్లో అమలు చేస్తుంది. ఇరు దేశాలు నిర్దేశిత కాలవ్యవధిలో వాణిజ్య అంశాలపై

5వ పేజీలో...

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శనివారం 24 మార్చి 2018

దిద్దుబాటుకు ఓ అవకాశం!

కొంత కాలంపాటు లాభదాయక పదవులను నిర్వహించిన 20 మంది ఆమ్ ఆద్మీపార్టీ ఎమ్మెల్యేల సభ్యత్వాలను కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సుపై రాష్ట్రపతి రద్దు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు కొట్టివేయడంతో ఢిల్లీలో ఆ పార్టీ పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకుంది. ఆప్ ఎమ్మెల్యేల తప్పు లేకుండానే సభ్యత్వాలను రద్దు చేశారన్న భావం ధ్వనించేలా రీతిలో కేజ్రీవాల్ ప్రకటన చేశారు. కానీ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ సారథి,ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూనే ఉన్నారు. సారీ చెప్పి బయటపడుతున్నారు. రాజకీయాల్లోనే కాదు,పాలనా వ్యవహారాల్లో వారికి ఏ మాత్రం అనుభవం లేదన్న విషయం అడుగడుగునా రుజువు అవుతూనే ఉంది. ప్రజా సేవా రంగంలో ప్రవేశించడానికి ముందు కేజ్రీవాల్ ఆదాయం పన్ను శాఖ జాయింట్ కమిషనర్. అవినీతికి వ్యతిరేకంగా, గాంధేయవాది అన్నా హజారే ప్రారంభించిన ఉద్యమం ద్వారా ప్రజాసేవా రంగంలో కేజ్రీవాల్ ప్రవేశించారు. ఆ ఉద్యమంలో కొనసాగిన ఆతకాలం హజారేకి విశ్వాస పాత్రంగానే ఉన్నారు. తర్వాత రాజకీయంగా ఎదగాలనే కోర్కె తో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పేరిట సొంత కుంపటి పెట్టుకున్నారు. అవినీతిపై పోరాడేవారు పార్టీలకు అతీతంగా ఉండాలని, రాజకీయ పార్టీ పెట్టవద్దని కేజ్రీవాల్ కు ఆనాడే హజారే సలహా ఇచ్చారు. ఆయన సలహాను కేజ్రీవాల్ పెడచెవిన పెట్టారు. అందుకు ఫలితంగా రాజకీయాల్లో అడుగడుగునా ఎదురు దెబ్బలు తింటూనే ఉన్నారు. కేజ్రీవాల్ తో అన్నా హజారే ఉద్యమంలో పని చేసిన జస్టిస్ సంతోష్ హెగ్డే, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సామాజిక ఉద్యమ కారుడు యోగేంద్ర యాదవ్ వంటి వారు కూడా కేజ్రీవాల్ ధోరణి నచ్చక ఆయనకు దూరం అయ్యారు. వీరంతా ఒకప్పుడు కేజ్రీవాల్ కి అత్యంత సన్నిహితులు. రాజకీయాల్లో ప్రవేశించి కేజ్రీవాల్ నష్టపోలేదు. దేశ రాజధాని నగరానికి ముఖ్యమంత్రయ్యారు.ఆయన మొదటి నుంచి పోరాట ధోరణి కనబరిచారు. అధికారాన్ని చేపట్టిన తర్వాత పద్ధతి మార్చుకుని ఉంటే హుందాగా ఉండేది. ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన కొద్ది రోజులకే మునిసిపల్ కార్మికుల తరఫున ఢిల్లీ రోడ్లు పై ధర్నా చేసి పలుచన అయ్యారు. ఇలాంటి తప్పటడుగులు ఆయన ప్రతిష్ఠను ఆనాడే మసకబార్చాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి,తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ మాదిరిగా ఆయన అధికారంలో ఉన్నా ప్రతిపక్ష పాత్రని పోషిస్తూ ఉండటం వల్ల సొంతవారి నుంచే కాక, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.

ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేలలో చాలా మందికి నాలుగేళ్ళ పదవీ కాలం పూర్తవుతున్నా ఈనాటికీ పార్లమెంటరీ వ్యవహారాల గురించి తెలియదు. మంత్రులుగా ఉన్నవారికి విధివిధానాలు తెలియవు. వీరంతా వెర్వేరు సందర్భాల్లో చట్టానికి చిక్కుకుని కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారు. కేజ్రీవాల్ మంత్రివర్గ సహచరుల్లో సోమనాథ్ భారతి గృహ హింస కేసులో అరెస్టయ్యారు. ఒక ఎమ్మెల్యేపై నకిలీ డిగ్రీ కేసులో కేసు నమోదు అయింది. ఇటీవల ఒక ఎమ్మెల్యే ఢిల్లీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిపై దాడి కేసులో అరెస్టు అయి ఇటీవల అతి కష్టంమీద బెయిల్ పై విడుదలయ్యాడు. కపిల్ మిశ్రా అనే ఎమ్మెల్యే కేజ్రీవాల్ ఎవరెవరి వద్ద ఎంత మొత్తం ముడుపులు తీసుకున్నాడో వివరాలతో జాబితా బయటపెట్టాడు. కుమార్ విశ్వాస్ అనే మరో ఎమ్మెల్యే కేజ్రీవాల్ రాజ్యసభ టికెట్లు అమ్ముకున్నారంటూ పల్లిగానే ధ్వజమెత్తారు. సొంత ఎమ్మెల్యేలను అదుపులో ఉంచుకోలేని అసమర్థ ముఖ్యమంత్రిగా ముద్రవేయించుకున్నారు. వీరందరూ ఒక ఎత్తు అయితే, కేజ్రీవాల్ నోటి దురుసుతనం, కొండను కొట్టాలనే అత్యాశ వల్ల అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికారాల కోసం పోరాడటం తప్పు లేదు. చట్ట ప్రకారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కే ఎక్కువ అధికారాలు ఉన్నాయి.దానికి ఆ పదవిలో ఉన్నవారేం చేస్తారు. పూర్వపు గవర్నర్ నజీబ్ జంగ్ తో ప్రతిరోజూ గొడవ పడేవారు. కేంద్రంలో ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులపై కోపాన్నంతా లెఫ్టినెంట్ గవర్నర్ పై వెళ్ళగక్కేవారు. తర్వాత ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీపై వారణాసి నియోజకవర్గంలో పోటీ చేసి అభాసు పాలయ్యారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ నిధులను స్వాహా చేశారని ఆరోపించి పరువు నష్టం దావాను ఎదుర్కొన్నారు. ఈ దావాలో ఆధారాలు చూపలేక సారీ చెప్పారు.అదును తొక్కడం కాలు కదగడం అనే చందంగా ఎంతో మంది పై బురద జల్లి వివరికి సారీ చెప్పడం ఆయనకు నిత్య కృత్యం అయింది. కేజ్రీవాల్ హర్యానాకు చెందిన వారు.పంజాబ్,గోవా,గుజరాత్ తదితర రాష్ట్రా ల్లో పార్టీ శాఖలు ఏర్పాటు చేసి అవి నడపలేక చతికిలపడ్డారు.దక్షిణాదికి కూడా పార్టీని విస్తరింపజేసేందుకు ఆయన బెంగళూరు,చెన్నై, తదితర నగరాల్లో పర్యటించారు. తమిళనటుడు కమల్ హాసన్ ఇటీవల కొత్త పార్టీ ప్రారంభించే సందర్భంగా నిర్వహించిన సభకు హాజరై అభాసుపాలయ్యారు. కేజ్రీవాల్ ఉద్దేశాలు మంచివే అయినా ఆయనకు రాజకీయ, పాలనానుభవం లేకపోవడం, తొందరపడి నోరు జారడం, పెద్దవారితో పెట్టుకుంటే రాత్రికి రాత్రి తాను కూడా పెద్దవాడై పోవాలనే యావ కారణంగా ఆయన ఇప్పటికీ తప్పటడుగులు వేస్తూనే ఉన్నారు.పార్టీ నెలకొల్పిన తొలి ముఖ్యమంత్రి పగ్గాలు పట్టిన సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవటంలో కేజ్రీవాల్ విఫలమయ్యారు. ఒకసారి ఎదురు దెబ్బ తిన్న తర్వాతైనా పద్ధతి మార్చుకోలేకపోవడం ఆయనలో మొండి పట్టుకు నిదర్శనం. ఢిల్లీ దేశ రాజధాని కనుక,అంతర్గత భద్రత కేంద్రం చేతుల్లోనే ఉంటుంది. ఢిల్లీ పోలీసులపై తమకు అజమాయిషీ లేదంటూ ఒకసారి..కరెంట్ ఇవ్వడం లేదని మరోసారి కేంద్రంతో గొడవ పెట్టుకున్నారు.ఆ కోవం ఢిల్లీ పెద్దలకు ఇది. అడుగడుగునా కేజ్రీవాల్ అనుభవ రాహిత్యాన్ని బహిర్గతం చేసేందుకు ఆనాడు యూపీఏ ప్రభుత్వం ప్రయత్నించింది. ఇప్పుడు ఎన్డీఏ కూడా అదే చేస్తోంది. కేజ్రీవాల్ మంత్రుల్లో అనుభవజ్ఞులు లేకపోగా రోజువారీ కేసుల్లో ఇరుక్కుని పార్టీకి,ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు.ప్రస్తుత లాభదాయక పదవి కేసు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఇరవై మంది ఎమ్మెల్యేలను సంజాయిషీ చెప్పుకొనేందుకు గడువు ఇచ్చింది. ఆ గడువులోగా సంజాయిషీ ఇచ్చి ఉంటే సభ్యత్వాలు రద్దయి ఉండేవి కావు. కేజ్రీవాల్ కూడా మొదట్లో సారీ చెప్పేందుకు అంగీకరించలేదు. ఎదురు దెబ్బతో తలబొప్పి కట్టడంతో దిగివచ్చారు. ఈ కేసులో కేంద్రంపై ఆయన ధ్వజమెత్తడానికి అవకాశాన్ని కేంద్రమే ఇచ్చింది. అచల్ కుమార్ జోషి కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి పదవి నుంచి రిటైరవడానికి ముందు రోజు ఆప్ ఎమ్మెల్యేల సభ్యత్వ రద్దు కోసం రాష్ట్రపతికి సిఫార్సు చేశారు.ఈ కేసు అంతకుముందు చాలా రోజులుగా నలుగుతున్నా ఆయన రిటైరయ్యే ముందు ఫైలు మీద సంతకం చేయడంతో కేంద్రమే చేయించిందన్న ఆరోపణ కేజ్రీవాల్ చేయడానికి వీలు కలిగింది. సంజాయిషీ ఇవ్వడానికి ఎమ్మెల్యేలు హాజరు కానప్పుడే చర్య తీసుకుని ఉంటే ఆప్ ఎమ్మెల్యేలపై సానుభూతి వచ్చి ఉండేది కాదు. ఏమైనా, ఇంతవరకూ చేసిన తప్పులను, చేసిన తప్పటడుగులను సమీక్షించుకుని ఇకపై జాగ్రత్తగా,హుందాగా వ్యవహరించడం కేజ్రీవాల్ విద్యుక్త కర్తవ్యం.

మంచి మాట

ప్రత్యామ్నాయాలు పెరిగే కొద్దీ
మన ఎంపిక కష్టమౌతుంది.
-అల్లనివాల్

బ్రిటన్, రష్యా విష యుద్ధం!



-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

స్క్రిపాల్ అనే డబుల్ ఏజెంట్‌కు విష ప్రయోగం చేసి రష్యా దురాక్రమణచర్యకు పాల్పడిందంటూ బ్రిటిష్ ప్రధాని థెరిసామే ఆరోపించడం రేపిన సంచలనం అంతాఇంతా కాదు. ప్రపంచ దేశాలకు ఇది వార్తయితే..రెండు దేశాల నడుమ దౌత్య యుద్ధం నెలకొనే పరిస్థితి ఏర్పడింది. వీరి మధ్య సంబంధాలు 1980వ దశకంలో క్రూయెజ్ క్షిపణుల సంక్షోభం నాటి పరిస్థితులను తలపిస్తున్నాయి.

బ్రిటన్‌లోని శాల్సిబరీలోని ఒక పార్క్ బెంచిపై స్క్రిపాల్, ఆయన కుమార్తె యూలియా తీవ్ర అస్వస్థతతో లేవలేనిస్థితిలో ఈ నెల 4న కనిపించడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. 2006లో రష్యా మిలటరీ ట్రిబ్యునల్ స్క్రిపాల్‌కి దేశ ద్రోహం కింద శిక్ష విధించింది. ఆయన రష్యా విదేశీ గూఢచర్య విభాగంలో పని చేసేవాడు. 2010లో గూఢచారుల మార్పిడిలో ఆయన శాల్సిబరీ వచ్చి స్థిరపడ్డాడు.

స్క్రిపాల్‌నీ, ఆయన కుమార్తెనూ హతమార్చేందుకు రష్యా విషప్రయోగం చేసిందని బ్రిటన్ అనుమానిస్తోంది. వారిద్దరూ అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్నదాన్ని బట్టి విషప్రయోగం జరిగి ఉండవచ్చని అనుమానిస్తోంది. ఈ విషప్రయోగం వారిని అత్యంత ప్రమాదకర పరిస్థితికి నెట్టడమే కాకుండా మరో 18 మందిని అస్వస్థులను చేసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలో ఒక పోలీసు అధికారి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఈ విషయం బయటపడింది. స్క్రిపాల్ ఇంట్లో ఆయన దుస్తులు, వారు తిన్నపదార్థాలను బ్రిటిష్ దర్యాప్తు అధికారులు పరిశీలించినప్పుడు కూడా ఈ విషయం బయటపడింది. రష్యాయే ఈ ప్రయోగం చేయించిందని బ్రిటిష్ అధికారులు ఆరోపించారు.

బ్రిటిష్ ప్రభుత్వమైతే రష్యా ప్రభుత్వంపైనా, ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై నేరుగా ధ్వజమెత్తింది. స్క్రిపాల్‌పై రసాయనిక దాడి చేశారని ఆరోపించింది. 23 మంది రష్యన్ దౌత్యవేత్తలను బహిష్కరించింది. మరిన్ని ప్రతీకార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

రష్యా తమ దౌత్యవేత్తలను బ్రిటన్ బహిష్కరించినందుకు ఆందోళన చెందడం లేదు. బ్రిటన్ ఆంక్షలకూ బెదరడం లేదు. రష్యాపై పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఇప్పటికే అమలులో ఉన్నాయి. క్రిమియాను రష్యా ఆక్రమించుకున్న తర్వాత పాశ్చాత్య దేశాలు ఈ ఆంక్షలు విధించాయి. వాటితో పోలిస్తే వీటి పరిధి తక్కువ. ఏ దేశద్రోహి ఎక్కడా భద్రంగా ఉండలేడంటూ రష్యా అందించిన సందేశం ప్రతిదేశాన్నీ అప్రమత్తం చేసే పిలుపే. రష్యా అధ్యక్షుడు పుతిన్ తన ఇష్టానుసారం అస్త్రాలను ప్రపంచంలో ఎక్కడైనా ప్రయోగించ లేరన్న గట్టి హెచ్చరిక చేయాల్సి ఉంటుంది.

ఈ సంఘటన 1966లో ఆనాటి భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. ఆనాడు శాస్త్రీజీ అనుమానాస్పద స్థితిలో మరణించారన్న అనుమానం చాలామందిలో ఇప్పటికీ ఉంది. నెర్వ్ ఏజెంట్, విషం పులిమిన అణుపదార్థాలు ఎటువంటి ఆధారాలు లేకుండా ఇతరుల ప్రాణాలను తీస్తాయి. మరణించే సమయానికి ఆయన బాగానే ఉన్నారు. దేశ ప్రధానమంత్రిగా ఉన్న నాయకుని ఆరోగ్యాన్ని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. అటువంటి వ్యక్తికి ఉన్నపళంగా గుండెపోటు ఎలా వచ్చిందన్న ప్రశ్నకు సరైన సమాధానం లేదు. పాలస్తీనా విమోచనా సంస్థ నాయకుడు యాసర్ అరాఫత్ కూడా విషప్రయోగం వల్లే మరణించారనేది ఇప్పటికీ చాలా మంది అనుమానం.

ప్రస్తుత విషయానికి వస్తే, ఈ ఆరోపణలన్నింటినీ రష్యా తోసిపుచ్చవచ్చు. ప్రస్తుత పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే విషయం ఏమిటంటే, బ్రిటన్ లో నానాటికీ పెరుగుతున్న రష్యన్ వలసవాదులు. వీరంతా క్రెమ్లిన్ నుంచి వచ్చిన మంచి స్థానాల్లో ఉన్నారు. లండన్‌లో ఉంటున్న పుతిన్ అనుకూలురపై బ్రిటిష్ ప్రధాని థెరిసా మే ఎటువంటి చర్య తీసుకోనున్నారో ఇదమిత్థంగా తెలియదు. ఎంతటి ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రముఖులపైనైనా చర్యలు తీసుకునేందుకు మనీ ల్యాండరింగ్ చట్టాలు చాలా పటిష్ఠంగా ఉన్నాయని ఆమె విశ్వసిస్తున్నారు.

పుతిన్ అనుకూలురుపై ఈ చట్టాన్ని ప్రయోగించే అవకాశం ఉన్నట్టు ఆమె సంకేతాలు ఇచ్చారు. బ్రిటన్ తన స్పందనను పాత అనుభవాలను బట్టి రూపుదిద్దుకోవచ్చు. 2006లో రష్యన్ ఏజెంట్ అలెగ్జాండర్ లిట్ వినెంకో హత్యకు గురి అయ్యాడు. ఆ సమయంలో థెరిసా మే హోం మంత్రిగా



డెడ్లీ నెర్వ్ ఏజెంట్ అంటే.... సెకన్లలో ప్రాణం తీస్తుంది. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన, భయంకరమైన విష ప్రయోగం. 1970లో సోవియట్ శాస్త్రజ్ఞులు ఎందుకు కనుగొన్నారో శాస్త్రజ్ఞులు ఇప్పుడు శోధనలు చేస్తున్నారు. శాల్స్‌బరీ దాడిలో ఉపయోగించిన విషం నెర్వ్ ఏజెంట్ లో నోవిచోక్ లేదా న్యూకమర్ అని బ్రిటిష్ దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు.

రష్యా వద్ద ఇలాంటి విషఆయుధాలు కుప్పతెప్పలుగా ఉన్నాయని బ్రిటిష్ విదేశాంగ శాఖ కార్యదర్శి బోరిస్ జాన్సన్ ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా తమ శత్రువులపై ప్రయోగించేందుకు రష్యా వీటిని కుప్పలుగా పేర్చిందని అంటున్నారు. స్క్రిపాల్ కుమార్తె యూలియా మార్చి 3వ తేదీన మాస్కో నుంచి లండన్ బయలుదేరినప్పుడు కానీ, స్క్రిపాల్ బిఎండబ్ల్యూ కారులో కాని దీనిని ప్రయోగించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

వారు. వీరిలో మాజీ సామ్రాజ్యాధినేతల కుటుంబాల వారున్నారు. ఐశ్వర్యవంతులు ఉన్నారు. పదేళ్ళుపైగా వీరి తాకిడి ఎక్కువైంది. ఇలా వచ్చిన వారంతా బ్రిటిష్ రాజధాని రూపురేఖలనూ, సామాజిక పరిస్థితులను మార్చారు. వీరంతా బ్రిటన్ ఆస్తులను దోచుకుంటున్నారని కొందరు విమర్శకులు పేర్కొంటుంటారు.

నిజానికి సోవియట్ యూనియన్ పతనం అనంతరం అక్కడి నుంచి వచ్చిన వారందరికీ లండన్ అసలు రాజధాని అయింది. అంటే వారి ప్రాబల్యం అంతగా పెరిగిందన్న మాట. అందువల్ల ప్రధాని థెరిసా మే చర్యలు తీసుకోవడం అంత తేలిక కాదు. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో కన్నా రష్యా ఇప్పుడు ఎక్కువ మంది ఏజెంట్లను లండన్‌లో నియోగించింది. వీరికి వివిధ రకాల పనులు అప్పగించింది. బ్రిటిష్ రాజకీయవేత్తలతో సంబంధాలు మెరుగు పర్చుకోవడం వీటిలో ముఖ్యమైంది. వివిధ రంగాల్లో స్థిరపడిన రష్యన్ దిగ్గజాల పై నిఘావేసి ఉంచడం కూడా ఇందులో ఉంది. ఈ దిగ్గజాల్లో పుతిన్‌కి అనుకూలురు, వ్యతిరేకులూ కూడా ఉన్నారు. స్థిరాస్తి వ్యవహారాలు, బ్యాంకింగ్ పరిశ్రమ వంటి రంగాల్లో రష్యన్లు ఉండేవారు. ఆ సంఘటన రష్యన్‌ల ఆస్తుల స్వాధీనానికి, దౌత్యవేత్తల బహిష్కరణలకూ దారి తీసింది. మిలటరీ గ్రేడ్ నెర్వ్ ఏజంట్‌పై కొన్ని దుష్టశక్తులు పట్టు సాధించడం వల్లనే ఇలాంటివి జరుగుతున్నాయని రష్యా రహస్యంగా అంగీకరించింది. ఈ వాదాన్ని సమర్థించే వారు చాలా కొద్దిమంది మాత్రమే. ఇందులో ఒక ఒప్పుకోలు ప్రకటన కూడా ఉంది. రసాయనిక, విషపూరిత పదార్థాలపై ప్రభుత్వం పట్టు కోల్పోయిందన్నదే ఆ ప్రకటన.

బ్రిటన్, రష్యా మధ్య విశ్వసనీయతను ప్రోది చేయడానికి ఏళ్ళ తరబడి కృషి సాగుతోంది. రష్యా సరైన రీతిలో స్పందించకపోవడం వల్ల ముందుకు సాగడం లేదు. రష్యా తమ దేశంపై చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిందని ఆరోపించింది. తన చేతుల్లో ఉన్నది చేసింది. తదుపరి బహుముఖమైన చర్యలకు అమెరికా, యూరోపియన్ యూనియన్‌ల మద్దతును కూడగట్టవచ్చు.

యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలన్న (బ్రెగ్జిట్) నిర్ణయం, రష్యాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సంబంధాలు మొదలైనవి పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత పరిస్థితి థెరిసా మే, బ్రిటిష్ విదేశాంగ శాఖలకు సవాల్ వంటిదే. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, రాజీ పరిష్కారం వైపు మొగ్గు చూపుతున్నాయి. రష్యాతో ఘర్షణ పంథా వద్దని సూచించడమే. రష్యా అధ్యక్షునిగా పుతిన్ నాలుగో సారి ఎన్నిక కావడంతో ఆయన మరింత దూకుడుగా వ్యవహరించవచ్చు. రష్యాను వ్యతిరేకించే వారు రష్యాలో వచ్చే వేసవిలో జరిగే వరల్డ్ కప్ లో ఆడేందుకు వ్యతిరేకించవచ్చు.

మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు, ఆంక్షలువిధించేందుకు,మనీ ల్యాండరింగ్ చట్టానికి సవరణలు వంటివి కొంతమంది మంత్రులు ప్రవేశపెట్ట వచ్చు. రష్యా జైలులో టాక్స్ సలహాదారు సెర్గీ మాగ్నిస్టిక్సీ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ప్రభుత్వం మద్దతుతో కుంభకోణం జరిగిందన్నవిషయం ఆయన బయటపెట్టారు.

సైనికంగా , బ్రిటిష్ సైన్యం వంతులవారీ పద్ధతిలో ఇప్పటికే ఎస్టోనియాలో ఉంది.అయితే, బెలారస్‌కి సమీపంలో నాటో ఎక్కువ దళాలను మోహరించడాన్ని రష్యా అంగీకరించకపోవచ్చు. బ్రిటన్‌కి రెండే రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అందువల్ల రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా యూకే ప్రకటించవచ్చు. దాంతో అమెరికాలో రష్యాపై అనేక ఏకపక్ష ఆంక్షలు విధించేందుకు వీలుంది. ఆయుధాల ఎగుమతులు, విక్రయాలపై ఆంక్షలువంటివి వీటిలో ఉన్నాయి. ఆర్థికపరమైన ఆంక్షలు విధించేందుకు అవకాశముంది. వీసాల నిషేధానికి వీలుంది.

అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలకు వీలు కల్పించే స్విఫ్ట్‌తో రష్యన్ బ్యాంకులు తెగతెంపులు చేసుకోవాలని యూకే సిఫార్సు చేసుకోవచ్చు. ఇరాన్‌తో సంబంధాలు ఉన్న రష్యన్ బ్యాంకులు ఇప్పటికే ఈ వ్యవస్థతో సంబంధాలు తెంచుకున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా బలహీన పడటానికి ఈ చర్యలు దోహదం చేయవచ్చు.

ఈ ప్రత్యామ్నాయాలన్నీ సామాన్యమైనవే. రష్యాను దోషిగా నిలబెట్టవచ్చు. పుతిన్ దీనిని వచ్చే సమ్మర్ ఒలింపిక్స్‌లో ప్రచారాస్త్రంగా వినియోగించుకోవచ్చునని బ్రిటన్ అత్యున్నత దౌత్య వేత్త బోరిస్ జాన్సన్ ఇటీవల బ్రిటిష్ పార్లమెంటులో హెచ్చరించారు. 1936 ఒలింపిక్స్‌లో నాజీ జర్మనీ గొప్పతనాన్ని చాటుకునేందుకు ఉపయోగించుకున్నట్టుగా పుతిన్ ప్రస్తుత పరిస్థితిని వినియోగించుకోవచ్చునని ఆయన అన్నారు. కవ్వింపు ధోరణిలో చేసిన ఈ ఉపమానం రష్యాలో తీవ్ర ప్రతిస్పందన వచ్చింది.

దీనివల్ల చెడు జరుగుతుందని బ్రిటన్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. బ్రిటన్‌లో ప్రతిపక్ష లేబర్ పార్టీ అసలు రష్యన్ ఒలింపిక్స్ నుంచి బ్రిటన్ ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేసింది. స్క్రిపాల్‌పై దాడిని ఉగ్రదాడిగా అభివర్ణించడాన్ని రష్యా ఖండించింది. తమ దేశాన్ని అప్రదిష్ట పాలు చేయడానికి ఇదంతా బ్రిటన్ స్వయంగా చేయించిందేమోనన్న అనుమానాన్ని వ్యక్తంచేసింది. తమ భూభాగంలో ఉగ్రదాడి నుంచి రష్యన్ పౌరుణ్ణి బ్రిటిష్ రక్షించలేకపోయిందనీ, లేదా తానే చేయించిందేమోనని రష్యన్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్ష ఎన్నికకి ముందు ఈ ఉదంతం చోటు చేసుకుంది. రష్యన్ ఎన్నికలపై ప్రభావం పడటం కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారాలను బ్రిటనే చేయించిందేమోనన్న అనుమానాన్ని ఆ అధికారి వ్యక్తం చేశారు. శాల్సబరీ సంఘటనకూ, సిరియా యుద్ధానికీ ముడిపెట్టే ప్రయత్నం కూడా చేస్తున్నారని రష్యన్ అధికారులు వ్యాఖ్యానించారు.

తెలుగు రాష్ట్రాలలో దాహం.. దాహం..

రాష్ట్రంలో వైద్యరంగంలో గుంటూరుకు అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి ఉంది. ఎంతోమంది మంచి నైపుణ్యం కలిగిన వైద్యులను ప్రపంచానికి అందించిన ఖ్యాతి కూడా గుంటూరు వైద్య కళాశాలకు ఉంది. కాని ఏం లాభం.. కేవలం ముందు జాగ్రత్తలతో నివారించే డయేరియా వ్యాధిని అదుపు చేయలేక పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇది పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. డయేరియా రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్క గుంటూరు జిఎస్‌హెచ్ లోనే అధికారిక లెక్కల ప్రకారం 680 మంది చికిత్స పొందగా 8 మంది మృత్యువాత పడ్డారు. ఇక ప్రైవేట్ ఆసుపత్రులలో మరో 1300 మంది చికిత్స పొందారని సమాచారం. 2013లో సమగ్ర మంచినీటి పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు ప్రారంభమైనా, అధికారులు కాంట్రాక్టు సంస్థల నిర్లక్ష్యం కారణంగా కొత్త పైపులైన్లు వేయలేదు. ఫలితం పైపులైన్ల లీకేజీతో మురుగునీరు కలిసిపోయి నీరు కలుషితమై కుళాయిల ద్వారా సరఫరా కాబడింది. ఈ నీరు తాగిన వారికి డయేరియా వ్యాపించింది.


ప్రకృతిలో జీవమున్న ప్రతి ప్రాణికి జలమే జీవనాధారం. మంచినీరే లేకుంటే ప్రాణాంతకమే... జీవుల శరీర కణజాలానికి అవసరమైన ఖనిజ లవణాలు చాలావరకు నీటి ద్వారానే లభిస్తాయి. శరీరంలో జరిగే ప్రతి రసాయనిక చర్యకు జీర్ణక్రియ ఇతర జీవక్రియలకు నీరు తోడ్పడుతుంది. ఆహారం లేకుండా కొద్దిరోజుల వరకు బతకవచ్చు కానీ నీరు లేకుండా 4-9 రోజులకు మించి బతకలేరు. జీవులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ, జీర్ణమైన ఆహారం సంగ్రహణ ప్రక్రియ, విసర్జన క్రియలు ఆలస్యంగా జరుగుతాయి. దీనివల్ల అజీర్తి, మలబద్దకం, చర్మం పొడిబారటంతో పాటు మూత్రసంబంధమైన సమస్యలు ఏర్పడతాయి. నీటి లభ్యత బాగా తగ్గితే రక్తం చిక్కబడుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. జీవులు చనిపోతాయి. మనలాంటి ఉష్ణమండల దేశాల్లోని జీవులకు ముఖ్యంగా ఎండాకాలం నీటి అవసరత మరింత ఎక్కువ. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తీవ్ర కొరత ఏర్పడుతోంది. దాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి కాలాలు వస్తున్నాయి. పోతున్నాయి. కానీ గ్రామీణ ప్రాంతాలలో ప్రజల గొంతెండి పోతోంది. తమ నీటి వెతల్ని తీర్చేవారు ఎవరా అని కనిపించిన ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడుతూ నిరాశ నిండిన ముఖాలతో కనిపిస్తుంటారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలోని పరిస్థితులు కడుదయనీయం. వరుసగా నాలుగేళ్ళ నుంచి కరవు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న ఈ జిల్లా ప్రజలు, గుక్కెడు మంచినీళ్ళ కోసం అల్లాడుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని పుచ్చకాయలపల్లె ఫ్లోరైడ్ పీడిత గ్రామం ఈ ఊరిలోని వారికి ఒక్కొక్క కుటుంబానికి రోజుకి మూడు బిందెల నీరు దొరికితే పెద్ద పండుగే. బిందెలు పట్టుకొని బారులు తీరి చెలమలవంక, చెరువులవంక, గ్రామంలోకి వచ్చే నీటి ట్యాంకర్లవైపు పరుగులు తీస్తూ కనిపిస్తారు. ఈ గ్రామ జనాభా సుమారు 2 వేలు, గ్రామంలో 700 నుంచి 800 అడుగుల లోతుకు తవ్వినా నీరు పడని దుస్థితి. నీరు పడిన ఫ్లోరైడ్ ప్రభావిత నీటిని వాడుకోవటం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. జిల్లాలోని 56 మండలాలలోను ఇదే పరిస్థితి. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటి చెరువులు, కుంటలు, బావులు వట్టిపోవడం ఇందుకు కారణం... ఇక్కడి దొనకొండ గ్రామంలోని పరిస్థితి మరీ దారుణం. కృష్ణానుండి ఒకకుండ నీళ్ళు తెచ్చుకోవాలంటే గజ్జలకొండకు 45 నిమిషాల ప్రయాణం చేయాలి. వేసవి వస్తుందంటేనే ఈ గ్రామస్థులు గుండెలు దడదడ లాడతాయి. ఇటు నీళ్ళు లేక, అటు పనులకు పోలేక వచ్చే కాస్త ఆదాయం కోల్పోయి అష్టకష్టాలు పడుతున్నారు. ఇక మార్కాపురం మండలం జమ్మనపల్లె గ్రామస్థులకు స్నానం విలాసవంతంగా మారిందని గ్రామస్థులన్నారు. ఈ ప్రాంత వాసుల ఆశాకిరణమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు వేచి చూడాలి? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ నీటి అవసరాలు తీరుతాయని ఆ ప్రాంతవాసులు ఆశపడుతున్నారు. సుంకేశుల ప్రాజెక్టు గురించి చెప్పనవసరం లేదు ఈ ప్రాజెక్టుకు 1996 లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 15.25 లక్షల మందికి తాగునీరు, 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. గత 21 ఏళ్ళుగా ఈ ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది.

ఇక తెలంగాణా రాష్ట్రంలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని గదిగూడ, నార్నూర్ మండలాల్లోని పిప్రీ, కుండీ, సుంగపూర్ గ్రామాలలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు గ్రామాల్లోని 2000 మందికి వేసవి కాలం ఒక పరీక్షా కాలం. ఆదిమ గోండులు, కోలం, అంధులు ఈ గ్రామాల్లో నివసిస్తుంటారు. నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజల విషాదం అంతా ఇంతాకాదు. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ బాధిత పీడితులే కృష్ణానది ఈ జిల్లా గుండా పారుతున్నా ఈ ప్రాంత ప్రజలకు కృష్ణానది నీరు అందటం లేదు. వీరికి శుద్ధ జలాలు ఉచితంగా అందించటంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

-షేక్ కరిముల్లా, 9705450705

జీతభత్యాలు.. పప్పుబెల్లాలు



కర్లపాలెం హనుమంతరావు
8142283676

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం. నూటిరవై కోట్ల మంది జనాభాకి ఏడు వందల తొంభై మూడు మంది మాత్రమే ప్రజాప్రతినిధులు! స్థాయిలో మా కన్నా ఎంతో అట్టడుగునున్న సర్కారు భృత్యులకేమో లక్షల్లో జీతభత్యాలా! మా ప్రజారక్షకులకు మాత్రం భిక్షా పాత్రలో ఏదో ముష్టేసినట్లు వేలల్లో వేతనాలా! ఎవరి కాలు మీద వాళ్ళు నిలబడ్డం సంగతలా పక్కన పెట్టండయ్యా! ప్రొటోకాలు పరువైనా నిలబడాల్నా.. వద్దా? లెక్క కోసమైనా వేతనాల్లో ఒక్క రూపాయైనా ఎక్కువ మాకు దక్కాలి గదా!.. ఎవరు బాబూ నువ్వు?

'నీ అంతరాత్మనులేవయ్యా మహానుభావా! గుర్తుపట్టవులే.. ఎలక్షన్లు కూడా ఇప్పట్లో లేవాయా! ఎన్నికల సంఘం వాళ్లకి తమరు సమర్పించిన లెక్కల ప్రకారం చూసుకొన్నా నీ ఓ గంట ఆదాయం.. తెల్లకార్డోడి ఏడాది సంపాదన కన్నా ఎక్కువ గదా! ఇంకా వేతనాలు.. భత్యాలు చాల్లం లేదన్న సన్నాయి నొక్కులేంటంట?

నువ్వు గద్దించినంత మాత్రాన నాకు నవ్వెట్లా రాకుండా ఉంటుందయ్యా మహాశయా? ఒక్క నీ ఫ్లైట్లు, ఏసీ రైళ్ల టిక్కెట్లకయ్యే ఖర్చే బొక్కసానికి ఏటా నూడ్డైబ్బై నాలుగు లక్షల పైచిలుకు దెబ్బేస్తుందని హక్కుల సంఘాల వాళ్లక్కడ గగ్గోళ్ళు పెట్టేస్తున్నారయ్యా సామీ! ఏవేవో విదేశీ సరుకులు ఇదివరకు మల్లే సమకూరడం లేదని సణుగుతుంటివి! ఈ ఘోర కరువు, ఆర్థిక మాంద్యం గడ్డు రోజుల్లో కూడా నీ అడ్డదిడ్డమైన గడ్డి గాదాలకి జీతభత్యాలెందుకు పెంచాలో ఒక్క సజావైన కారణమైనా సెలవివ్వు చాలు! నవ్వడం మానేస్తా!'

'ఒక్కటి కాదు. ఓపిగ్గా వినాలే గానీ ఓ కోటి చెబుతాను! ప్రజాసేవ వృత్తిలోకి దూక్క ముందు నేనెంత గడించేవాణ్ణో నీకూ తెలుసు. ఇసుక ఓ తక్కెడు తోలుకెళ్ళినా కొత్త నేతలు 'ఓ' అంటో గగ్గోలు పెట్టేపాడుకాలమెక్కడా? ప్రభుత్వ వైద్యులకు మల్లే మాకూ 'నాన్ ప్రాక్టీసింగు అలవెన్సు' ఇవ్వాలని ఏక్షన్లోకి దిగాల్సొస్తోంది! ఏం తప్పా?'

'హా.. హ్హా హహ్హా'

ఆ నవ్వే వద్దనేది! మంగళగిరి చేంతాడంతుందని మా ఆదాయపట్టికను తప్పుడుతున్నావ్ గానీ.. హనుమంతుడి తోకను మించి సాగే మా ఖర్చుల చిట్టా మాత్రం నీకు పట్టదు! సర్కారువాళ్ళిచ్చే ముగ్గురు సెక్యూరిటీ మాకేం మూలకు? కాలు బైటపెట్టినప్పుడల్లా ఎంత హంగూ.. ఆర్భాటం చూపించాలి? లేకుంటే కర్రపోటేసుకు తిరిగేకుంటోడి కంటి క్కూడా నలుసులా అలుసై పోమా? పెట్రోలు, డీజెలు రేట్లు ఎట్లా ఎడా పెడా పెట్రేగిపోతున్నాయో? అంతరాత్మగాడివి.. నీకే వెహికల్లో పనే ఉండదు! కాబట్టే ఈ పనికి మాలిన కూతలు! మా ప్రైవేటు ఆర్మీకేమన్నా తలా ఓ రెడ్ ఫెరారీ కారు డిమాండు చేస్తున్నామా? అన్నీ బైటకు చెప్పుకొనేద్దే ఖర్చులు కూడా కావాయ!

'గిట్టనప్పుడు 'సన్నాసి.. దద్దమ్మం'టూ నువ్విట్లా తిట్టిపొయ్యడం నాకేమన్నా కొత్తట గానీ,, నీ ఈతి బాధలు నాకర్థమవనివేం కాదు సామీ! చిక్కుముళ్ల సందుల్లో వేళ్లు దూర్చి మీరు మాత్రం స్వాహా చేసేందుకేం మిగిలుందిలే.. బూడిద మినహా! అందుకు కాంపెన్సేషన్ కిందనా ఈ లక్షల్లో జీతభత్యాల బేరాలూ?'

'ఆపుతావా ఆ పాడు నవ్వు! ప్రభుత్వాలన్నా స్థిరంగా పడుండే సూచనలుంటే మాకిన్ని పాట్లుండేవా చెప్పన్నా! ఇప్పుడున్న గడ్డు పరిస్థితుల్లో ఎప్పుడే భూసేకరణ సవరణ.. చటుక్కున పాముచుట్టై బుస్సుమంటుందో? రచ్చబండల మీద చతికలబడి చుట్టలు కాల్చడానికైనా రెండు, మూడు నోట్ల కట్టలు మిగలాలి కదా! కొన్ని నష్టాలకు సరిపడా పరిహారంగా అయినా మాకు జీత భత్యాల్లో సర్దుబాటు చేయమనడం అన్యాయమా? లాభదాయక పదవుల్లో ఉండొద్దని మాకు మాత్రమే ఓ గుదిబండ మెడలో తగిలిస్తిరి! ఆ వారాజరిగే నష్టం లెక్కేసినా ఇప్పుడు మేమడిగే పది లక్షలకు ఇంకో ఐదు రెట్లు ఎక్కువిచ్చినా తక్కువే!

'సారీ సోదరా! నువ్వింత వివరంగా విడమరిచి చెప్పినా నా మైండ్ సెట్ మారకపోతే నాకూ.. మీ మోడీకి మధ్య ఇహ తేడా ఏముంది! ఒప్పుకుంటున్నా! న్యాయంగా ఆలోచిస్తే నెలకో పది లక్షలు జీతంగా.. పాతిక లక్షలు భత్యంగా అచ్చుకొన్నా మీ నష్టానికి సరిపడ్డంత పరిహారం కాదనే అనిపిస్తున్నదిప్పుడు!'

'కానైతే నాదీ ఓ చిన్న సూచన మిత్రమా! పనికి తగ్గ జీతభత్యాలుండాలని కోరుకోవడం పెద్ద తప్పేం కాదుగా! చట్టసభల్లో తమరి హాజరీ సర్కారు చిన్నబళ్లో మాష్టార్ల హాజరీ కన్నా అధ్వానంగా ఉందిగా హుజూర్!'

'సో వ్వాట్? సోదాపి స్ట్రెయిట్ పాయింటుకు రారాదూ!'

'అకౌంటబిలిటీనిబట్టి అకౌంటింగు ఉండాలంటాను. గంటకింతని హాజరు భత్యం నిర్ణయించాలి. హాజరు పట్టీ ప్రకారమే జీతభత్యాలు చెల్లించాలి. వాకౌట్ చేసిన రోజున జీతం మొత్తం కట్! సభాపతి అనుమతి లేకుండా మాట్లాడే ప్రతి పదానికి ఇంతని కత్తిరించడం ఉత్తమం. ఫలహార శాలల్లో ఇచ్చే రాయితీలను రూపాయి పైసల్లోకి మార్చి మీ జీతాలనుంచే తిరిగి రాబట్టాలి. రాజకీయాల్లోకి రాకముందు.. వచ్చిన తరువాత.. కనిపించే ఆదాయాల్లోని తేడాను బట్టి ఇంత శాతమని శిస్తుగా వసూలు చేసి ఏ ప్రధాని ప్రక్షాళన సంక్షేమ నిధికో జమచేసేందుకు 'సై' అంటే నెలకు పది లక్షలేం ఖర్మ.. పాతికలక్షల మీదొక్క రూపాయి ఎక్కువిచ్చినా అధర్మం అనిపించదు' 'ఖర్మ! ఆ లెక్కన మాకిక నికరంగా మిగిలేదేముంటుంది మహాత్మా? చొక్కా జేబులో ఆ ఒక్క రూపాయి.. చొక్కా వెనకనక్కి సొదపెట్టే అంతరాత్మా తప్ప!'



సుంకాల సమరం!



అమెరికా, చైనా దేశాలు దిగుమతులపై సుంకాల పెంపుపై నువ్వా నేనా అన్న రీతిలో కయ్యానికి కాలు దువ్వడంతో అంతర్జాతీయ సమాజంపై వాణిజ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. చైనా ఏళ్ళ తరబడి మేధో సంపత్తి చౌర్యానికి పాల్పడుతున్నదంటూ మండిపడిన అమెరికా అధ్యక్షుడు చైనా నుంచి దిగుమతులపై భారీగా సుంకాలు పెంచారు. తాను ఏమీ తక్కువ తినలేదన్నట్టుగా చైనా సైతం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే 128 సరకులపై సుంకాల పెంపు ప్రణాళికలను ప్రకటించింది. ఆ క్రమంలో మేధో సంపత్తి చౌర్యంపై ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటిఒ) వద్ద తేల్చుకుందాం రా అంటూ చైనాను అమెరికా సవాల్ చేసింది. దేశ హక్కులు, ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుంటే చూస్తూ కూర్చునేది లేదని డ్రాగన్ అంతే ఘాటుగా హెచ్చరించింది. మరో వంక చైనాతో వాణిజ్య సంబంధాలతో అమెరికాకు నష్టమే తప్ప ఎలాంటి లాభం ఒనగూరలేదని శ్వేతసౌధం పేర్కొంది. ఆ క్రమంలో గడచిన 17 సంవత్సరాల కాలంలో చైనా 800 శాతం వృద్ధిని సాధించిందని వెల్లడించింది. వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాలో 20 లక్షల ఉద్యోగాలు గల్లంతవుతాయని, చైనాలో అంతే సంఖ్యలో కొత్త ఉద్యోగాలు వస్తాయని అమెరికా ప్రభుత్వ వర్గాలు లెక్కలు తీశాయి. ఈ నేపథ్యంలో నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత చైనా మీద ఉందని అన్నాయి. ముంచుకొస్తున్న వాణిజ్య యుద్ధంతో అంతర్జాతీయంగా కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. యుద్ధ నివారణకు భారత్ పూనుకోవాలని ఫిక్కీ కోరింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏనుగుల్లాంటి అగ్రదేశాల కాళ్ళ కిందపడి కుందేళ్ళ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు నలిగిపోతాయనే ఆందోళనను ఆర్థిక నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

ఒక ఒప్పందానికి చేరుకోని పక్షంలో మొదటి దశలో 15 శాతం సుంకాన్ని విధిస్తుంది. అమెరికా విధానాల తాలూకు ప్రభావాన్ని మదింపు చేసిన తర్వాత రెండవ దశలో 25 శాతం దిగుమతి సుంకం అమల్లోకి వస్తుందని మంత్రిత్వ శాఖను ప్రభుత్వ వార్తా ఏజెన్సీ క్సిన్‌హువా ఉటంకించింది. కెనడా, మెక్సికో దేశాలకు ఆరంభ మినహాయింపులతో ఉక్కు దిగుమతులపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయానికి ప్రతిగా చైనా సుంకాల పెంపు ప్రణాళికలను వెల్లడించింది. చైనాపై సెక్షన్ 301 కింద చేపట్టిన దర్యాప్తు ఫలితాలను అమెరికా త్వరలో విడుదల చేస్తుందనే మీడియా వార్తలపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ గురువారం స్పందించింది. తమ హక్కులు, ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుంటే చైనా చూస్తూ కూర్చోదని మంత్రిత్వ శాఖకు చెందిన ఒడంబడిక, న్యాయ విభాగం వర్గాలు వ్యాఖ్యానించాయి. 1974 నాటి వాణిజ్య చట్టంలో సెక్షన్ 301 కింద చైనా మేధోసంపత్తి, సాంకేతికత బదలాయింపులపై ఒక దర్యాప్తునకు అమెరికా 2017, ఆగస్టులో శ్రీకారం చుట్టింది.

60 బిలియన్ డాలర్ల విలువైన చైనా దిగుమతులపై సుంకాల విధింపు ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంతేకాక ఏళ్ల తరబడి మేధో సంపత్తి చోరీకి ప్రతిగా పెట్టుబడులపై పరిమితి విధించారు. చైనా ఆర్థిక వ్యవస్థ నుంచి అనుచితమైన పోటీకి ప్రతిగా చర్యలు అవసరమని శ్వేత సౌధం తెలిపింది.

వాణిజ్య సమరంతో ఆర్థిక స్వస్థతకు దెబ్బ

కోచి: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చిన పక్షంలో అది అంతర్జాతీయంగా ఆర్థిక స్వస్థతను దెబ్బ తీస్తుందని పేరొందిన ఆర్థికవేత్త, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ డిజిటల్ సదస్సులో ప్రసంగించే నిమిత్తం శుక్రవారం ఇక్కడకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, మనం వాటిని తేలిగ్గా తీసుకోరాదని రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఒక దేశం రెచ్చగొడితే మరో దేశం వ్యతిరేకంగా స్పందించడ వల్ల ఉత్పన్నమయ్యే విపత్తు నుంచి మనం బైటపడతామని తాను సైతం ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితి కోలుకుంటున్న తరుణంలో ఏ దేశమైన వాణిజ్య సమరానికి దూరంగా ఉండాలని హితవు పలికారు.

వాణిజ్య సమరాన్ని భారత్ చల్లార్చాలి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వాణిజ్య సమరం మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో వాటిని తొలగించడంతో భారత్ ఒక చురుకైన పాత్ర పోషించాలని ఫిక్కీ ప్రెసిడెంట్ రాశేష్ షా అన్నారు. తద్వారా అంతర్జాతీయ వాణిజ్యంలో సానుకూల దృక్కోణం పట్టాలు తప్పిపోకుండా చూడాలని అన్నారు. అమెరికా చర్యలతో వాణిజ్య సమరానికి ఆజ్యం పోయని మార్గాన్ని కనుగొనడంలో అన్ని దేశాలను ఏకం చేయడానికి భారత్ నేతృత్వం వహిస్తుందని ఇటీవల జరిగిన డబ్ల్యూటిఒ సదస్సులో వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేష్ ప్రభు అన్నారని షా గుర్తు చేశారు.

అమెరికాలో లక్ష ఉద్యోగాలు గోవిందా!

వాషింగ్టన్: చైనాతో భారీ వాణిజ్య లోటు ఫలితంగా అమెరికాలో దాదాపు 20 లక్షల ఉద్యోగాలు పోతాయని శ్వేత సౌధం లెక్కలేసింది. అమెరికన్ మేధో సంపత్తి చౌర్యానికి పాల్పడిందని ఆరోపిస్తూ 60 బిలియన్ డాలర్ల విలువైన చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తమైన వాణిజ్య సంబంధాలను ఈ చర్య మరింత క్లిష్టతరం చేసింది. ఇదే విషయమైన ఒక ఉన్నతాధికారి విలేకరులతో మాట్లాడుతూ కొన్ని లెక్కల ప్రకారం మార్కెట్‌ను దెబ్బతీసే విధానాల నుంచి ఉద్భవించిన ప్రతి ఒక బిలియన్ డాలర్ల వాణిజ్య లోటుకు కనీసం 6,000 ఉద్యోగాలను పణంగా పెట్టాలి. కొన్ని అంచనాల ప్రకారం అత్యంత సంప్రదాయబద్ధంగా గణించినప్పుడు వాణిజ్య లోటు ఫలితంగా చైనాలో అదనంగా 20 లక్షల ఉద్యోగాలు వస్తాయి. అమెరికాలో అంతే సంఖ్యలో ఉద్యోగాలు గల్లంతవుతాయి అని తెలిపారు. ఇంతటి తీవ్రమైన సమస్య గురించి అమెరికాకు బాగా తెలుసు అని అన్నారు. చైనా అనుచిత వాణిజ్య విధానాల ఫలితంగా 370 బిలియన్ డాలర్ల సరకు వాణిజ్య లోటు ఏర్పడిందని తెలిపారు. అయితే ఏం చేయాలో నిర్ణయించాల్సింది చైనా మాత్రమే అని ట్రంప్ పాలనా యంత్రాంగం పేర్కొంది. ఈ వాణిజ్య బంధంతో అమెరికా కన్నా చైనా మరింత లబ్ది పొందింది. దీనిని తాము కచ్చితంగా పరిగణనలోకి తీసు కుంటామని ఉన్నతాధికారి తెలిపారు. చైనా వెళ్ళి అక్కడి మార్కెట్‌లో తమ సరకులు విక్రయించాలను కుంటున్న సగటు అమెరికా కంపెనీ ప్రస్తుతం సందిగ్ధావస్థలో చిక్కుకుపోయింది. చైనా ఆర్థిక విధానాలపై అమెరికాతో పాటుగా ప్రపంచమంతటా ఆందోళనలు నెలకొన్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా అధికారి తెలిపారు. ఈ ఆందోళనల్లో చాలా వాటిని తాము పంచుకుంటున్నట్టు మా వాణిజ్య భాగస్వాముల్లో అనేకుల నుంచి మేము విన్నాము అని చెప్పారు. అమెరి కా-చైనా వాణిజ్య బంధంతో చైనా లబ్ది పొందిన వైనాన్ని మరో అధికారి గణాంకాలతో సహా వివరించారు. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటిఒ) చేరినప్పటి నుంచి చైనా ఆర్థిక వ్యవస్థ 1 ట్రిలియన్ డాలర్ల జిడిపి నుంచి 12 ట్రిలియన్ డాలర్లకు వృద్ధి చెందింది. అంటే ఎంత లేదన్నా 800 శాతం వృద్ధి రేటు సాధించింది అని తెలిపారు.

అదే కాలవ్యవధిలో అమెరికా ఆర్థిక వ్యవస్థ చిందరవందరైపోయింది. 1947, 2000 సంవత్సరాల మధ్య దాదాపు 3.5 శాతంగా ఉన్న అమెరికా వార్షిక వృద్ధి రేటు దాదాపు 2 శాతానికి పడిపోయిందని వెల్లడించారు. అలా జరగడం అమెరికాకు సరికొత్త సర్వసాధారణమని అందరూ అనాలనుకుంటారని తెలిపారు. కానీ చైనా వృద్ధి,దాని అనుచిత వాణిజ్య పద్ధతులకు, వృద్ధి, వేతనాల వృద్ధిలో అమెరికాలో ఏం జరిగిందనే దాని మధ్య వ్యత్యాసం విపరీతంగా ఉందన్నారు. చైనా వాణిజ్య వ్యవహార శైలి పట్ల ట్రంప్ అత్యంత స్పష్టంగా ఉన్నారని అమెరికా అంతర్గత వ్యవహారాల అధికార ప్రతినిధి హీతర్ నార్ట్ తెలిపారు. సెనెట్ ఆర్థిక కమిటీ ర్యాంకింగ్ సభ్యులు రోన్ విడెన్ ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. చైనా దశాబ్దాల కాలంగా వాణిజ్యం ద్వారా అమెరికా పారిశ్రామిక రంగాన్ని మోసగించింది, దోచుకుందని విమర్శించారు. ఆ ప్రక్రియలో అమెరికా కార్మికులు, ఉద్యోగులు, కమ్యూనిటీల ఆర్థిక స్థితిని దారుణంగా ధ్వంసం చేసిందని ఆరోపించారు.

డబ్ల్యూటీఓకు చేరిన పంచాయితీ

- మేధోసంపత్తి చోరీపై అమెరికా ఫైర్ • చైనాపై ప్రతిచర్యకు సిద్ధం

వాషింగ్టన్: మేధో సంపత్తి ఉల్లంఘనలపై ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటిఒ) వేదికగా చైనాపై అమెరికా శుక్రవారం ప్రతిచర్యకు ఉపక్రమించింది. డబ్ల్యూటిఒ నియమాలకు వ్యతిరేకంగా చైనా అనుచిత సాంకేతిక ఆచరణలపై అమెరికా డబ్ల్యూటిఒ వద్ద చర్య తీసుకుంటుందని అమెరికా వాణిజ్య ప్రతినిధుల(యుఎస్‌టిఆర్) కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. లైసెన్సింగ్ కాంట్రాక్టు ముగిసిన తర్వాత సాంకేతికతను వినియోగించడంలో ఒక చైనా కంపెనీని నిలువరించే కనీస పేటెంట్ హక్కులను అమెరికా కంపెనీలు సహా విదేశీ పేటెంట్ హోల్డర్లకు లేకుండా చేయడం, దిగుమతి చేసుకున్న సాంకేతికతకు పూర్తి ప్రతికూలంగా కాంట్రాక్టు నియమ, నిబంధనలను విధించడం ద్వారా చైనా డబ్ల్యూటిఒ నియమాలను ఉల్లంఘిస్తున్నట్టు కనిపిస్తున్నది అని యుఎస్‌టిఆర్ ఆరోపించింది. ఈ చైనా విధానాలు లైసెన్సింగ్, ఇతర సాంకేతికతకు సంబంధించిన కాంట్రాక్టుల్లో మార్కెట్ ఆధారిత నియమాలను నెలకొల్పనడంలో విదేశీ సాంకేతికత హోల్డర్ల సామర్థ్యంలో జోక్యం చేసుకోవడం ద్వారా అమెరికాలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆవిష్కర్తలను గాయపరుస్తున్నాయి అని విమర్శించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులకు ఒక వేదిక మాత్రమే కాదు. అది వాణిజ్య వివాదాలను పరిష్కరించడంలో ఒక న్యాయస్థానంగా సైతం వ్యవహరిస్తుంది. అయితే ట్రంప్ పరిరక్షక పాలనా యంత్రాంగం డబ్ల్యూటిఒకు వ్యతిరేక వాణి వినిపించింది. కొత్తగా జడ్జీల నియామకాన్ని అడ్డుకోవడం ద్వారా వివాదాలు పరిపరిష్కరించే దాని యంత్రాంగాన్ని అచేతనావస్థలోకి నెట్టివేసింది.

తెరాస హామీలు నీటిమూటలు

- పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత ఎన్నికల్లో తెరాస అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి తెరాస ఓట్లు దండుకుందన్నారు. తెరాస అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు అవుతున్నా...ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. పెన్షన్లు, ఇండ్లు, సంక్షేమ పథకాల అమలు విషయం అధ్యయనం చేసేందుకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చైర్మన్‌గా 42 మందితో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం గాంధీ భవన్‌లో మొదటి సారిగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా, పారదర్శకంగా అందాయన్నారు. కానీ 2014లో జరిగిన ఎన్నికల్లో ప్రజల్లో ఉన్న తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని తెరాసను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. తెరాస చేసి మోసంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహవేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తెరాస ఎన్ని జిమ్మి క్కులు చేసినా.... ఎన్ని హామీలు ఇచ్చినా.....విజయం మాత్రం కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు మానసికంగా సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలు పెట్టుకున్న ఆశలను ఏ మాత్రం వమ్ముచేయ కుండా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ప్రధానంగా ప్రజలకు గృహ నిర్మాణ పథకం, వైద్య, విద్య, ఉపాధి తదితర అన్ని రంగాలలో సంక్షేమ పథకాలను అమలు చేసే విషయంలో గత ప్రభుత్వాల కంటే ఎంతో మెరుగ్గా ఉండాలని, అందుకు సంబం ధించి అన్ని వర్గాల ప్రజలను పరిగణలోకి తీసుకుని లోతుగా అధ్యయనం చేసి ఒక నివేదిక రూపొందించాలని సూచించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ళ పథ కంలో లబ్దిదారులకు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిం చేందుకు కృషి చేశామని, అలాగే వికలాంగులు, వితం తువులు, వృద్ధులకు పెన్షన్లు, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం, ఆరోగ్యశ్రీ ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

మహిళా సంఘాలకు పావులా వడ్డీ రుణాలు, సకాలంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ వంటి అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో సమర్ధవంతగా చేపట్టిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జీవన్‌రెడ్డితో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, నిరంజన్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీవిప్ ఈరవర్తి అనిల్, డీసీసీ అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాయకులు ఫక్రుద్దీన్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్‌కు చాదర్ పంపిన కాంగ్రెస్

పవిత్ర అజ్మీర్ షరీఫ్ దర్గాకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుంచి చాదర్‌ను పంపించారు. శుక్ర వారం గాంధీభవన్‌లో మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మైనారిటీ నాయకులతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ, అజ్మీర్‌కు చాదర్ పంపడం ప్రతియేటా ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇది ఎంతో పవిత్ర కార్యక్రమం అని ఆయన అన్నారు.

సంస్కరణల్లో జైళ్లశాఖ ముందంజ

- డీజీ వీకే సింగ్ వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంస్కరణల అమలులో తెలంగాణ జైళ్లశాఖ ముందంజలో ఉందని, ఈ ఏడాదిలోపే ప్రారంభం కానున్న 100 పెట్రోల్ బంక్‌లలో మూడు వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు.. అందులో ఐదు పెట్రోల్ బంకులలో ట్రాన్స్‌జెండర్లకు అవకాశాలు కల్పిస్తున్నామని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ ప్రకటించారు. మూడేళ్లలోనే అనుకున్న దానికంటే ఎక్కువగా సంస్కరణల అమలులో ప్రగతిని సాధించామని శుక్రవారం మీడియాకు తెలిపారు. తాము రెండు లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నామన్నారు. అవి ఉద్యోగ కల్పన, సమాజంలో నేరాలను జరగకుండా నిరోధించడం వంటి అంశాలన్నారు. నెలలోగా ఆరు పెట్రోల్ బంక్‌లు (దేవరకొండ, మిర్యాలగూడ, జడ్చర్ల, నాగరకర్నూల్, సంగారెడ్డి, హుజూరాబాద్) ప్రారంభిస్తున్నామన్నారు. రీసెంట్‌గా నల్గొండ, వరంగల్, ఆదిలాబాద్, చర్లపల్లి ప్రిజనర్స్ అగ్రికల్చర్ కాలనీ, సంగారెడ్డిలలో ఆయుర్వేద విలేజీలను ప్రారంభించామన్నారు. విజయ డైరీతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. దీనివల్ల తమ ప్రొడక్ట్స్ అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా విడుదలైన ఖైదీలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, ఈగో వల్లనే నేరాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. డ్రాప్ అవుట్లను తగ్గించి పిల్లలను బడులకు పంపించడం, నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా చేయడం వల్ల నేరాలు తగ్గుతాయన్నారు. సంవత్సరానికి 50 శాతం క్రైమ్ తగ్గించగలిగితే రూ.10,000 కోట్ల వరకూ ఆదా చేసుకోవచ్చన్నారు. గత మూడు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో ఐదు లక్షల మంది తెలంగాణ జైళ్లకు వచ్చారని, జైళ్లలో అమలైన సంస్కరణల ఫలితంగా వారిలో గణనీయమైన మార్పు వచ్చిందని, వారంతా విడుదలయ్యి మంచి పొజిషన్‌లో ఉన్నారని.. ఇప్పుడు వారే తన ఆర్మీ అని వీకే సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లో బిచ్చగాళ్లు ఉండకూడదని, వారిలో పరివర్తన తెచ్చే విధంగా ఆనందాశ్రమాలను ప్రారంభించి సక్సెస్ అయ్యామన్నారు. ప్రస్తుతం 225 మంది బిచ్చగాళ్లు తమ ఆనందాశ్రమాల్లో ఉన్నారన్నారు.

రథయాత్రపై వీహెచ్‌పీ అప్పీల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు చేపట్టిన శ్రీరామ రథయాత్రకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ విశ్వ హిందూ పరిషత్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ముందు శుక్రవారం అప్పీలు వ్యాజ్యాన్ని దాఖలు చేసింది.

వెల్‌స్పన్ ఇండియాకు రాయితీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వ్యాలీలో నిర్మిస్తున్న వెల్‌స్పన్ ఇండియా కంపెనీకి ప్రోత్సాహకాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. చందన్‌వెల్లి వద్ద రూ.409 కోట్ల పెట్టుబడితో వెల్‌స్పన్ ఇండియా టెక్నికల్ టెక్స్‌టైల్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వ టెక్స్‌టైల్స్ పాలసీ కింద రూ.200 కోట్ల పైబడి పెట్టుబడితో 1000 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. ఈ కంపెనీ 150 ఎకరాల్లో ప్రత్యక్షంగా 690 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పించనుంది.

ఈ కంపెనీ మొత్తం పెట్టుబడిపై రూ.41 కోట్ల మేరకు క్యాపిటల్ సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే వడ్డీ రాయితీ ఏటా 8 శాతం ఎనిమిదేళ్ళపాటు చెల్లిస్తుంది. అలాగే యూనిట్ విద్యుత్‌ను రూ.2.62 చొప్పున పదేళ్ళపాటు సరఫరా చేస్తూ ప్రభుత్వం అంగీకరించింది. వ్యవ సాయ భూమిని పరిశ్రమకు మార్పిడి చేసేందుకు స్టాంప్ డ్యూటీని మినహాయించ డంతో పాటు నీరు, రోడ్డు, విద్యుత్, సహజ వాయువులు సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ రాయితీలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాల్సిం దిగా పరిశ్రమలశాఖ కమిషనర్, టిఎస్-ఐఐసి వైస్ చైర్మన్‌ను ఆదేశిస్తూ పరిశ్రమ లశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

రూ.40 కోట్ల చేనేత రుణాల మాఫీ

(మొదటిపేజీ తరువాయి)

జనవరి నుంచి 2017 మార్చి వరకు తీసుకున్న వర్కింగ్ కాపిటల్ వ్యక్తిగత రుణాలను లక్ష వరకు మాఫీ చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. అయితే గత ప్రభుత్వం కేవలం 2010 చివర వరకు మాత్రమే రుణమాఫీ చేసి, తర్వాత సంవత్సరాల్లో ఎలాంటి రుణమాఫీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని తమ దృష్టికి పలువురు నేతన్నలు తీసుకువచ్చారని, ప్రస్తుత రుణమాఫీని 2010 ఏప్రిల్ నుంచి వర్తింపజేయాలని కోరిన నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు ముందు రుణాలు తీసుకున్న వారికి ప్రయోజనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ పథకాలకు 2014, జూన్ 2ను ఒక కటాఫ్ డేట్‌గా పరిగణించి నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నామని, ఈ చేనేత రుణమాఫీ విషయంలో నేతన్న సంక్షేమం కోసం ప్రత్యేక అంశంగా పరిగణించి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ మేరకు నేతన్నలు చేసిన విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి రుణమాఫీ ప్రయోజనాన్ని కల్పించామన్నారు. ఈ మేరకు జీవో 46ను శుక్రవారం విడుదల చేశామని మంత్రి తెలిపారు. ఈ రుణమాఫీ ద్వారా చేనేత కార్మికులకు సాధ్యమైనంత అధికంగా ప్రయోజనం కలిగించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. సాధారణంగా రుణమాఫీ చేసిన సందర్భాల్లో రుణాలు చెల్లించని వారికే రుణమాఫీ వర్తింపజేస్తారు. కానీ సకాలంలో రుణాలు చెల్లించిన వారు నష్టపోకుండా ఉండేందుకు వారు చెల్లించిన రుణాలను సైతం ప్రభుత్వం తిరిగి వారీ ఖాతాల్లో వేస్తుందని మంత్రి తెలిపారు. రుణాలు చెల్లించే కార్మికుల ఖాతాల్లో లక్ష రూపాయల పరిమితితో వారి డబ్బులను తిరిగి చెల్లిస్తున్నామని అన్నారు. ఈ రుణమాఫీ ద్వారా క్షేత్రస్థాయి సంబంధిత బ్యాంకులతో, 'వృత్తిలో కొనసాగే లబ్ధిదారులకు' మాఫీ అయిన రుణాలకు తక్కువ కాకుండా తిరిగి రుణ సౌకర్యం కల్పించడానికి వీలుంటుందన్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా బ్యాంకుల నుంచి తెప్పించిన వివరాల ప్రకారం ఈ పథకం ద్వారా సుమారు 8,500 మంది చేనేత కార్మికులు రుణ విముక్తులు అవుతారని, ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు రాజ్‌భవన్‌లో ఎర్త్ అవర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎర్త్ హవర్‌ను పురస్కరించుకుని నేడు రాజ్‌భవన్‌లో గంటపాటు విద్యుత్‌ను నిలిపివేయాలని భవన్ వర్గాలు నిర్ణయించాయి. నేటి రాత్రి 8.30 గంటలనుంచి 9.30 గంటల వరకు విద్యుత్‌లైట్లు, విద్యుత్ పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని రాజ్‌భవన్ వర్గాలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ శాఖకు గంటపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపివేయాలని ఆదేశించింది. క్వార్టర్లు, సుధర్మ కార్యాలయ భవనం, అతిథిగృహం, దర్బార్ హాల్, నార్త్ బ్లాక్ గెస్ట్ హౌస్, నూతన అతిథి గృహం, డిస్పెన్సరీ, డ్రైవర్ల క్వార్టర్లకు ఈ గంటపాటు విద్యుత్ ప్రసారం నిలిపివేయనున్నారు. ఈ సమయంలో రాజ్‌భవన్ వెలుపల కూడా లైట్లను ఆర్పివేసి ఉంచాలని నిర్ణయించారు.

సిద్దిపేటకు స్వచ్ఛ ఎక్సలెన్స్ అవార్డు

- ప్రజల సహకారానికి లభించిన బహుమతి: మంత్రి హరీశ్‌రావు
- ఢిల్లీలో అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేటకు మరో అరుదైన గౌరవం దక్కింది. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ - మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య అధ్యక్షురాలు నవ్య, కార్యదర్శి విజయ, మెప్మా బృందం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ నుంచి ఈ అవార్డును అందుకున్నారు. దేశంలోని అన్ని పట్టణాల నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 196 నామినేషన్లను స్వీకరించింది.

26 స్లమ్ సమాఖ్యలు - ఎస్ఎల్ ఎఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యాయి. వీటిలో అన్ని రాష్ట్రాల కేటగిరీలలో సిద్ధిపేట ప్రథమ స్థానంలో నిలిచింది. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీ చేపట్టిన ఓడీఎఫ్ కార్యక్రమం, పబ్లిక్ టాయిలెట్స్ ఉపయోగం, చెత్త సేకరణ, చెత్తను తడిపొడిగా చేయాల్సిన ఆవశ్యకత సేకరించిన చెత్తను మున్సిపాలిటీ అందించడం, పొడి చెత్తను ఎన్జీ ఓస్ - ఐటీసీ సమన్వయంతో అందజేసి ఆర్థిక స్థితి గతిని ఆరోగ్యాన్ని ఏ విధంగా మెరుగుపర్చుకోవాలన్న పలు అంశాలపై ఎన్నో కార్యక్రమాలను సిద్ధిపేట మున్సిపాలిటీ మెప్మా తరపున చేపట్టింది.



పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - మెప్మా తరపున అన్ని ఎస్ఎల్ఎఫ్‌లతో కలిసి బాధ్యతాయుతంగా సిద్ధిపేట మున్సిపాలిటీ సహకారంతో స్లమ్ లెవల్ ఫెడరేషన్ - ఎస్ఎల్ఎఫ్ శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా నిలుపడంలో శ్రీ సాయితేజ స్లమ్ సమాఖ్య కనబర్చిన ప్రత్యేక శ్రద్ధతో జాతీయ స్థాయిలో అవార్డు సాధించింది.

విస్తరణబాటలో జేడీఏ సాఫ్ట్‌వేర్

హైదరాబాద్: జెడీఏ సాఫ్ట్‌వేర్ ఎవన్సీ..లీడింగ్ సప్లయిచెయిన్‌తోపాటు రిటైల్ సొల్యూషన్ ప్రొవైడర్. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రిటైల్‌రంగం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించింది. కంపెనీ సీఈవో గిరీష్‌రిషి మాట్లాడుతూ.. జెడిఏ సాఫ్ట్‌వేర్‌కు భారత్ మార్కెట్ కీలకమని, 70 శాతం మంది ఉద్యోగులు భారత్‌లో పనిచేస్తున్నారన్నారు. గత నెలలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) భాగస్వామ్యం కుదుర్చుకొని సంయుక్తంగా వినూత్నమైన పరిశోధనలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సప్లయి చెయిన్ వర్గాల వారు కూడా అత్యాధునిక టెక్నాలజీ ఉదాహరణ మెషిన్ లాంగ్వేజ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్, అడ్వాన్స్ ఎనలిటిక్స్‌ని వినియోగిస్తున్నారని చెప్పారు. భారత్‌తో కూడా తమ బృందం సప్లయి చెయిన్‌తో పాటు రిటైల్ డొమెయిన్‌లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగి స్తారని భావిస్తున్నామని రిషి అన్నారు. కాగా నిరంజన్ తుమ్మల సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ... జెడీఏ సాఫ్ట్‌వేర్ మాట్లాడు తూఇజు భారత్ సీఓఈ గ్లోబల్ ఇన్నోవేషన్‌లో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కాగా మార్కెట్‌లో తమ స్థానాన్ని మరింత పదిలపర్చుకోడానికి ఆర్ అండ్‌డిపై దృష్టికేంద్రీకరిస్తున్నామని రుషి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 మందిని నిపుణులను తీసుకుంటున్నట్లు తెలిపారు.

jda.



విమాన ఇంధనంపై పన్ను తగ్గింపు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెట్రోరైల్ కనెక్టివిటీ
- రెండేళ్లలో పూర్తి : కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రోరైల్ సదుపాయం కల్పించి మెరుగైన రవాణా నెట్‌వర్క్ విస్తరించనున్నట్లు పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. రూ.4,650 కోట్ల వ్యయంతో ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీ పెంచి రెండేళ్లలో పూర్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం దశాబ్ద కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఎయిర్‌పోర్టు సిటీ ప్రాజెక్టును ఆయన శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించారు. అలాగే ఎయిర్‌పోర్టు విస్తరణ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, విమానాలకు వినియోగించే ఇంధనంపై విధిస్తున్న వాణిజ్య పన్ను 16 నుంచి 1 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు దేశంలోనే గుర్తింపు పొందిందని, ఇది తెలంగాణకు తలమానికంగా నిలిచిందన్నారు. పదేళ్లలోనే 18 మిలియన్ల మంది ప్రయాణీకులను చేరవేసే స్థాయికి చేరిందని, ఇది ఒక బ్రాండ్ అంబాసిడర్‌లాగా తెలంగాణకు గుర్తింపు తెస్తుందని అన్నారు. హైదరాబాద్ నుంచి విమాన ప్రయాణీకులు రోజురోజుకు పెరుగుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విస్తరణ చేపట్టడం ఎంతో సమంజసమని కేటీఆర్ అన్నారు.

ప్రైవేట్ రంగంలో పెట్టుబడులకు పోటీ పెరుగుతోందని, ముఖ్యంగా రవాణా రంగంలో ఇది ఎక్కువైందని అన్నారు. హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో కనెక్టివిటీ పెరిగిందని, దీంతో ప్రపంచం నలుమూలల నుంచి విమాన సర్వీసులకు కేంద్రంగా నిలిచిందన్నారు. హైదరాబాద్ ఏరోస్పేస్‌కు కేంద్రంగా విస్తరిస్తోందని, ఆదిభట్ల ఏరోపార్కు, ఎలిమినేడులో మరొక ఏరోపార్కు ప్రతిపాదనలో ఉందని, ఫార్మాసిటీ, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సిటీతో దేశంలోనే అతిపెద్ద సెంటర్‌గా అవతరిస్తుందని మంత్రి అన్నారు. జీఎంఆర్ నిర్మించే ఏరోసిటీలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుతో ఎంఐసిఇ కేంద్రంగా విలసిల్లనుందని ఆయన అన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా నగరం నుంచి కనెక్టివిటీ పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా హబ్‌గా పేరుగాంచిందని, ఇప్పుడు అనేక కొత్త ప్రాజెక్టులతో మరింత విస్తరిస్తోందన్నారు. ఇప్పటికే ఎన్నో విజయాలు, అన్వేషణ ఆవిష్కరణలతో దూసుకుపోతున్న తెలంగాణకు డ్రై పోర్టు ఏర్పాటు మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని మంత్రి అన్నారు. ఇన్‌ఫ్రా రంగంతో అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న జీఎంఆర్ సామాజిక బాధ్యత కింద చేస్తున్న సేవలు కూడా ప్రశంసనీయమన్నారు. పేదరిక నిర్మూలన, వైద్య సదుపాయం, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలతో పేదలకు సేవలు అందించడం ఆ సంస్థ యాజమాన్య మానవతా దృక్పథానికి అద్దం పడుతుందని కేటీఆర్ అన్నారు. భారతీయ విమాన ప్రయాణీకులు ఏటా 20 శాతం పెరుగుతున్నారని, ఇది చైనాకన్నా ఎక్కువగా ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ కార్యదర్శి ఆర్.ఎన్ చౌబె అన్నారు. దశాబ్దకాలం క్రితం విద్యుత్, ఇన్‌ఫ్రా రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులు విజయవంతం కాలేదని, అదే తరుణంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులు చేపట్టి విజయం సాధించడం గమనించదగ్గ విషయమన్నారు. ఇతర రంగాల నుంచి విమాన రంగానికి పెట్టుబడులు తరలివస్తున్నాయని, ఈ రంగానికి ఎంతో భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు. తమ సంస్థ అభివృద్ధి చేస్తున్న జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సిటీ దేశంలోనే అతిపెద్దదని జీఎంఆర్ గ్రూపు సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు చెప్పారు. ఈ ఎయిర్‌పోర్టు సిటీలో ఏరోస్పేస్ క్లస్టర్, ఫార్మాజోన్, ఎంటర్‌టైన్‌మెంట్, గోల్ఫ్‌కోర్సు, ఏవియేషన్ అకాడమీ, ఎడ్యుకేషన్ బోర్డు, హెల్త్ పార్కు, రీసెర్చ్ సెంటర్, బిజినెస్ పోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు మల్లికార్జునరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి, ప్రకాశ్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, జీఎంఆర్ గ్రూప్ ఎయిర్‌పోర్ట్స్ చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తదితరులు పాల్గొన్నారు.



విలీనాలు, టేకోవర్లు డీలా!

- గతేడాది 12% తగ్గాయి
- ఎర్నెస్ట్ అండ్‌యంగ్ నివేదిక



ముంబై: గతేడాది (2017) దేశంలో విలీనాలు, టేకోవర్‌ల సంఖ్య పెరిగినా.. విలువ ప్రకారం చూస్తే మాత్రం తగ్గాయని ఎర్నెస్ట్‌యంగ్ శుక్రవారం నాడు విడుదల చేసిన తాజా నివేదికలో పేర్కొంది. గతేడాది మొత్తం 4,680 కోట్ల డాలర్ల విలీనాలు, టేకోవర్‌లు జరిగాయి.. 2016తో పోల్చు కుంటే విలువ ప్రకారం 12 శాతం తగ్గాయి. అయితే ఈ ఏడాది పరిస్థితి కాస్తా ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈవై చెబుతోంది. దీనికి ప్రధాన కారణం సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని వివరణ ఇచ్చింది. 2017లో విలీనాలు, టేకోవర్‌లు (ఎంఅండ్ఏ)లు ఏడు సంవత్సరాల గరిష్ఠానికి మొత్తం 1,022 జరిగాయి. వాటిలో ఎక్కువగా టెలికం, రిటైల్, కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టెక్నాలజీ రంగానికి చెందినవి ఎక్కువగా ఉన్నాయి. అయితే విలువ ప్రాతిపదికన చూస్తేమాత్రం బాగా తగ్గాయి. తక్కువ స్థాయి ఎంఅండ్ఏలు 20 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఒప్పందాలు జరిగాయని ఈవై భాగస్వామి అమిత్ ఖండేల్‌వాల్ చెప్పారు. కొర్పొరేట్‌లు పెద్ద టేకోవర్ల జోలికిపోలేదు. దీంతో సుమారు 500 మిలియన్ డాలర్ల ఒప్పందాలు 2016లో 21 జరిగితే గతేడాది 13క ు మాత్రమే పరిమితం అయ్యాయి. దీనికి ప్రధాన కారణం నియంత్రణా సంస్థల నిబంధనలు కూడా పెద్దడీల్స్‌పై ప్రభావం చూపాయని ఖండేవాల్ వివరించారు. దేశంలో జరిగిన డీల్స్‌లో 71 శాతం వరకు తగ్గాయి. 340 లావాదేవీల ద్వారా 800 -900 కోట్ల డాలర్లు జరిగితే, విదేశీడీల్స్ మాత్రం ఏడు శాతం వరకు తగ్గాయి. ఈ లావాదేవాల్లో అమెరికా, సింగపూర్, జపాన్‌లవే ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది 2018 విషయానికి వస్తే దేశీయంగా పెద్దమొత్తంలో విలీనాలు టేకోవర్లు జరిగే అవకాశాలు న్నాయని నివేదికలో వివరించింది.

తగ్గిన టెలికం సబ్ స్క్రైబర్లు

- జనవరిలో 117.5 కోట్లకు
- ట్రాయ్ నివేదిక

న్యూఢిల్లీ : టెలికం సబ్‌స్క్రైబర్లు జనవరిలో గణనీయంగా తగ్గి 117.5 కోట్లకు దిగివచ్చారు. చిన్న ఆపరేటర్ల సబ్‌స్క్రైబర్లు గంపగుత్తగా పెద్ద ఆపరేటర్ల ఖాతాలోకి చేరిపోయారని టెలికం నియంత్రణా సంస్థ ట్రాయ్ శుక్రవారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దేశంలో టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు డిసెంబర్ చివరినాటికి 1,190.67 మిలియన్‌ల నుంచి జనవరి 2018 నాటికి 1,175.01 మిలియన్‌లకు దిగివచ్చారని.. నెల వారి గణాంకాలను చూస్తే 1.32 శాతం తగ్గిందని ట్రాయ్ పేర్కొంది. కాగా మొబైల్ సబ్‌స్క్రైబర్లు విషయానికి వస్తే జనవరి 2018 చివరి నాటికి 115.19 కోట్లకు దిగిరాగా.. అంతకు ముందు డిసెంబర్ 2017 చివరి నాటికి 116.74 కోట్ల.. మొబైల్ సబ్‌స్క్రైబర్లు సంఖ్యలో 1.33 శాతం వరకు తగ్గిందని వివరించింది. కాగా అతి పెద్ద టెలికం ఆపరేటర్ల విషయానికి వస్తే జనవరిలో 1.26 కోట్ల కొత్త కస్టమర్లకు చేరారు. వారిలో 83 లక్షల మంది రిలయన్స్ జియో ఖాతాకు చేరితే,, భారతి ఎయిర్‌టెల్‌కు 15 లక్షలు, వోడాఫోన్‌కు 12.82 లక్షలు, ఐడియా సెల్యూలార్‌కు 11.44 లక్షలు, బీఎస్ఎన్ఎల్‌కు రూ.3.96 లక్షల కొత్త కస్టమర్లు చేరారు. అనిల్ అంబానీకి చెందిన రిలయ న్స్ కమ్యూనికేషన్స్ మొబైల్ సర్వీసుల ను డిసెంబర్‌లో నిలిపివేసింది. మొత్తం 2.1 కోట్ల కస్టమర్లకు ఆర్‌కామ్ నుంచి ఇతర నెట్‌వర్కులకు మారిపోగా.. ఎయిర్‌సెల్ దివాలా ప్రక్రియకు ఫైల్ చేయడంతో 34 లక్షల మంది కస్టమర్లను కోల్పోవాల్సి వచ్చింది. టాటా టెలీసర్వీ సెస్ సుమారు 19 లక్షల మంది కస్టమర్లను, టెలినార్ 16 లక్షల మంది కస్టమర్లను, ఎంటిఎన్ఎల్ 10,634 కస్టర్లను కోల్పోవా ల్సి వచ్చింది. వైర్‌లెస్ టెలిఫోన్ కస్టమర్ల బేస్ తగ్గి జనవరి చివరి నాటికి 2.3 కోట్లకు దిగివచ్చింది. అదే డిసెంబర్ 2017 చివరి నాటికి 2.32 కోట్ల మంది ఉండేవారు. ప్రభుత్వరం గానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ కస్టమర్లు సుమారు 1.15 లక్షల మందిని కోల్పోయింది. ఆర్‌కామ్ 41,720 మంది వైర్‌లైన్ కస్టమర్లను, ఎంటిఎన్ఎల్ 10,907 మంది కస్టమర్లను, క్వాడ్‌ర్యాంట్ 2,765, ఎయిర్‌సెల్ 2219, టాటాటెలీసర్వీ సెస్ 797, భారతి ఎయిర్‌టెల్‌మాత్రం 5925 కొత్త ల్యాండ్‌లైన్ కస్టమర్లను తమ ఖాతాలో వేసుకుంది. అయితే జనవరిలో బ్రాడ్‌బ్యాండ్ సెగ్మెంట్ మాత్రం మంచి పురోభివృద్ధిని సాధించింది. ఈ ఏడాది జనవరి చివరినాటికి 37.81 కోట్ల బ్రాడ్ బ్యాండ్ సబ్‌స్క్రైబర్లుగా తేలారు. కాగా డిసెంబర్ 2017 చివరి నాటికి వీరి సంఖ్య 36.28 కోట్ల మంది.. నెలవారి చూస్తే 4.2 శాతం వృద్ధి కనిపించింది. మొబైల్ బ్రాడ్ బ్యాండ్ సెగ్మెంట్ జనవరిలో 35.98కోట్లకు ఎగబాకగా.. డిసెంబర్‌లో 34.45 కోట్ల మంది కస్టమర్లున్నారు. టాప్ ఐదు సర్వీస్ ప్రొవైడర్లు 94.52 శాతం వాటాను మొత్తం బ్రాడ్‌బ్యాండ్‌ను దక్కించుకున్నారు. వాటి లో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ 16.83 కోట్లు, భారతి ఎయిర్ టెల్ 7.5 కోట్లు, వోడా ఫోన్ 5.48 కోట్లు, ఐడియా 3.73 కోట్లు, బీఎస్ఎన్ఎల్ 2.18 కోట్ల మంది సబ్‌స్క్రై బర్లు ఉన్నారని ట్రాయ్ వివరించింది.

భూషణ్ స్టీల్ ఇక టాటాలదే!

రూ.35 వేలకోట్లకు టేకోవర్



న్యూఢిల్లీ: దివాలా తీసిన భూషణ్‌స్టీల్ లిమిటెడ్‌ను బిడ్డింగ్‌లో టాటాస్టీల్ చేజిక్కించుకుంది. ఎంత మొత్తానికి బిడ్ దాఖలు చేసి టేకోవర్ చేసుకుందో ఇతమిద్ధంగా తెలియకపోయినా పరిశ్రమవర్గాల సమాచారం ప్రకారం రూ.35వేల కోట్ల వరకు బిడ్‌దాఖలు చేసి టేకోవర్ చేసిందని చెబుతున్నారు. మొత్తం నగదు ద్వారానే ఈ ఒప్పందం కుదిరింది. ఈ లావాదేవీ పూర్తియితే దేశంలోనే అతి పెద్ద ఉక్కు కంపెనీగా టాటాస్టీల్ అవతరిస్తుంది. భూషణ్‌స్టీల్ ఏడాదికి 5.6 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తోంది. కాగా టాటాస్టీల్ ప్రస్తుతం 13 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. టాటాస్టీల్ ఒక ప్రకటనలో మార్చి 22,2018న భూషణ్‌స్టీల్ లిమిటెడ్ (బీఎస్ఎల్)కు రుణాలు ఇచ్చిన రుణదాతల కమిటి తమ దరఖాస్తులను ఆమోదించిందని, అయితే నియంత్రణా సంస్థ అనుమతులు, వాటిలో ఎన్‌సీఎల్‌టితో పాటు కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతులు కూడా పొందాల్సి ఉందని పేర్కొంది.

ఇదిలా ఉండగా జెఎస్‌డబ్ల్యు స్టీల్‌తో పాటు కొంత మంది ఉద్యోగుల గ్రూపు ప్రైవేట్ ఈక్విటి సంస్థతో కలిసి భూషణ్‌స్టీల్‌కు బిడ్‌దాఖలు చేశారు. కాగా భూషణ్‌స్టీల్ బ్యాంకులకు రూ.48,100 కోట్ల వరకు బకాయిపడింది. కాగా టాటాస్టీల్ కార్పొరేటర్ ఇన్‌సాల్వెన్సీ రెసొల్యూషన్ ప్రాసెస్ (సీఐఆర్‌పీ) ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016(ఐబీసీ) కింద బీఎస్ఎల్ టేకోవర్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌కు ఆమోదం తెలిపినట్లు టాటాస్టీల్ ఒక ప్రకటనలో తెలిపింది. స్టాక్ ఎక్స్ఛేంజీకి బీఎస్ఎల్ సమాచారం అందిస్తూ.. రెసొల్యూషన్స్ ప్రొపెషన ల్స్ (ఆర్‌పీ) ఆదేశాల ప్రకారం భూషణ్‌స్టీల్‌కు రుణాలు ఇచ్చిన రుణదాతలు (బ్యాంకులు) కమిటి టాటా స్టీల్ లిమిటెడ్ సమర్పించిన తీర్మానాన్ని, ఈ -వోటింగ్ ప్రక్రియ ద్వారా మార్చి 20, 2018న జరిగిన సమావేశంలో ఆమోదించిందని తెలియజేసింది. ఇదిలా ఉండగా టాటాస్టీల్ వచ్చే ఐదు సంవత్సరాల్లో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు 26 మిలయన్ టన్నులకు పెంచుకోవాలనే ఆలోచనలో ఉంది. ఇటీవల టాటాస్టీల్ ఒడిషాలోని కళింగనగర్‌లో గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. భూషణ్‌స్టీల్ టేకోవర్ ద్వారా టాటాస్టీల్ ప్రస్తుతం దేశంలోనే అతి పెద్ద ఉక్కు కంపెనీగా ఉన్న జెఎస్‌డబ్ల్యుస్టీల్‌ను వెనక్కినెట్టి.. నెంబర్ వన్‌స్థానానికి ఎగబాకుతుంది. ఇదిలా ఉండగా బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయలు తీసుకొని బ్యాంకులకు డిఫాల్ట్ అయిన కంపెనీల నుంచి ఆర్‌బీఐ నేషనల్ కంపెనీ ట్రిబ్యునల్ లా (ఎన్‌సీఎల్‌టి)కి సిఫారసు చేసింది. మొత్తం 12 కంపెనీలకు సిఫారసు చేస్తే వాటిలో భూషణ్‌స్టీల్ ఒకటి. కాగా టాటాస్టీల్ ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ లిమిటెడ్ టేకోవర్ బిడ్‌లు కూడా పాల్గొంది.అయితే దీన్ని దాల్మియాకు చెందిన రెనెసెన్సెన్స్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అభిషేక్ దాల్మియా సవాలు చేశారు. కాగా భూషణ్‌స్టీల్ టేకోవర్ బిడ్‌కు కూడా రెనాసెన్సెస్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసి తర్వాత ఉపసంహరించుకుంది. తాజాగా భూషణ్‌స్టీల్ టేకోవర్‌తో టాటాస్టీల్ ఫ్లాట్‌స్టీల్ ప్రొడక్టులో సగం మార్కెట్‌ను కైవసం చేసుకుంటుంది. కాగా భూషణ్‌స్టీల్ వెబ్‌సైట్ ప్రకారం దేశంలో ఉక్కు ఉత్పత్తి కంపెనీలో మూడవ స్థానంలో ఉన్నామని ఏడాదికి 5.6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిందని పేర్కొంది. కాగా టాటాస్టీల్ ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద ఉక్కు తయారీసంస్థగా నిలిచింది. కంపెనీ సొంతంగా గనులున్నాయి.

ఎస్సార్ స్టీల్ కోసం మరోసారి బిడ్: అర్సిలర్ మిట్టల్

ప్రపంచలోనే అతి పెద్ద ఉక్కు తయారీ కంపెనీ అర్సిలర్ మిట్టల్ .. ఎస్సార్‌స్టీల్‌కు బిడ్ దాఖలు చేసి తిరస్కరణకు గురైంది. అయితే మరోసారి బిడ్‌దాఖలు చేస్తామని శుక్రవా రం నాడు ప్రకటించింది. కాగా ఎస్‌బీఐ నేతృత్వంలోనే కన్సార్షియం ఈ వారంలోనే అర్సిలర్‌మిట్టల్, న్యూమెటల్ బిడ్‌లను తిరస్కరించింది. వీటితో పాటు రష్యాకుచెందిన వీటిబీ బ్యాంకు, రెవంత్ రుయాలు దాఖలు చేసిన బిడ్‌లు క వాడా తిరస్కరణకు గురయ్యాయి. అయితే అధికారికంగా తమ బిడ్‌లు తిరస్కరించిన సమాచారం లేదని.. కాబట్టి మరోసారి బిడ్‌లో పాల్గొంటామని ఆర్సిలర్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఆర్సిలర్ మిట్టల్ బిడ్‌లను ఎస్సార్‌స్టీల్ కమిటి ఆఫ్ క్రెడిటార్స్ ముంబైలో జరిగిన సమావేశంలో తిరస్కరించినట్లు తెలుస్తోంది. కాగా సీఓసీ మరోసారి బిడ్డింగ్‌కు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

27న బంధన్ బ్యాంకు లిస్టింగ్

కోలకతా : ప్రైవేట్ బ్యాంకు బంధన్ బ్యాంకు షేర్లు ఈ నెల 27న ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో లిస్టు అవుతాయి. ఇటీవలే ఐపీవోకు వచ్చిన బంధన్ బ్యాంకు 14.6 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. బ్యాంకు ఐపీవో ద్వారా రూ.4500 కోట్లు సేకరించింది. సేకరించిన మొత్తం నుంచి కొంత మొత్తం ప్రస్తుతం ఉన్న భాగస్వామి ఒకరు తీసుకొని నిష్క్రమిస్తారు. కాగా ఈ నెల 27వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టు అవుతుందని బ్యాంకు, ఎండీ, సీఈవో సీ ఎస్ ఘోష్ చెప్పారు.

కెనెరా, దేనా బ్యాంకుల విలీనం ప్రతిపాదనలేదు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల విలీనాల ప్రతిపాదన ఏదీ లేదని ఆర్థికమంత్రిత్వశాఖ శుక్రవారం నాడు స్పష్టం చేసింది. సిండికేట్ బ్యాంకు, కెనెరాబ్యాంకు, విజయబ్యాంకు, దేనా బ్యాంకులు విలీనం ప్రతిపాదనలు తమ వద్దకు తేలేదని ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా లోకసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. గతేడాది ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో దాని అనుబంధ బ్యాంకులు విలీనం అయిన విషయం తెలిసిందే. దీంతో ఎస్‌బీఐ ప్రపంచంలోని టాప్ 50 బ్యాంకుల్లో ఒకటిగా మారిపోయింది.

టీహబ్, పీడబ్ల్యుసీ ద్వారా స్టార్టప్‌ల కోసం టీ స్కేల్

హైదరాబాద్ : టి హబ్, పిడబ్ల్యుసీ, కో క్రియేషన్ కన్సెల్టింగ్ సహకారంతో టీస్కేల్ అనే ఓ సేల్కింగ్ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా అంకుర సంస్థలు తమ మార్కెటింగ్, అంతర్గత స్కేలింగ్ కార్యక్రమాల ద్వారా వాటిని వినియోగించుకోవచ్చు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కాలానుగుణంగా ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది. టి స్కేల్ ప్రోగ్రాంకు ఇప్పటి వరకు 70కి పైగా స్టార్టప్‌లు భాగస్వాములయ్యాయని పిడబ్ల్యుసీ భాగస్వామి ఇన్నోవేషన్ లీడర్ మురళి తులసీ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్లకు ట్రంప్ సునామీ!

- బీఎస్ఈ 410 పాయింట్లు పతనం
- ఐదు నెలల కనిష్ఠానికి
- చైనా దిగుమతలపై భారీ సుంకం విధిస్తామన్న యూఎస్
- గ్లోబల్ మార్కెట్లది ఆదే దారి

ముంబై : స్టాక్ మార్కెట్ల కు ట్రంప్ సెగ తగిలింది. చైనా వస్తువులపై అమెరికా అధ్యక్షుడు సరికొత్త టారిఫ్‌ను ప్రకటించడంతో గ్లోబల్ మార్కెట్లు చిగురుటాకుల్లో వణికిపోయాయి. ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారు. బీఎస్ఈ 410 పాయింట్లు క్షీణించి ఐదు నెలల కనిష్ఠానికి దిగిరాగా... నిఫ్టీ మొట్టమొదటిసారి 10వేల మార్కుకంటే కిందికి దిగివచ్చింది. బీఎస్ఈ 409.73 పాయింట్లు క్షీణించి 32,596.54 పాయింట్లకు దిగివచ్చింది. చివరగా అక్టోబర్ 23వ నాటిస్థాయికి పడిపోయింది. నిఫ్టీ కీలకమైన 10వేల పాయింట్ల కంటే కిందికి వచ్చింది. 116.70 పాయింట్లు నష్టపోయి 9,998.05 పాయింట్లకు పడిపోయింది. చివరగా గత ఏడాది అక్టోబర్ 11 నాటికి స్థాయికి దిగివచ్చింది. ఆ రోజు 9,984.80 వద్ద ముగిసింది. మదుపరుల సొమ్ము శుక్రవారం నాడు రూ.1.57 లక్షల కోట్లు ఆవిరయ్యింది. స్టాక్ మార్కెట్లకు వరుసగా గత నాలుగు రోజుల నుంచి నష్టాలను చవిచూస్తున్నా యి.

సెన్సెక్స్ రికార్డుస్థాయిలో 579.46 పాయింట్లు, నిఫ్టీ 197.10 పాయింట్ల వరకు నష్టపోయాయి. బీఎస్ఈలో రియల్టీ, మెటల్, బ్యాంకెక్స్, క్యాపిటల్‌గూ డ్స్, హెల్త్‌కేర్, పీఎస్‌యు, ఆటో, చమురు సహజవాయువు రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. లోహరంగానికి వస్తే సెయిల్, జిందాల్ స్టీల్, వేదాతం, హిందాల్కో ఇండస్ట్రీ, జిందాల్‌స్టీల్, నేషనల్ అల్యూమిని యం, హిందుస్తాన్ జింక్, టాటాస్టీల్, ఎన్ఎండీసీ, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 6.58 శాతం వరకు నష్టపోయాయి. ఈ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి.

బ్యాంకింగ్‌రంగానికి వస్తే టొటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రమోటర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంకులతో పాటు ఎనిమిది బ్యాంకులకు రూ.1,944 కోట్లు మోసం చేసినట్లు వార్తలు వెలుగు చూస్తున్నాయి. ఈ దెబ్బక ు మిగిలిన బ్యాంకు షేర్లు.. యాక్సిస్ బ్యాంకు, పీఎన్ఈ, ఎస్‌బ్యాంకు, కెనెరాబ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఐడీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు 3.87 శాతం వరకు నష్టపోయాయి. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏకంగా 8.29 శాతం క్షీణించి రూ.86.85 వద్ద ముగిసింది. టొటెమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్ల బ్యాంకు రూ.1394 కోట్లు మోసం పోయింది.

వాల్‌స్ట్రీట్‌తో పాటు ఏషియెన్, యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం భారతీయ మార్కెట్లపై కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనీస్ దిగుమతులపై భారీ మొత్తంలో సుంకం ప్రకటించడంతో గ్లోబల్ ట్రేడ్‌వార్ మొదలయ్యే అవకాశాలున్నాయని ఆందోళన ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై వ్యాపించింది. ట్రంప్‌ను ధీటూగా ఎదుర్కొంటామని చైనా కూడా ప్రకటించింది.



మొత్తానికి చూస్తే శుక్రవారం నాడు స్టాక్ మార్కెట్లు ప్రారంభం నుంచే బలహీనంగా ట్రేడ్ కావడం మొదల య్యా యి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా దిగుమతు లపై 50 బిలియన్ డాలర్ల టారిఫ్‌ను ప్రకటించడంతో దీనికి ప్రత్యామ్నయంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై మూడు బిలియన్ డాలర్ల టారిఫ్ ప్రకటించడంతో మార్కెట్లు నష్టాల్లో జారుకున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లకు ట్రేడ్ వార్‌తో పాటు ముడి చమురు ధరలు పెరగడం రెండు వ్యతిరేక ప్రభావం చూపించాయి. ఇప్పటికే మార్కెట్లో సుమారు పది శాతం కరెక్షన్‌కు గురైందని, ఈ ఆర్థికసంవత్సరం ముగిసే వరకు పరిస్థితులు ఇలానే ఉండవ చ్చునని మార్కెట్ పండితులు అభిప్రాయపడుతున్నారు.

నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే టాటామోటార్స్, ఎల్అండ్‌టి, బజాజ్‌ఆటో, డాక్టర్ రెడ్డీస్, రిల్, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ, సన్‌ఫార్మా, హీరోమోటోకార్ప్, హెచ్‌యూ ఎల్, మారుతి సుజుకి, భారతీ ఎయిర్‌టెల్, ఒఎన్‌జీసీ, ఐటీసీ, టీసీఎస్, ఎన్‌టీపీసీలు 2.10 శాతం వరకు నష్టపోయాయి. ఐటి,మీడియా షేర్లు కాస్తా లాభపడ్డాయి. అదానీపోర్ట్స్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్ఎం, కోల్ ఇండియా, ఏషియన్ పెయింట్స్‌లు 0.99 శాతం వరకు లాభపడ్డాయి. టెక్, ఐటి రంగానికి చెందిన షేర్లు 0.32 శాతం వరకు లాభాలను ఆర్జించాయి. గీతాంజలి జెమ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. 4.93 శాతం క్షీణించి రూ.9.65 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్ల విషయానికి వస్తే జపాన్‌కు చెందిన నిక్కీ 4.51 శాతం, హాంగ్‌కాంగ్‌కు చెందిన హెంగ్‌సెంగ్ 2.45 శాతం, షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 3.39 శాతం వరకు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు కూడా నష్టాలతో ముగిశాయి.

చేనేత రుణమాఫీ 2010 ఏప్రిల్ నుంచి వర్తింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: చేనేత కార్మికుల రుణ మాఫీ పథకాన్ని 2010 ఏప్రిల్ నుండి అమలు పర్చబోతున్నామని ఐటి, పురపాలక శాఖ మంత్రి కె.టి. రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికుల రుణ మాఫీ కోసం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను మార్చి కొత్త ఉత్తర్వులు జారీ చేయడంతో 8500 మందికి ప్రయోజనం చేకూరుతుందని, సుమారు రూ. 40 కోట్ల రుణాలు మాఫీ అవుతున్నాయని వెల్లడించారు కొత్త జీవో ప్రకారం ఒకొక్క చేనేత కార్మికునికి లక్ష రూపాయల వరకు రుణ మాఫీ ప్రయోజనం కలుగుతుందన్నారు. తొలుత తీసుకున్న నిర్ణయం ప్రకారం రుణ మాఫీ కేవలం జనవరి 2014 నుండి మార్చి 2017 మధ్య జాతీయ బ్యాంకులు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంఇ వర్కింగ్ క్యాపిటల్‌గా తీసుకున్న రుణాలు మాత్రమే మాఫీ చేయడం జరుగుతుందన్నారు. కొత్తగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఏప్రిల్ 2010 నుండి రుణాలు తీసుకున్న వారికి కూడా రుణ మాఫీని వర్తిం పచేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు జీవో ఎం ఎస్ 46ను విడుదల చేశా మన్నారు. ఇప్పటికే రుణాలు చెల్లించిన వారి బ్యాంకు ఖాతాల్లో కూడా ప్రభుత్వం కల్పించే రుణ మాఫీ మొత్తాలను జమ చేయడం జరుగుతుందని తెలియచేశారు.

అరెస్టులతో ప్రజాగ్రహాన్ని ఆపలేరు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అరెస్టులతో ప్రజాగ్రహాన్ని చల్చార్చలేరని, నిజాంపాలనను తలపిస్తున్న తెరాస ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ధ్వజమెత్తారు.పంట రుణాలు మాఫీ చేస్తామని సిఎం కేసీఆర్ చెప్పిన మాటలు నమ్మి అనేక మంది రైతులు బ్యాంకు రుణాలు కట్టలేదన్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నల్గొండ, మెదక్ జిల్లాలను కరువుప్రాంతాలుగా ప్రకటించినందువల్ల తమకు వెసలుబాటు లభిస్తుందని ఆ ప్రాంత రైతులు నమ్మారని, కానీ...ఇచ్చిన హామి నెరవేర్చకుండా తెరాస ప్రభుత్వం రైతులను దగా చేసిందని లక్ష్మణ్ విమర్శించారు. ఇందుకు నిరసనగా భాజపా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఛలో అసెంబ్లీ నేపథ్యంలో పార్టీ కార్యాలయం నుంచి లక్ష్మణ్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అసెంబ్లీకి ర్యాలీకి బయలుదేరారు. కానీ అప్పటికే పోలీసులు నాంపల్లి భాజపా కార్యాలయం చుట్టుముట్టి అష్టదిగ్బంధం చేశారు. అయినప్పటికీ పోలీసుల ఆంక్షలను లెక్క చేయకుండా అసెంబ్లీ వైపు దూసుకవెళ్ళేందుకు లక్ష్మణ్‌తో పాటు ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు తదితరులు యత్నించారు. పార్టీ కార్యాలయం వారు బయటకు రాగానే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ఐదు కేంద్రాలలో పీఎస్‌టీయు పరీక్షలు

హైదరాబాద్,ప్రభ న్యూస్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, దూర విద్యా కేంద్రం ద్వారా పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు: ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. సంస్కృతం, ఎం.ఏ. జ్యోతిషం, ఎం.ఏ. ఇంగ్లీష్ (లాంగ్వేజ్ టీచింగ్), ఎం.ఏ. టూరిజం మేనేజ్‌మెంట్, ఎం.ఏ. కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం; డిగ్రీ కోర్సులు: బీఏ కర్ణాటక సంగీతం, బీఏ స్పెషల్ తెలుగు; పీజీ డిప్లమా కోర్సులు: టీవీ జర్నలిజం, జ్యోతిర్వాస్తు; డిప్లమా కోర్సులు: లలిత సంగీతం, సినిమా రచన, జ్యోతిషం, సర్టిఫికెట్ జ్యోతిషం, సంగీత విశారద కోర్సులను నిర్వహిస్తోందని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల కోరిక మేరకు పై కోర్సులలో ప్రవేశం పొందే విద్యార్థులు శ్రీశైలం, వరంగల్, కూచిపూడి ప్రాంగణాలలోనూ పరీక్షల నిర్వహణ కేంద్రాలను పునః ప్రారంభించడమైందని రిజిస్ట్రార్ అలేఖ్య తెలిపారు. 2017-18 విద్యాసంవత్సరానికి అపరాధ రుసుము రూ.300/-లతో మార్చి 31వ తేదీ వరకు ప్రవేశాల గడువు పొడగించినట్టు ఆమె తెలిపారు.

ఇంటర్నెట్‌తో జాగ్రత్త

సీఐడీ సైబర్ క్రైం అదనపు ఎస్‌పి రామ్మోహన్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మనకు మనమే తెలియకుండా మన సమాచారాన్ని ఎదుటి వ్యక్తికి చేరవేస్తున్నామని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరంఉందని సిఐడి సైబర్ క్రైం అదనపు ఎస్‌పి రామ్మోహన్ రావు అన్నారు. ఫ్యాప్సీ భవనంలో శుక్రవారం సైబర్ భద్రత ప్రశ్నలు, వ్యూహాలు అన్న అంశంపై సి డాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధార్ కార్డు భద్రతపై పదే పదే మాట్లాడుతున్న సమాజం తమకు తాముగా తమ రహస్య సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తున్నామన్న విషయాన్ని విస్మరిస్తున్నారన్నారు. సెల్‌ఫోన్, వైఫై, కంప్యూటర్, ఇ మెయిల్ వాడటం ద్వారా మన సమాచారాన్ని మనమే రట్టు చేసుకుంటున్నామన్నారు. . ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు తన విధి నిర్వహణలో వచ్చిన కొన్ని ఫిర్యాదులను ప్రస్తావించారు.

నేడు పాస్‌పోర్టు పీసీసీ మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ వ్యాప్తంగా పాస్‌పోర్టు సేవలను సరళీకృతం చేసేందుకు మెరుగైన విధానాన్ని అమలు చేస్తున్నామని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి డాక్టర్ ఇ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తుల చేసుకున్న అభ్యర్థుల పోలీస్ విచారణ ప్రక్రియను కూడా తక్కువ సమయంలో పూర్తిచేసి పాస్‌పోర్టు విడుదల చేసే అంశంపై శిక్షణా కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు శనివారం బేగంపేట పాస్‌పోర్టు సేవా కేంద్రంలో పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పిసీసీ) మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆహార నాణ్యతకు ఆధునిక టెక్నాలజీ

ఐఐపీ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌సీ సహా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మెరుగైన ప్యాకేజింగ్ విధానంతోనే ఆహార పదార్థాల నాణ్యత దెబ్బ తినకుండా ఉంటుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌సి సహా అన్నారు. ఆ దిశగా ఆహార పరిశ్రమల యాజమాన్యాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులకు అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశవ్యాప్తంగా మరిన్ని ఐఐపీ కేంద్రాలను నెలకొల్పేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. బెంగళూరు, గౌహతి, కాకినాడ, అహ్మదాబాద్ నగరాల్లో త్వరలో నెలకొల్పే ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్యాకేజింగ్ విధానంలో అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు.

'వాహన చట్టం అమలు చేయాలి'

హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 158(6) ,1988 ను కఠినంగా అమలు చేసేలా ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. మోటారు వాహనాల చట్టం లోని 158(6),1988 ప్రకారం సంబంధిత మోటారు వాహనాల క్లెయిమ్స్ ట్రిబ్యునల్, మరియు బీమా కంపెనీకి పోలీసులు ప్రమాదం జరిగిన 30 రోజుల్లోగా నివేదిక పంపాల్సి ఉంటుంది.ఒక వేళ పోలీసులు నిర్ణీత కాల వ్యవధిలో నివేదిక పంపకపోతే బాధిత కుటుంబ సభ్యులు చట్టబద్ధంగా పొందాల్సిన పరిహారం హక్కును కోల్పోయే ప్రమాదముందని పిటిషనర్ తెలిపారు.

నకిలీ వెనుక బడా బాబులు

- రాజకీయ ముసుగులో విత్తన వ్యాపారులు
- పట్టుకుంటే అధికారులపై ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి
- సర్కారు కఠిన చర్యలకు అదే సవాలు
- రిటైల్ మార్కెట్లలో తప్ప తయారీ కంపెనీలపై నిఘా కరవు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వేల కోట్ల రూపాయల దందా నడిపిస్తున్న నకిలీ విత్తనాల తయారీ, మార్కెటింగ్ వెనుక వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామ్యమున్న నాయకులు ఉండడంతో నియంత్రణ సాధ్యం కావడం లేదు. ఇందుకు సంబంధించి అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ దాడులు చేసేందుకు భయపడుతున్నారు. అక్కడక్కడ రిటైల్ మార్కెట్లలో నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నప్పటికీ లోతుగా విచారణ జరగడం లేదు. చర్యలకు పూనుకునే లోపే అధికారులపై ఢిల్లీ స్థాయి నుంచి ఒత్తిడి వస్తోంది. ఈ కారణాలతోనే అధికార యంత్రాంగం ధైర్యంగా ముందడుగు వేయలేకపోతోంది. ఇప్పటివరకు రిటైల్ మార్కెట్లలో తప్ప ఉత్పత్తి చేసే ఏ ఒక్క కంపెనీపైనా ప్రభుత్వం ఆకస్మిక దాడులు నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఇలాంటి పరిస్థితుల్లో వ్యవస్థలో ఉన్న లోపాలు, రైతుల్లో కరువైన అవగాహన, సమయాన్ని అదునుగా చేసుకుంటున్న కల్తీ, నకిలీ, నాసిరకం విత్తనోత్పత్తి సంస్థలు యదేచ్ఛగా తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట కల్తీ విత్తనాలు పట్టుబడుతున్నప్పటికీ రైతాంగానికి జరుగుతున్న నష్టాన్ని పూడ్చలేని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో కఠినమైన శిక్షలు, జరిమానాలు లేని కారణంగా తెరవెనక ఉన్న పెద్దలు అమాంతంగా బయటపడుతున్నారు. పైగా దాదాపు విత్తనోత్పత్తి సంస్థలన్నీ బడా రాజకీయవేత్తలు, పేరుగాంచిన పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు చెందినవే కావడంతో ప్రతియేటా ఇదే సమస్య ఉత్పన్నమవుతూ వస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయ సంక్షభానికి ప్రధాన కారణమవుతున్న కల్తీ, నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చట్టాలు తీసుకురావడం ఒక్కటే ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని రైతు సంఘాలు, సామాజికవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మొలకెత్తుతాయి... కానీ, దిగుబడి రాదు

వరి, గోదుమ, మొక్కజొన్న, సోయా, వేరుశనగ, పొద్దు తిరుగుడు, కంది, పెసర తదితర విత్తనాల్లోనూ కల్తీ భారీగానే జరుగుతున్నప్పటికీ ఈ పంటల్లో గుర్తించడం అధికార యంత్రాంగానికి సాధ్యం కావడంలేదు. ఎందుకంటే ఈ విత్తనాలు నాణ్యతలేనివి, నకిలీవి, కల్తీవి అయినప్పటికీ మొలకెత్తుతాయి. కానీ దిగుబడిలో భారీ తేడా ఉంటుంది. ఎన్నరకాల ఎరువులు వాడినా దిగుబడి సాధారణంలో సగం కూడా సాధించలేని దుస్థితి నెలకొంటుంది. పంటల సాగు విధానంలో ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞా నం, పద్ధతులేవీ ముందుగా గుర్తిం చడంలో ఉపకరించలేక పోతున్నాయి.

ప్రభుత్వం పంపిణీ చేసేవి సైతం కల్తీవే...


అసలు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం సేకరించి సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్న వివిధ రకాల విత్తనాల్లోనే సగానికి పైగా కల్తీవి ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవస్థలో ఉన్న లోపాలు, రైతుల్లో కరువైన అవగాహన, సమయాన్ని అదునుగా చేసుకుంటున్న కల్తీ, నకిలీ, నాసిరకం విత్తనోత్పత్తి సంస్థలు యదేచ్ఛగా తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట కల్తీ విత్తనాలు పట్టుబడుతున్నప్పటికీ రైతాంగానికి జరుగుతున్న నష్టాన్ని పూడ్చలేని పరిస్థితులు ఉన్నాయి. పైగా దాదాపు విత్తనోత్పత్తి సంస్థలన్నీ బడా రాజకీయవేత్తలు, పేరుగాంచిన పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు చెందినవే కావడంతో ప్రతియేటా ఇదే సమస్య ఉత్పన్నమవుతూ వస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యవసాయ సంక్షభానికి ప్రధాన కారణమవుతున్న కల్తీ, నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చట్టాలు తీసుకురావడం ఒక్కటే ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని రైతు సంఘాలు, సామాజికవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

లొసుగులతో ప్రభుత్వ చర్యలు ప్రశ్నార్థకం

వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్న నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బెడదను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనలు కొనసాగుతున్న సందర్భంలోనూ బాదితుల పక్షాన నిలబడి వారికి న్యాయం చేసేందుకు చర్యలు ప్రారంభించింది. సమస్య తీవ్రతకొద్దీ రాజధానికి చేరుకుంటున్న ఆందోళన, జిల్లాల్లో కలెక్టరేట్ల ముట్టడితో అన్నదాతలు రోడ్డెక్కిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇటీవలే సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలు తయారు చేసినా, వాటిని విక్రయించినా పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని సూచించారు.

మెరుగైన సాగుకు మొబైల్ యాప్

- పంటల ఎంపిక విధానంపై రైతులకు పూర్తి సమాచారం
- త్వరలో అందుబాటులోకి యాప్
- స్మార్ట్ అగ్రికల్చర్ దిశగా వడివడిగా అడుగులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయాన్ని లాభసా టిగా మర్చేందుకు వడివడిగా అడుగులు పడు తున్నా యి.ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉప యోగించుకొని రైతులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆచార్య జయశంకర్ వ్యవ సాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రర్న్ సిడ్నీ యూనివర్సిటీ, రివర్ బ్రిడ్జ్ వెంచర్స్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రూపొందిస్తున్న యా ప్‌పై విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో రెండు రో జుల సదస్సును ప్రారంభించారు. ప్రస్తుతం అనేక పనులకు ఎన్నో రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రవీణ్ రావు అన్నారు. రైతులు తమ స్థాయిలో మేలైన నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని, సమాచారాన్ని ఆ యాప్ ద్వారా అందించేలా ఉండాలని ఆయన చెప్పారు. విత్తనం వేసినప్పటి నుంచి పంటకోత, మార్కెటింగ్‌కు తరలించే వరకు అవ సరమైన సమగ్ర సమాచారం ఆ యాప్‌లో పొందుపర్చాలన్నారు. భవిష్యత్తు వ్యవసాయమంతా స్మార్ట్ అగ్రికల్చర్‌గానే ఉండబోతుందని, యాప్ ద్వారా అందించే సమాచారంలో ఎప్పటికప్పుడు తాజాదనం ఉండేట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతకు ముందు ముంబైకి చెందిన రివర్ బ్రిడ్జ్ వెంచర్స్ వ్యవస్థాపకుడు గోరంట్ల విష్ణు యాప్ రూపకల్పనలో తమ భాగస్వామ్యం గురించి వివరించారు. ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అతుల్ గినిజే మాట్లాడుతూ, సమాజంలో డిజిటల్ విప్లవం అంతర్భాగంగా మారిందన్నారు.

టాస్క్‌ఫోర్స్‌తో అక్రమాలకు చెక్

- ఆర్టీసీలో ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు
- 15 రోజులకొకసారి పురోగతిపై టాస్క్‌ఫోర్స్ నివేదికలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అక్రమ రవాణాను అరికట్టడానికి కలెక్టర్లు ఛైర్మన్‌గా జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వ్యవహరిస్తారు. అన్ని జిల్లాల్లో కమిటీలు ప్రతి పక్షం రోజులకు ఒక సారి సమావేశామై పురోగతి నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించింది. ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ రవాణాను కఠినంగా అరికట్టవలసి ఉందని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులో జిల్లాల కలెక్టర్లను ఆదేశించడం జరిగింది. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీలకు కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ఎస్పీ కో ఛైర్మన్‌గా, జిల్లా రవాణా అధికారి సభ్యుడుగా ఏర్పాటైన ఈ కమిటీలో సభ్య కన్వీనర్‌గా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వ్యవహరిస్తారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘం ప్రతినిధి కూడా కమిటీలో సభ్యునిగా ఉంటారని రవాణా కమిషనర్ సునిల్ శర్మ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

లీడర్‌షిప్ డెవెలప్‌మెంట్ శిక్షణా తరగతులు

ఆర్టీసీ ట్రాన్స్‌పోర్టు అకా డమిలో వివిధ కేటగిరీల అధి కారులకు లీడర్‌షిప్ డెవ లప్‌మెంట్ శిక్షణా తర గతులు నిర్వ హిస్తు న్నారు. కార్య క్రమంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్, హైద రాబాద్ జోన్ల లోని కానిస్టేబుల్స్, హెడ్ కాని స్టేబుల్స్ సుమారు 28 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అకాడమీ ప్రిన్సిపల్ జి.ఆర్. కిరణ్ తెలిపారు.



కరాటేలో శిక్షణ పొందుతున్న మహిళా కండక్టర్లు

కంచె..చేను మేసింది

- ఐడీబీఐని ముంచిన అధికారులు
- రూ.445.32 కోట్లను కాజేసిన 31 మంది సిబ్బంది



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా బ్యాంకులలో జరిగిన స్కాంలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం, వాటిపై సిబిఐ కేసులు నమోదు చేసి నిందితులను పట్టుకునేందుకు వేట ముమ్మరం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎస్‌బిఐ, పిఎన్‌బి లాంటి జాతీయ బ్యాంకులలో ఉద్యోగులతో కలిసి బడా వ్యాపార వేత్తలు భారీ ఎత్తున రుణాలను తీసుకుని చేతులెత్తేయడం వెనుక బ్యాంకర్ల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి కూడా. బ్యాంకుల మోసగాళ్ళ కోసం విచారణను ముమ్మరం చేసిన సిబిఐకి తాజాగా ఐడిబిఐ బ్యాంక్ ఉద్యోగుల మోసంపై ఫిర్యాదు అందింది. దీంతో బ్యాంక్‌కు చెందిన31 మందిపై సిబిఐ కేసు నమోదు చేసింది. కిసాన్ క్రెడిట్ కార్డులతో బ్యాంక్ ఉద్యోగులే ఐడిబిఐ బ్యాంక్‌ను ముంచారని తేలింది. హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్టణం తదితర ప్రాంతాలలోని బ్యాంకులలో పని చేసే 31 మంది కలిసి రూ. 445.32 కోట్లను కాజేశారనిఅందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది. ఇందులో బ్యాంక్ జనరల్ మేనేజర్ బట్టు రామారావుతో పాటు 21 మంది మధ్యవర్తులు, 10 మంది వ్యాల్యేటర్‌లు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకోసం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టి వారి సాగుకు కావాల్సిన పంట రుణాలను ఇచ్చేందుకు బ్యాంకులకు అధికారం ఇచ్చింది. దీన్ని అదనుగా చేసుకున్న జనరల్ మేనేజర్ బట్టు రామారావుతో పాటు మధ్యవర్తులు, వ్యాల్యేటర్లు కుమ్మక్కై పిష్ కల్చర్ కోసం రుణాలను ఇచ్చినట్లు చూపించి ఈ మొత్తాలను కాజేశారని బ్యాంక్ అంతర్గత ఆడిట్‌లో కొన్నాళ్ల క్రితం బయట పడింది. దీనిపై కూలంకషంగా చర్చించిన బ్యాంక్ యాజమాన్యం చివరకు జిఎం రామారావును బాధ్యతల నుంచి తప్పించి సిబిఐకి ఫిర్యాదు చేసింది. వీరంతా 22 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఈ మొత్తాలను కాజేశారని బయట పడింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్, విశాఖపట్టణంలోని సిరిపురం బ్యాంక్‌లలో ఈ గోల్‌మాల్ జరిగిందని తేలింది. బ్యాంక్ యాజ మాన్యం ఇచ్చిన ఫిర్యాదుపై కేసును నమోదు చేసిన సిబిఐ పలు చోట్ల దాడులను జరిపి సోదాలను నిర్వహించింది. ఈ సందర్భంగా కొంత విలువైన సమాచారం లభిం చిందని తెలిసింది. త్వరలోనే నిందితులను అరెస్టు చేసేం దుకు సిబిఐ రంగం సిద్ధం చేస్తోంది.

టోటెం ప్రమోటర్లను అరెస్టు చేసిన సిబిఐ

వందల కోట్ల అప్పులను తీసుకుని బ్యాంకులకు పంగనామం పెట్టిన టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన ఇద్దరు ప్రమోటర్లను సిబిఐ అరెస్టు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) బ్యాంక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొట్టెంపూడి సలాలత్, తొట్టెంపూడి కవితలను సిబిఐ అధికారులు బెంగళూరులో శుక్రవారం అరెస్టు చేశారు. టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ రోడ్ల నిర్మాణం, వాటర్ వర్క్స్, భవనాల నిర్మాణంతదితర వాటి ఎస్టిమేషన్, సేకరణ, నిర్మాణం (ఇపిసి)లను రూపొందించి ఇచ్చింది. సంస్థ పలు ప్రాజెక్టు పనులను చేపట్టిన సమయంలో వ్యాపారాభివృద్ధి కోసమంటూ ప్రమోటర్లు ఇద్దరు యుబిఐతో సహా మొత్తం ఎనిమిది బ్యాంకుల నుంచి రుణాలను పొందింది. ఆ తర్వాత కొంత మొత్తాలను చెల్లించిన సంస్థ మిగతా రూ. 1394.43కోట్లను ఎగవేసింది. దీనిపై బ్యాంకర్లు ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపించినప్పటికీ స్పందనలేదు.

టీవీ చానళ్లపై బార్క్ కొరడా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రేటింగ్ కోసం అడ్డదారులు తొక్కుతున్న టీవీ ఛానళ్లపైబ్రాడ్‌కాస్టర్స్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్(బార్క్) కొరడా ఝుళిపించింది. రేటింగ్ మీటర్లను ప్రభావితం చేస్తున్నట్లు బార్క్ గుర్తించింది. ట్యాంపరింగ్‌పై పక్కా ఆధా రాలతో బార్క్ ఇండియా విజిలెన్స్ టీమ్ తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు నందిం చింది. రేటింగ్‌లో ప్రభావితం చేసేవారిపై మోసం, నమ్మక ద్రోహం కింద పోలీసులు కేసులు నమోదు చేస్తారు. తెలంగాణలో ట్యాంపరింగ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

బోరు బావిలో పైపులు వేస్తుండగా ఘటన

నంగునూర్, ప్రభ న్యూస్ : బోరు బావిలో మోటార్ పైపులు దించుతుండగా విద్యుత్ వైర్లు తగిలి ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన విషాద సంఘటన సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన జాప రాజయ్య(28) వికలాంగులు కావడంలో భార్య లావణ్యతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పంటల సాగు కోసం గతంలో ఐదు బోర్లు వేయగా ఒక్క బోరులో నీళ్లు వచ్చాయి. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో పొలం ఎండుతుందన్న ఉద్దేశంతో శుక్రవారం తన తమ్ముడు జాప నర్సింలు, మంత్రి పర్శరాములుతో కలిసి బోరు ఇనుప పైపులు దించుతున్న క్రమంలో గుంత పైన ఉన్న 11 కేవి విద్యుత్ వైర్లకు పైపులు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై రాజయ్య అక్కడికక్కడే మృతి చెందగా నర్సింలు పర్శరాములుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా సిద్దిపేట ఏరియాసుపత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు. మృతుడు రాజయ్యకు భార్య, 5 సంవత్సరాల చిన్నారులు హారిక, భవ్యలు ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌పేట ఎస్సై చంద్రశేఖర్, వీఆర్వో అశోక్, విద్యుత్ ఏఈ రియాజ్ అహ్మద్‌ఖాన్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ఏరియాసుపత్రికి తరలించారు.

వెల్‌నెస్‌కు 'ఇల్'

- 15 రోజులుగా రోగులకు ఇబ్బందులు
- నిధుల కొరతతో పరీక్షలు నిలిపివేత
- కొత్త సీఈవోకు సమస్యల స్వాగతం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సంవత్సరం క్రితం జర్నలిస్టులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఫించన్‌దారులకు మెరుగైన వైద్యం అందిం చడానికి వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్ని రోజులుగా ఈ సెంటర్లలో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.దీంతో ఇక్కడకు వచ్చిన ఉద్యోగులు, జర్నలిస్టులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ టెస్టులు అందు బాటులో లేకపోతేనే వేరే ఆస్పత్రులకు వారిని పంపి స్తారు. ప్రభు త్వం ఒప్పందం చేసుకున్న సూపర్ స్పెషాలిటీ ఆస్ప త్రులకు చాలా వరకు బకాయిలు చెల్లించక పోవడంతో ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ పథకం లబ్ధి దారులు ఇబ్బం దులు పడుతున్నారు. ప్రస్తుతం కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న నిమ్స్ డైరెక్టర్, ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ మనోహర్‌కు ఈ బాధ్యతలు ఒకింత ఇబ్బందేనని పలువురు పేర్కొంటున్నారు. మొదటగా ఆస్పత్రుల బకా యిలను చెల్లించకపోతే అందరి నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు.

మిగతా సెంటర్ల ప్రారంభం ఎప్పుడూ..

మొదటగా ఖైరతాబాద్‌లో అనంతరం వనస్థలిపురంలో వీటిని ప్రభుత్వం ప్రారంభించింది. దీంతోపాటు చార్మినార్, కూకట్‌పల్లిలో కూడా వెల్‌నెస్ సెంటర్లను త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొంది. దీనివల్ల ఈ రెండు సెంటర్లపై ఒత్తిడి తగ్గించవచ్చన్నది ప్రభుత్వం ఆలోచన. వీటితోపాటు అన్ని పాత జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినా ఇప్పటివరకు 4 వెల్‌నెస్ సెంటర్లనే ప్రభుత్వం ప్రారంభించింది. ఇంకా 10 చోట్ల వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత సీఈఓ మార్పుతో మిగతా వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం త్వరగా జరుగుతుందా లేదా అన్న విషయం తెలియాల్సి ఉంది.

అప్పట్లో ఎవరూ సహకరించలేదు

రెండురోజులుగా ఆరోగ్య శ్రీ ట్రస్టుకు చెందిన ఓ ఉన్నతా ధికారి ఈ రెండు వెల్‌నెస్‌లను పర్యవేక్షిస్తున్నట్టు సమా చారం. దీంతోపాటు ఈ రెండు వెల్‌నెస్‌లో ఎన్ని మం దులు, ఎన్ని పరికరాలు ఉన్నాయో అన్ని రికార్డులను పరిశీలించినట్టు సమాచారం. అసలు ఆరోగ్య శ్రీ ట్రస్టు కిందకు వెల్‌నెస్ సెంటర్లను చేర్చమని అసెంబ్లీ సాక్షిగా సీఎం పేర్కొన్నారు. దీంతోపాటు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి కూడా ఇదే విషయాన్ని తెలిపారు. అయితే రెండు రోజులుగా ఆరోగ్యశ్రీ ట్రస్టులో పనిచేసే ఉన్నతాధికారులు వెల్‌నెస్ సెంటర్‌లను పర్యవేక్షిం చాల్సిన అవసరం ఏముందని ప్రస్తుతం అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సీఈఓగా కల్వకుంట్ల పద్మ ఉన్నప్పుడు ఒక్కరూ కూడా ఆరోగ్య శ్రీ ఉద్యోగులు సహకరించలేదని ఆమెను ఆ స్థానం తొలగించగానే వెల్‌నెస్ సెంటర్‌లకు వారు రావడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటో ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈఓకే తెలియాలని ఉద్యోగులు, జర్నలిస్టుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగుల్లో ఆశ్చర్యం

సంవత్సర కాలంగా ఉద్యోగులు, జర్నలిస్టులు, పింఛన్‌దారుల ఆరోగ్య పథకానికి సీఈఓగా ఉన్న కల్వకుంట్ల పద్మను ఆ బాధ్యతల నుంచి తప్పించి ఆరోగ్య శ్రీ సీఈఓగా ఉన్న డాక్టర్ మనోహర్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ ట్రస్టు కింద కాకుండా ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్‌కు సపరేటు బడ్జెట్‌ను (రూ.350 కోట్లు) కేటాయించారు. ఆరోగ్య శ్రీని నిర్వహిస్తున్న భవనంలోనే ఈజేహెచ్‌ఎస్ సీఈఓ కూర్చోవాలని మొదటగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు ఆరోగ్య శ్రీ ట్రస్టులో పనిచేసే సిబ్బందిని కూడా ఉపయోగిం చుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. కానీ ఇప్పటివరకు ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సీఈఓకు కార్యాలయంతో పాటు సిబ్బందిని కేటాయించలేదు.

18 సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులతో ఒప్పందం

ఉద్యోగులు, జర్నలిస్టులు ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్,జేహెచ్‌ఎస్) కింద సేవలను అందించేందుకు నగరంలోని 18 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో ఒప్పందం చేసుకుంది. 2016, డిసెంబర్ 24న ఖైరతాబాద్‌లోని వెల్‌నెస్‌సెంటర్‌ను ప్రారంభించింది. దేశంలోనే తొలిసారిగా వెల్‌నెస్‌లో ఓపీ సేవలను కూడా ప్రారంభించింది. 1885 రకాల వ్యాధులతో పాటు వాటికి సంబంధించిన చికిత్సలు ఉచితంగా అందించడంతో పాటు రెండు వందల బ్రాండెడ్ మందులను సైతం అందజేస్తున్నారు. ప్రస్తుతం వనస్థలిపురం, ఖైరతాబాద్, వరంగల్‌లతో పాటు సంగారెడ్డిలో వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభమయ్యాయి. (ఈహెచ్‌ఎస్,జేహెచ్‌ఎస్) కింద సేవలను పొందడానికి ప్రత్యేకయాప్‌ను రూపొందించారు.



అనంత-చిత్తూరు మధ్య ఆటోమొబైల్ హబ్

- రూ.35 వేల కోట్ల పెట్టుబడులు సిద్ధం
- ఒప్పందాల ద్వారా 13లక్షల మందికి ఉపాధి
- పారిశ్రామికవేత్తలకు ఫోన్ కాల్ దూరంలో ఉంటా
- ఎలక్ట్రికల్ మోటార్ వాహనాల తయారీకి సూచన

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: అనంతపురం- చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రాంతాల మధ్య ప్రాంతాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలియజేశారు. ఇప్పటివరకూ కుదిరిన పారిశ్రామిక ఒప్పందాలన్నీ అమలులోకి వస్తే 13 లక్షలమందికి ఉపాధి లభిస్తుందని, ఒక్క ఆటో మొబైల్ రంగంలోనే రూ. 35 వేల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయన్నారు. పర్యావరణపరమైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రికల్ మోటార్ వాహనాల తయారీపై దృష్టిని సారించాలని హీరో మోటార్స్ యాజమాన్యానికి సూచించారు. పారిశ్రామికాభివృద్ధి పట్ల తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి గురించి వివరిస్తూ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి వచ్చినవారికి 24 గంటలు ఫోన్ కాల్‌లో అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా సత్యవేడు వద్ద మాదనపాలెం వద్ద 600 ఎకరాల స్థలంలో రూ. 1,600 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న హీరో మోటారు వాహనాల పరిశ్రమకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు.

హీరో మోటో కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పవన్ ముంజాల్‌తో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ హీరో అధినేత ముంజల్ కుటుంబంతో తనకు పదేళ్లకుపైగా పరిచయాలున్నాయని, ఆ పరిచయంతోనే తాను కోరగానే జిల్లాలో హీరో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారన్నారు. మోటార్ బైకుల ఉత్పత్తిలో ప్రపంచంలో రెండవస్థానంలో, దేశంలో మొదటి స్థానంలో ఉన్న హీరో పరిశ్రమ చిత్తూరు జిల్లాకు రావడం చరిత్రాత్మకమైన విషయమన్నారు. ఈ పరిశ్రమ రావడం వల్ల మరో రూ. వెయ్యికోట్లకు పైగా ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమలు తరలివస్తాయన్నారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లోని అనంతపురంలో కియా పరిశ్రమతో పాటు 13 ఆటో మొబైల్ పరిశ్రమలు రానున్నాయని పేర్కొంటూ ఆ ప్రాంతాన్ని కొరియన్ టౌన్ షిప్‌గా రూపుదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇటువైపు చిత్తూరు జిల్లాలో సత్యవేడు ప్రాంతంలో ఇదివరకే శ్రీసిటీ సెజ్‌లో ఇసుజు, కొబెల్కో వంటి పరిశ్రమలు వచ్చాయని, అపోలో టైర్ల పరిశ్రమ పనులు ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం హీరో పరిశ్రమ వచ్చిందని, త్వరలో అశోక్ లేలాండ్, టివిఎస్ వంటి భారీ ఆటోమొబైల్ దిగ్గజాల వంటి పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని అటు కియా పరిశ్రమ వద్దనుంచి ఇటు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వరకు రవాణా వ్యవస్థను పటిష్టపరుస్తున్నామన్నారు. తద్వారా అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య ప్రాంతాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆటోమొబైల్ హబ్‌గా చేయాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. గత మూడేళ్ల మధ్యకాలంలో వివిధ జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ. 18 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం ఏర్పడిందన్నారు. వివిధ దశల్లో ఉన్న పరిశ్రమలు పూర్తయితే ఒక్క ఆటో మొబైల్ రంగం ద్వారానే 13 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భవిష్యత్తులో చెన్నై- వైజాగ్, చెన్నై- బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ రానున్నందున ఈ మధ్యలో ఉన్న ప్రాంతం భారీగా వచ్చే పరిశ్రమలతో చైనా దేశానికి చెందిన షాంగై తరహాలో అభివృద్ధి చెందుతుందన్నారు. వాహనాల వల్ల వచ్చే కాలుష్యాన్ని నివారణకు ఎలక్ట్రికల్ మోటార్ వాహనాలను తయారు చేయడంపై దృష్టిసారించాలని హీరో సంస్థ యాజమాన్యానికి సూచించారు. అన్నిరకాల వసతి సౌకర్యాలను కల్పించడంతో పాటు అన్ని రకాల అనుమతులను పారదర్శకంగా అందిస్తున్నామని పేర్కొంటూ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వచ్చేవారికి ఎటువంటి సమస్య ఎదురైనా ఒక ఫోన్ కాల్ చేస్తే వెంటనే పరిష్కరించడానికి 24 గంటలు సిద్ధంగా ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. తమ ప్రభుత్వ యంత్రాంగం కూడా అందుకు తగినట్టుగా అందుబాటులో ఉంటుందన్నారు.

చంద్రబాబు వల్లే యూనిట్ ఏర్పాటు

హీరో సీఎండీ పవన్ ముంజాల్ వెల్లడి



దేశంలోనే 8వ యూనిట్‌గా హీరో మోటార్స్ యూనిట్‌ను దక్షిణాదికి చెందిన మరో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న తాను కేవలం చంద్రబాబునాయుడు వల్లనే చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నానని హీరో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పవన్ ముంజాల్ వెల్లడించారు. దాదాపు 18 ఏళ్ల క్రితం గుర్గావ్‌లో ప్రారంభించిన హీరో పరిశ్రమను నాలుగేళ్లకు ఒక యూనిట్ చొప్పున విస్తరిస్తూ వస్తున్నాననారు. ఈ క్రమంలో దక్షిణభారతదేశంలో తొలి యూనిట్‌ను మరో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నానన్నారు. కానీ రెండేళ్లక్రితం తన ఆహ్వానంపై తన ఇంటికి విందు భోజనానికి వచ్చిన చంద్రబాబునాయుడు తన నిర్ణయాన్ని మార్చుకునేలా చేశారన్నారు. కేవలం ఆయన తనకు నచ్చచెప్పిన తీరు వల్లనే తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకుని చిత్తూరు జిల్లా సత్యవేడులో ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చానన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 8 యూనిట్ల ద్వారా ఏటా 11 మిలియన్ల మోటార్ బైకుల తయారీ లక్ష్యంగా పెట్టుకున్నామని చెబుతూ చిత్తూరు యూనిట్ ద్వారా ఏటా 1.08 మిలియన్ల బైకులను, స్కూటర్లను తయారు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన యూనిట్‌ను 2019 డిసెంబర్ లో ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే ఏడాది మార్చి లోగా ప్రారంభించాలని కోరుతునారని పేర్కొంటూ అంతకుముందుగా సాధ్యంకాక పోయినా 2019 ఆగస్టు, సెప్టెంబర్ ప్రాంతాలలో ప్రారంభించడానికి కృషి చేస్తామన్నారు. రూ. 1600 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే పరిశ్రమ ద్వారా 12 వేలమందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి అమరనాథ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు అమోఘం

- గవర్నర్ నరసింహన్ కితాబు



పుట్టపర్తి, ప్రభ న్యూస్: భగవాన్ సత్యసాయి బాబా సెంట్రల్ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు అమోఘమని గవర్నర్ నరసింహన్ కొనియాడారు. శుక్రవారం మధ్యాహ్నం 12:10గంటలకు ఆయన అనంతపురం జిల్లా పుట్టపర్తి ప్రశాంతినిలయంలోని శాంతిభవన్ వద్దకు చేరుకోగా అక్కడ ఆయనకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్‌జే.రత్నాకర్, ప్రసాదరావు, చక్రవర్తిలు, జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్, ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్‌డీఓ రామ్మోహన్, డీఎఫ్ఓ చంద్రశేఖర్‌లు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి ఆయన శాంతిభవన్ చేరుకుని అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుని 1:00గంటకు భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం తన సమీప బంధువు ప్రహ్లాదరాజు ఇంటికెళ్ళి ఆయనతో ముచ్చటించారు. అనంతరం తిరిగి శాంతిభవన్ చేరుకుని 2గంటలకు తిరిగి బయలుదేరి వెళ్ళారు. అంతకుమునుపు గవర్నర్‌ను శాంతిభవన్‌లో ట్రస్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని కాసేపు చర్చించారు. ఈసందర్భంగా గవర్నర్ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అనిర్వచనీయమని సత్యసాయి ప్రవేశపెట్టిన విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యనందిస్తున్నాయని సాయి సేవలను ప్రశంసించినట్లు తెలిసింది.

ఆ నలుగురిపై వేటు వేయండి

- ఈసీకి టీ పిసీసీ చీఫ్ ఉత్తమ్ ఫిర్యాదు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాజకీయాలను నీచమైన స్థాయికి దిగజార్చింది సీఎం కేసీఆర్‌యేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీతో పాటు పెద్దలకు సంబంధించిన ఎన్నికల్లో సైతం కేసీఆర్ చేసే రాజకీయా లను చూస్తే ఏవగింపు కలుగుతుందన్నారు. శుక్రవారం ఆయన మీడియాపాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గిరిజన నేత అయిన బలరాం నాయక్‌ను నిలబెడితే తమ అభ్యర్థి గెలవద్దని సీఎం కుట్రలు, కుతంత్రాలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు ఓట్లు వేసేటప్పుడు ఎన్నికల్లో హాల్‌లో ఏజెంట్‌లకు చూపించి ఓట్లు వేయాలని కానీ విప్‌ను జారీ చేసినా విప్‌కు వ్యతిరేకంగా కొందరు ఎమ్మె ల్యేలు టీఆర్ఎస్‌కు ఓటు వేశారన్నారు. విప్ దిక్కరించిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రెడ్యానాయక్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, కోరం కనకయ్య, విఠల్‌రెడ్డి, భాస్కర్‌రావులపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. తమ పార్టీ ఏజెంట్ అయిన కాంతారావుకు ఆ ఏడుగురు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌కు ఓటు వేస్తున్నట్టు చూపించారని ఉత్తమ్ కుమార్ ఆరోపించారు.

ప్రభుత్వానికి తొత్తుగా అసెంబ్లీ సెక్రటరీ వ్యవహరిస్తున్నారు

అసెంబ్లీ సెక్రటరీ నర్సింహా చార్యులు కూడా ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అసెంబ్లీ సెక్రటరీకి 7 గురు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేస్తే దానికి సంబంధించిన రశీదు ఇవ్వమంటే సీఎంకు, స్పీకర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడని ఇంతకన్నా ఘోరం ఎక్కడా ఉండదన్నారు. ప్రభుత్వం కబంధహస్తాల్లో అధికారులు పనిచేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రస్తుతం ఉన్నది 63 సభ్యులని అలాంటప్పుడు 3 రాజ్యసభ్యులను ఎలా నిలబెడతారని ప్రశ్నించారు. దీనిని బట్టి చూస్తే సీఎం రాజ్యాంగాన్ని ఎలా అపహాస్యం చేస్తున్నారో తెలుస్తుందన్నారు. గతంలో ఇలా ఓటు వేసిన ఎమ్మెల్యేలతో పాటు గెలుపొందిన అభ్యర్థి సైతం ఓడిపోయినట్టు సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ప్రస్తుతం వీరికి కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

రెండేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెండేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశపెట్టాలన్నదే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం 'గోగ్రీన్ బ్రీత్‌క్లీన్' వాహనంతోపాటు ఎలక్ట్రిక్ కారును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించడంతో యువతకు విస్తృతంగా ఉపాధి కల్పించేందుకు ఎలక్ట్రికల్ వాహనాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ముందుగా 10 వేల ఎలక్ట్రికల్ వాహనాలను ప్రభుత్వమే వినియోగిస్తుందన్నారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సులు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్ట్రిక్ వాహనానికి చార్జింగ్ చేసేందుకు అయ్యే సమయాన్ని తగ్గించే టెక్నాలజీని అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అనూహ్య ప్రగతి సాధిస్తుందని ప్రధానంగా సౌరవిద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలలో ముందుగా ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించేలా కార్యాచరణ చేపడతామన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగంతో వాతావరణ కాలుష్యంలో వచ్చిన మార్పులు సైతం అంచనా వేస్తామని చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనాల సంవత్సరంగా 2018 సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులకు భారీగా ప్రోత్సహకాలు అందిస్తామని త్వరలోనే దీనికి సంబంధించి నూతన విధానాన్ని రూపొందిస్తా మన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను అప్‌డేట్ చేయడం వలన అయ్యే



వ్యయభారం, చేకూరే ప్రయోజనంపై ముఖ్యమంత్రి వివరించారు. ఈఈఎస్ఎల్ భాగస్వామ్యంతో పైలెట్ ప్రాజెక్ట్‌గా రాష్ట్రంలో 300 ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించనున్నామన్నారు. 10 వేల వాహనాలు పంపిణీ చేసేందుకు ఈఈఎస్ఎల్‌తో ఇటీవల అవగాహన ఒప్పందం కుదిరినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా 10 వేల వాహనాలు సమకూర్చాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎలక్ట్రిక్ బస్సు ప్రారంభించి అందులో సచివాలయంలో చక్కర్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, నెట్‌క్యాప్ ఎండీ కమలాకర్, టాటా నేషనల్ హెడ్ అసీష్‌ధర్ పాల్గొన్నారు.

హస్తినతో చర్చలకు బ్రేక్

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రంతో ఇక నుంచి ముఖాముఖి చర్చలకు దూరంగా వుండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఇదే విషయమై మంత్రులు, ఎంపీలకు కూడా స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంతో ఎన్నిసార్లు చర్చలు జరిపినా వృథాప్రయాసగా మారిందనేది చంద్రబాబు అభిప్రాయంగా మారింది. ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించిన హామీల అమలులో జరుగుతున్న తాత్సారంపై ఇప్పటికే ప్రజలలో బలంగా నాటుకు పోయిందని , పైగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, పార్లమెంట్ వేదికగా జరుగుతున్న ఎం.పి.ల ఆందోళన దరిమిలా ఇప్పుడు ముఖ్యమంత్రి కానీ, లేదా మంత్రులు కానీ కేంద్రం చర్చల పేరుతో పిలిస్తే వెళ్ళరాదంటూ ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఈ విధంగా జరిగితే ప్రజలను అవమానపరచడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదిలా వుండగా, మరోవైపు శరవేగంగా మారుతున్న రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూకుడు పెంచడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. కేంద్రంతో పూర్తిస్థాయిలో తలపడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న ముఖ్యమంత్రి బహుముఖ వ్యూహాలకు పదును పెట్టే దిశగా కసరత్తు ప్రారంభించారు. అయిదు కోట్ల ఆంధ్రులను కేంద్రం అవమానిస్తోందని తీవ్ర ఆగ్రహంతో వున్న క్రమంలోనే ఏ వేదికపై కూడా కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధించడానికి వెనుకాడడం లేదు. మరో ఏడాది పాటు దీర్ఘకాలిక ఉద్యమాన్ని నడిపేందుకు సర్వం సిద్ధం చేసుకున్న నేపథ్యంలోనే అసెంబ్లీ సమావేశాలను చక్కని అవకాశంగా వినియోగించుకుంటున్నారు. శాసనసభ, శాసనమండలి వేదికలుగా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని కేంద్రం అనుసరిస్తున్న ఏపీ వ్యతిరేక విధానాలపై దండెత్తడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. తొలుత రాజకీయ వేదికలపై, పార్టీ అంతర్గత, సమన్వయ, మంత్రివర్గ , సమీక్షా సమావేశాలలో కేంద్రం వివక్షను ఎండగట్టిన ముఖ్యమంత్రి తాజాగా రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా హస్తిన పాలనపై ఆరోపణాస్త్రాలను ఎక్కుపెడుతున్నారు. అధికారిక సమావేశాలలోనూ విభజన చట్టం, రాష్ట్ర విభజన, హామీలపై ప్రస్తావిస్తుండటం ద్వారా పెద్ద ఎత్తున కేంద్ర సర్కారుపై సమరానికి సంసిద్ధులయ్యారని విదితమవుతోంది. తిరుమల దర్శనానికి వెళ్ళిన సందర్భంలోనూ కేంద్రాన్ని వదిలిపెట్టని చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సమావేశంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు ఏవిధంగా అన్యాయం జరుగుతున్నదీ విడమర్చి చెప్పారు. ఇతర రాష్ట్రా లకు చెందిన ప్రతినిధులు సైతం వున్న ఈ స మావేశంలో అధికారులు, ఐఎస్‌బి ఉన్నతాధికారులనుద్దేశించి ఒకవైపు ప్రసంగిస్తూనే, మరోవైపు రాజకీయ అంశాలను ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన చట్టంలోని పలు అంశాలకు సంబంధించి దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. రాజకీయ విపత్కర పరిస్థితులలో కూడా 2014లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ టార్గెట్‌గా అస్త్రాలు సంధించి ఎన్నికల సమరాంగణలో కృతకృత్యులయ్యారు. అనూహ్యంగా అధికారంలోకి వచ్చారు. అదే విధంగా 2019 లో మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు వేస్తున్న ఎత్తుగడలు ఫలిస్తాయనే ప్రగాఢమైన విశ్వాసం చంద్రబాబునాయుడులో కనిపిస్తోంది. ఇది ఒక విధంగా సాహసోపేతమైన నిర్ణయమే అయినప్పటికీ, ఎన్డీయేను ఢీకొనేందుకే ముఖ్యమంత్రి సిద్ధమయ్యారు.

తెగించి పోరాడుదాం

- ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రా నికి సంబంధించిన డిమాండ్ల సాధనలో 1985నాటి స్ఫూర్తిని చాటాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ప్రత్యేక హోదాతోపాటు విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నింటిపైనా కేంద్రం దిగిరావాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, పార్లమెంట్‌లో జరుగుతున్న ఆందోళన, ఇతర అంశాలపై ఆయన శుక్రవారం ఆయన టీడీపీ ఎంపీలు, కొందరు మంత్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉద్యమపథంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేంద్రం వైఖరిపై మండిపడ్డారు. 1985 లో పూర్తి మెజారిటీ వున్నప్పటికీ ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చిన సందర్భంలో 161 మంది ఎమ్మెల్యేలు ఏకతాటిపై నిలిచి కేంద్రం వెన్ను విరిచిన సంగతిని గుర్తు చేశారు. ఎంపీల పోరాటం ప్రజలలోకి బలంగా వెళ్లిందని, రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నిరసనలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, అనుకున్న లక్ష్యం సాధించాలని పిలుపునిచ్చారు. ఏకతాటిపై ఎంపీలంతా నిలబడటం ద్వారా రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని, ప్రజల మనోభావాలు ప్రతిబింబింపజేయాలన్నారు. పదేపదే కేంద్రం చుట్టూ తిరిగామని, అయినా స్పందించలేదని, ఒకటికి పదిసార్లు అడినా స్పందించలేదని, పైగా ఇవ్వాల్సినవి కోత పెడుతున్నారన్నారు. ఇతరులకు మాత్రం ధారాళంగా ఇస్తున్నారని, ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని, ఈశాన్య రాష్ట్రాలకు కేంద్రం రూ.3వేల కోట్లు విడుదల చేసిందని, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే నిధులలో కోత విధిస్తుండటం సరైన విధానం కాదని అన్నారు. రాష్ట్రగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని, ప్రజల హక్కులు కాపాడమంటున్నామని, అందులో తప్పేమిటని చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. రాష్ట్రా నికి ఎందుకు న్యాయం చేయరు? మన హక్కులు ఎందుకు నెరవేర్చరు? అని అంటూ ఎంపీలంతా జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాబోయే ఇబ్బందులకు సిద్ధంగా ఉండాలని, అన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధపడాలన్నారు.

ఏపీ మహిళలకు స్వచ్ఛత అవార్డులు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు స్వచ్ఛత అవార్డుల పంట పండింది. దేశవ్యాప్తంగా 57 అవార్డులు ప్రకటించగా అందులో పది ఆంధ్రప్రదేశ్‌కే దక్కడం విశేషం. ఏపీ నుంచి వచ్చిన మహిళలకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ స్వచ్ఛత ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. మొదటి అవార్డు దక్కించుకున్న గుంటూరు జిల్లా, నరసరావుపేట మెప్మాకు లక్షా 50 వేల రూపాయలు నగదు బహుమతి లభించింది. రెండో అవార్డు అందుకున్న సత్తెనపల్లి, చీరాల, గుంటూరు మెప్మా ఏఎల్ఎఫ్ మహిళా సంఘాలకు లక్ష రూపాయలు నగదు బహుమతి లభించింది. మూడో బహుమతి సాధించిన నెల్లిమర్ల, సాలూరు, సామర్లకోట, చీమకుర్తి, గుంటూరు బాలాజీ నగర్ సమాఖ్య, తెనాలి సమాఖ్య గ్రూపులకూ అవార్డులు దక్కాయి. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని, అందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పించినందుకుగానూ ఈ అవార్డులు లభించాయి. తమకీ అవార్డు లభించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖా మంత్రి నారాయణకు మెప్మా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్ల అమలులో కేసీఆర్ వైఫల్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముస్లిం మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వైఫల్యం చెందారని తెరాసలో ఉన్న ముస్లిం నాయకులు ఆ పార్టీని వీడాలని కాంగ్రెస్ సీనియర్ నేత షేక్ అబ్దుల్లా సోహెల్ సూచించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీతో పాటు ప్రభుత్వంలో ఉన్న ముస్లిం నాయకులు, ప్రజా ప్రతినిధులు వెంటనే తెరాసకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ళుగా రిజర్వేషన్లు కల్పిస్తామంటూ కేసీఆర్ హామీలు ఇస్తూనే ఉన్నారని, దీనిపై తెరాస నాయకులు మౌనం వహిస్తున్నారని సోహెల్ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లిం సమాజాన్ని మోసం చేశారని, ఈ నేపథ్యంలో తెరాసలో ఉన్న ముస్లిం నేతలు వాస్తవాలు గ్రహించాలని ఆయన కోరారు.

డిగ్రీలో 57 వేల సీట్లు తగ్గింపు

- రెండేళ్లుగా అడ్మిషన్లు లేని కాలేజీలు51
- 186 కాలేజీల్లో రెండేళ్లుగా 25శాతం కంటే తక్కువ సీట్లు భర్తీ
- 23 డిగ్రీ కాలేజీలు, 4 వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీలో సీట్ల కోత

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గత ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో వేలాది సీట్లు తగ్గిపోగా వచ్చే ఏడాదిలో డిగ్రీ కాలేజీల్లో సీట్లు తగ్గనున్నాయి. 2018-19 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో సుమారు 57 వేల సీట్ల వరకు తగ్గనున్నాయి. రాష్ట్రంలోని కొన్ని కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా లేకపోగా... కొన్ని కాలేజీల్లో ఒకటి, రెండు, మూడు సీట్లు భర్తీ అయినవి కూడా ఉన్నాయి. 186 కాలేజీల్లో అనుమతి ఉన్న సీట్లలో 25 శాతం కంటే తక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. వీటిలో ప్రైవేటు డిగ్రీ కా లేజీల తోపాటు... 23 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా... 4 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీలు కూడా ఉండటం గమనార్హం. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో చేరే విద్యార్థుల పరిస్థితి ఇలా ఉంది.



51 కాలేజీల్లో అడ్మిషన్లు నిల్

రాష్ట్రంలోని డిగ్రీ కోర్సులను 6 విశ్వవిద్యాలయాలు కొనసాగిస్తున్నాయి. వాటిలో గత రెండేళ్లుగా 51 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా లేకుండా సున్నా ప్రవేశాలతో కొనసా గుతున్నాయి. వాటిలో అత్యధికంగా కాకతీయ యూనివర్సి టీలో ఉన్నాయి. కెయు పరిధిలోని 23 కాలేజీల్లో గత రెండేళ్లుగా ప్రవే శాలు జరగడం లేదు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 9 కాలేజీలు, ఉస్మానియా యూనివ ర్సిటీ పరిధిలో 3 కాలేజీలు. పాలమూ రు యూనివర్సిటీలో 4 కాలేజీలు, శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 8 కాలేజీలు, తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 4 కాలె జీ ల్లో ప్రవేశాలు జరగలేదు. మొత్తం 51 కాలేజీల్లో కలిపి 10,150 సీట్లు ఉన్నాయి.

186 కాలేజీల్లో 25 శాతంలోపు ప్రవేశాలు

రాష్ట్రంలోని 6 యూని వర్సిటీల పరిధిలో 186 కాలేజీల్లో 25 శాతం లోపే అ డ్మిషన్లు జరిగాయి. వాటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు కూడా ఉండటం గమనార్హం. వీటిలో కూడా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోనే ఎక్కువ కాలేజీలు ఉన్నాయి.

కెయు పరిధిలోని 68 కాలేజీల్లో 25 శాతం లోపే అడ్మిషన్లు జరిగా యి. 68 కాలేజీల్లో మొత్తం సీట్లు 25,055 ఉండగా వాటిలో కేవలం 4047 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 43 కాలేజీల్లో 10,610 సీట్లు ఉండగా వాటిలో 1731 సీట్లు భర్తీ అయ్యాయి. శాతవాహన యూనివర్సిటీలోని 25 కాలేజీల్లో 7020 సీట్లు ఉండగా వాటిలో 876 సీట్లు భర్తీ అయ్యాయి. పాలమూరు యూ నివర్సి టీలో 20 కాలేజీల్లో 5760 సీట్లకు గానూ 942 సీట్లు భర్తీ అయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీలో 14 కాలేజీల్లో 3910 సీట్లకు గానూ 628 సీట్లు, మహాత్మాగాంధీ యూనివర్సి టీ పరిధిలోని 16 కాలేజీల్లో 3930 సీట్లకు గానూ 579 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా 186 కాలేజీల్లో 56,285 సీట్లకు గానూ భర్తీ అయింది కేవలం 8803 సీట్లు మాత్రమే. సరాసరి అయితే కేవలం 15.3 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి.

ప్రభుత్వ కాలేజీలు కూడా ఉన్నాయి

25 శాతం లోపు సీట్లు భర్తీ అయిన వాటిలో 23 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కూడా ఉన్నాయి. వాటిలో అత్యల్పంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 440 సీట్లకు గానూ కేవలం 23 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 220 సీట్లకు గానూ 24 సీట్లు భర్తీ అయ్యాయి. ఇవి కాకుండా ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీల్లోని 4 కాలేజీల్లో కూడా 25 శాతం కంటే తక్కువగా సీట్లు భర్తీ అయ్యాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో ప్రారంభించిన మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో సీట్లు తక్కువగా భర్తీ అయ్యాయి.

ఒకటి, రెండు సీట్లు భర్తీ

రాష్ట్రంలోని 4 డిగ్రీ కాలేజీల్లో ఒక్కొక్కటి చొప్పున అడ్మిషన్లు జరిగాయి. ఒక కాలేజీలో రెండు సీట్లు ప్రవేశాలు జరగగా మూడు కాలేజీల్లో మూడు మూడు చొప్పున అడ్మిషన్లు జరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆదిత్య డిగ్రీ కాలేజ్, వేములవాడ.. మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో గల పట్టాభి డిగ్రీ కాలేజ్, కరీంనగర్ జిల్లా గోపాల్‌రావుపేటలోని ప్రగతి డిగ్రీ కాలేజ్, యాదాద్రి జిల్లాలోని యాదగిరిపల్లిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కాలేజీల్లో ఒక్కొక్కటి అడ్మిషన్లు అయ్యాయి. వరంగల్ అర్బన్ జిల్లాలోని జాఫ‌గడ్‌లో గల ప్రజాధరణ డిగ్రీ కాలేజీలో రెండు అడ్మిషన్లు అయ్యాయి. యాదాద్రి జిల్లా భువనగిరిలోని శ్రీసాయి కృప డిగ్రీ కాలేజీలో, కామారెడ్డిలోని పిజెఆర్ఎస్ స్ఫూర్తి డిగ్రీ కాలేజ్, వరంగల్ రూరల్ జిల్లాలోని ధర్మారంలో గల ఎస్ఎస్ డిగ్రీ కాలేజీలో మూడు చొప్పున అడ్మిషన్లు అయ్యాయి.

పోలవరం పారదర్శకం

- మసూద్ కమిటి సంతృప్తి
- కేంద్రానికి నివేదిక
- నవయుగ వచ్చిన తర్వాత పనుల్లో వేగం



అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు మసూద్ కమిటీ క్లీన్ చీట్ ఇచ్చింది. ప్రాజెక్టు పనుల పరిశీలనకు కేంద్రం నియమించిన ఈ కమిటీ ప్రాజెక్టును సందర్శించి,పనులను పరిశీలించిన సంగతి తెలిసిందే. పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ కేంద్రానికి తాజాగా నివేదిక ఇచ్చింది. పోలవరం పనులు, పునరావాసానికి తీసుకున్న చర్యలపై కూడా నివేదికలో కమిటీ సంతృప్తి వ్యక్తం చేసిందంటున్నారు. అయితే నవయుగ కంపెనీ రంగంలోకి దిగిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెరిగిందని, రోజుకు 4,800 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని మసూద్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. అంతేకాకుండా నవయుగ కంపెనీ లక్ష్యానికి చేరుకుంటుందని కూడా కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. అలాగే పునరావాసం పనులు సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంది. పైడిపాక గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడిన మసూద్ కమిటీ సభ్యులు పునరావాసంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారని కమిటీ నివేదికలో పేర్కొంది. దీంతో ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కమిటీ నివేదికతో పనుల్లో ఎటువంటి అవినీతి చోటు చేసుకోలేదని తేటతెల్లమైందని అంటున్నారు.



అసెంబ్లీ సమావేశాలు



ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్

● ఇరిగేషన్‌శాఖ మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులు కుట్రతో కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు...చనిపోయిన వారి పేర్ల మీద కోర్టుల్లో కేసులు వేసి కోర్టులనూ తప్పుదోవ పట్టిస్తున్నారు, ప్రభుత్వానికి మంచి పేరు రావొద్దనే ఇలా చేస్తున్నారు, టీఆర్ఎస్ చేస్తున్న మంచి పనులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు తీరును శాసనసభలో ఎండగట్టాలనే ఇన్నాళ్లూ వేచి చూశా అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడెప్పుడా అని, కానీ వాళ్లు లేకుండా పోయారు, మళ్లీ సమావేశాల్లోనే ఆధారాలు బైట పెడ్తా, ప్రజాక్షేత్రంలో వారిని ఎండగడతా అని ఇరిగేషన్ శాఖ మంత్రి హరీష్‌రావు ఉద్వేగంగా ప్రసంగించారు. శుక్రవారం నాడు శాసనసభలో పద్దులపైచర్చలో భాగంగా ఇరిగేషన్ పద్దు ఆమోదం కోరుతూ ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం మూడున్నరేళ్లలో 11 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి తెచ్చిందన్నారు. రాబోయే మూడు, నాలుగుమాసాల్లో మరో 10లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని, కేవలం 4ఏళ్లలో 21లక్షల ఎకరాల ఆయకట్టును కొత్తగా సాగులోకి తెస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిందని, ఇందులో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. తాము కోటి ఎకరాలకు సాగు నీరందించేందుకు నాలుగంచెల్లో ముందుకు సాగుతున్నామని తెలిపారు. చిన్ననీటి పారుదల రంగం ప్రాధాన్యతకు 46 వేల చెరువుల ఆధునీకరణ, ప్రాజెక్టుల మోడ్రనైజేషన్, గత పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టిపెట్టి వాటిని పూర్తి చేయడం, పాలమూరు, కాళేశ్వరం, డిండి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయడం తాము నిర్దేశించుకున్న నాలుగంచెల విధానమని చెప్పారు. ప్రభుత్వ చర్యలతో గడచిన మూడున్నరేళ్లలోనే తెలంగాణ సాగునీటి రంగంలో గొప్ప విజయాలనుసొంత చేసేకుంది.

వేములవాడ గుడి చెరువుకు మిడ్ మానేరు జలాలు

వేములవాడ ఆలయ గుడిచెరువుకు మిడ్ మానేరు ద్వారా నీరందించడానికి సంకెపల్లి వద్ద ఎత్తిపోతలను ప్రతిపాదించామని సాగునీటి పారుదల శాఖ మంత్రి టి. హరీష్‌రావు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రమేష్ చెన్నమనేని అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎత్తిపోతల ద్వారా 20 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయడం జరుగుతుందన్నారు. కోనేటి చెరువులో భక్తులు సంవత్సరమంతా పుణ్యస్నానాలు చేయడానికి వీలుగా నీటి వసతి కల్పించబోతున్నామని వివరించారు.



రైతుల పట్ల నిర్లక్ష్యం: లక్ష్మణ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తోందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే లక్ష్మణ్ ఆరోపించారు. రుణమాఫీ సరిగ్గా చేయలేదని, రుణాలు కట్టకపోతే ఆస్తులను జప్తు చేస్తున్నారన్నారు. బ్యాంకులకు చెల్లించాల్సిన నిధులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. రైతులకు కేంద్రం మూడు శాతం ఇస్తుందని, దానికి రాష్ట్రం ఒక శాతం కడితే సరిపోయేదని దానిని సైతం చెల్లించలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో ప్రధానమంత్రి ఫసల్‌బీమా పరిహారం కూడా రావడం లేదన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తామంటే రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది రైతులు, బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో నిర్బంధకాండ అమలు జరుగుతోందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

పౌరహక్కులను ప్రభుత్వం కాలరాస్తుంది

పౌరహక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలిపడానికి అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం నిజాం పాలనను తలపిస్తోందన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమం హైదరాబాద్‌లో ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో తమ నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై త్వరలో ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పోలీసుల రాజ్యం చేసిందన్నారు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ప్రజలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

3వేల ఆలయాలకు ధూప దీప నైవేద్యం

● దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కొత్తగా 3 వేల ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకాన్ని వర్తింపచేయబోతున్నామని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఒడితెల సతీష్‌కుమార్, పుట్టా మధుకర్, రవీంద్రకుమార్, సుధీర్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. తెలంగాణలో దేవాదాయ భూములు 74,155 ఎకరాల వరకు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే 1805 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం కింద ఇచ్చే రూ. 2500లను రూ. 6000లకు పెంచామని వివరించారు. ఈ పథకం కింద ఏటా రూ.2.88 కోట్లు ఖర్చు కాలగలదన్నారు. అర్చకులకు పిఆర్‌సి అమలు చేస్తున్నామని వివరించారు. దేవాలయాలను పునరుద్దరించడానికి ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు.

గౌడ కులస్థులపై సీఎం వరాలు

● ఎంపీ బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గౌడ కులస్థులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సీఎం గౌడ కులస్థులకు వరాలు కురిపించ డంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీసీలపై ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన ఆరోపిం చారు.

బీసీలకు అన్యాయం జరుగుతోంది



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని, బీసీల కోసం ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించింది వాటిని కూడా ఖర్చు చేయలేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12 ఫెడరేషన్‌లకు ప్రభుత్వం తక్కువగా నిధులు కేటాయించిందని, వీటివల్ల పెద్దగా ప్రయో జనం లేదన్నారు. కులాల పట్ల వివక్ష చూపిస్తున్న సీఎం, బీసీలకు ఏమైనా దానం చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. 120 రెసిడెన్షియల్ కళాశాలలు, 60 రెసిడెన్షియల్ స్కూళ్లు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంటున్నా ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

మే నెలాఖరు నాటికి 8,438 టీచర్ పోస్టుల భర్తీ

● మూడేళ్లలో 577 గురుకులాల ఏర్పాటు ● డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ సొసైటీల కింద కొనసాగుతున్న గురుకులాల్లో మే నెలాఖరు నాటికి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. అన్ని గురుకులాల్లో కలిపి 8434 మంది ఉపాధ్యాయుల భర్తీ కోసం ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను నిర్వహించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. మే నెలాఖరు నాటికి పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. వివిధ సొసైటీల పరిధిలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ స్కూల్స్ పరిస్థితిపై శుక్రవారం శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ జరిగింది. శాసనమండలిలో జరిగిన చర్చలో ఎంఐఎం సభ్యులు జాఫ్రీతోపాటు అధికారపార్టీ సభ్యులు 9 మంది చర్చలో పాల్గొన్నారు. చర్చకు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సమాధానం ఇచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం వచ్చే వరకు రాష్ట్రంలో మొత్తం 298 గురుకులాలను ఏర్పాటు చేస్తే టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మూడేళ్లల్లో 577 గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే దక్కుతుందని కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల మేనిఫెస్టోలోనే కేజీ టు పీజీ ఉచిత విద్యను చేర్చామని, ఎన్నికల మేనిఫెస్టో కమిటీకి తానే చైర్మన్‌గా వ్యవహరించానని కడియం గుర్తు చేశారు. బిఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 125 గురుకులాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం కేసీఆర్‌ను కోరితే సీఎం ఏకంగా మూడేళ్లల్లో 577 గురుకులాలను ఏర్పాటు చేశారని అన్నారు. 33 గురుకులాలను కాలేజీలుగా స్థాయి పెంచామని సభలో తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 875 గురుకుల స్కూల్స్, కాలేజీల్లో కలిపి 2,60,137 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు సరిగా లేకపోవడం మూలంగానే గురుకులాలను ఏర్పాటు చేసినట్టు కడియం తెలిపారు. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ భావితరాలు అంబేద్కర్‌ను గుర్తు పెట్టుకుంటాయని చెప్పారు. కొత్త గురుకులాల్లో 240 స్కూల్స్‌కి స్థలాల కేటాయింపు జరిగిందని, టెండర్లు కూడా పిలిచినప్పటికీ కొన్ని కారణాలతో రద్దు చేశామని త్వరలోనే టెండర్లను పిలిచి ఏడాదిలోపు భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెండు క్రికెట్ అకాడమీలను బాలురలకు, మరో రెండింటిని బాలికల కోసం ఏర్పాటు చేస్తున్నామని కడియం తెలిపారు. మినీ గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్‌టిల వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విదేశాల్లోని విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి ఒక బృందాన్ని పంపిస్తామని సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను సెమిరెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చే ప్రక్రియను పరిశీలిస్తామన్నారు. వరంగల్ అర్బన్, కరీంనగర్ జిల్లాల్లో సైనిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నామని, వాటి ఏర్పాటు అనంతరం పరిశీలించి ఆసిఫాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం మూడు సొసైటీలకు స్టడీ సర్కిల్స్ పనిచేస్తున్నాయని, మొత్తంగా ఒకటే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం 5 సొసైటీల్లో రెసిడెన్షియల్ స్కూల్స్ పనిచేస్తున్నాయని, వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం 5 సొసైటీలు కూడా విద్యా శాఖ మార్గదర్శనంలో నడుస్తున్నాయని అన్నారు. అన్ని సొసైటీల్లోనూ ఒకేరకమైన మెనునూ అమలు చేస్తున్నట్టు కడియం శ్రీహరి తెలిపారు. ప్రతి విద్యార్థిపై ఏడాదికి రూ. లక్షకుపైగా ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. నల్గొండలో ప్రైవేటు వ్యక్తి కొనసాగిస్తున్న అంధ పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే అంశాన్ని పరిశీలిస్తామని సభలో కడియం శ్రీహరి తెలిపారు.

■ చీఫ్ విప్‌పై మండిపడ్డ పురాణం సతీష్

చర్చ సందర్భంగా అధికారపార్టీ సభ్యుడు పురాణం సతీష్ కుమార్ మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డిపై మండిపడ్డారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూల్స్‌పై చర్చ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతుండగా పాతూరి సుధాకర్‌రెడ్డి కలగజేసుకోవడం చీఫ్ విప్ సభ సజావుగా సాగడం కోసం ప్రయత్నం చేయాలి తప్ప సభ్యులు మాట్లాడుతుంటే అడ్డుపడటం సరికాదన్నారు. ప్రశ్నలు చీఫ్ విపే అడిగి, లఘుచర్చలో ఆయనే మాట్లాడి అన్ని తానే అన్నట్టుగా వ్యవహరిస్తూ సభ్యుల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

కీలక పద్దులు ఆమోదం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: శుక్రవారం శాసనసభలో వాణిజ్య పన్నులు, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయ తీరాజ్, ఆర్ అండ్ బీ, రవాణా, ఇరిగేషన్, విద్యుత్, ఆబ్కారీ శాఖ పద్దులపై చర్చ జరిగింది. పలువురు సభ్యులు ఆయా పద్దులపై సుదీర్ఘ సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం కడియం, మహమూద్‌అలీ, మంత్రులు, కేటీఆర్, హరీష్‌రావు, తుమ్మల, పద్మారావు, జూపల్లి, మహేందర్‌రెడ్డి. జగదీష్‌రెడ్డిలు సభ్యుల అనుమానాలను నివృత్తి చేసి, ప్రభుత్వ ప్రాధాన్యతలు, వ్యయాల వివరాలను వెల్లడించారు. మంత్రుల సమాధానంతో చర్చ ముగిసిన తర్వాత ఆయా పద్దులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ప్రకటించారు.

విద్యుత్ సబ్సిడీ రూ.4777 కోట్లు

● మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో విద్యుత్ సబ్సిడీల కింద ప్రభుత్వం ఏటా రూ.4777కోట్లు చెల్లిస్తోందని విద్యుత్ శాఖమంత్రి జగదీశ్వర్ రెడ్డి తెలిపా రు. హసన్ జాఫ్రీ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ ఉదయ్ పథకం కింద డిస్కంలకు 8923కోట్లు చెల్లించినట్లు తెలిపారు. దేశం లోనే తెలంగాణ డిస్కంలు ఆరోగ్యంగా ఉన్నాయ న్నారు. 2015-16లో విద్యుత్ చార్జీల టారీఫ్‌ను 5శాతం మాత్రమే రివిజన్ చేసినట్టు తెలిపారు. పాఠశాలకు ఉచి త విద్యుత్ ప్రతిపాదన లేదన్నారు.

కుటుంబమంతటికీ అభయ హస్తం

● మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నిరుపేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అభయ హస్తం పథకాన్ని రూ.270కోట్లతో విస్తరించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. శాసనమండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాతూరి సుధాకర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి ఫరీదుద్దీన్ తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ రాష్ట్రంలో అభయ హస్తం పథకం పరిధిలో 20.15లక్షల మంది ఉన్నట్టు తెలిపారు. ఈ పథకాన్ని మరింత విస్తరింపచేస్తున్నామన్నారు. ఇందులో 98.86 లక్షల మంది కవర్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్పస్ ఫండ్ లేకుండానే దీన్ని అమలు చేస్తామన్నారు. ఆసరా పరిధిలో 60-65ఏళ్ల మధ్యలో ఉన్నవారు, 65ఏళ్లు దాటిన వారు 95 వేల మంది మిగిలారని వీరు కూడా అభయహస్తం పరిధిలోకి వస్తారన్నారు. ఈ పథకం ద్వారా బహుముఖ ఉపయోగాలు కలగనున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

సంచార జాతులకు రేషన్ కార్డులు

● మంత్రి జోగు రామన్న




హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని సంచార జాతులకు పక్కా ఇల్లు మంజూరు చేస్తామని అందరికీ కోరుకున్న చోట రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి జోగు రామన్న తెలిపారు. రామచందర్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ సంచార జాతుల పిల్లలను బాగా చదివిస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలు వీరికి కూడా అమలు పరుస్తామని మంత్రి జోగు రామన్న వెల్లడించారు.

ఆర్టీసి సిబ్బందికి వైద్య పరీక్షలు: మంత్రి పట్నం

రాష్ట్రంలో ఆర్టీసి సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయిస్తున్నట్టు మంత్రి పట్నం మహేందర్ రెడ్డి వెల్లడించారు. జనార్ధన్ రెడ్డి, రవీందర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ ఆర్టీసీలో 52500మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. అందులో 20వేల మంది డ్రైవర్లకు గుండె పరీక్షలకు కూడా చేయిస్తున్నామన్నారు.

భూ రికార్డుల ప్రక్షాళన విజయవంతం


● ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూ రికార్డుల ప్రక్షాళన విజయవంతమైందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. ఇప్పటి వరకు 93 శాతం భూముల రికార్డులను ప్రక్షాళన పూర్తయిందన్నారు. పటిష్టమైన భద్రతా ప్రమాణాలతో పాస్‌బుక్‌ల ముద్రణ ఇప్పటికే ప్రారంభించామని, ఏప్రిల్ 20 నుండి పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయబోతున్నామని వెల్లడించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వి.శ్రీనివాస్ గౌడ్, కె. విద్యాసాగర్‌రావు, ఎస్. వెంకట వీరయ్య, దుర్గం చిన్నయ్య, కౌసర్ మొహినొద్దీన్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. వక్ఫ్, దేవాదాయ, అటవీ, అసైన్‌లాండ్‌లను పరిరక్షించడానికి భూ రికార్డుల ప్రక్షాళనలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని మహమూద్ అలీ వివరించారు. భూ రికార్డుల ప్రక్షాళనలో పాల్గొన్న 35,172 మంది రెవెన్యూ ఉద్యోగులకు ఒక నెల బేసిక్ వేతనాన్ని అదనంగా ఇవ్వడానికి రూ. 72 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనతో 72,12,111 మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారని ఉపముఖ్యమంత్రి తెలిపారు. మొత్తంగా 568 మండలాల పరిధిలోని 10,823 గ్రామాల భూ రికార్డులను ప్రక్షాళన చేశామని మహమూద్ అలీ వివరించారు. అన్ని జిల్లాల్లో భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి కావచ్చిందని, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో కూడా త్వరలోనే భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేయబోతున్నామని తెలిపారు. అసైన్డు భూములను పేదలు పేదలకే అమ్మితే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వక్ఫ్, దేవాదాయ, అటవీ భూములను కబ్జాల నుండి కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియచేశారు. సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

బైండోవర్ అయినవారికే పునరావాసం

● ఎక్సైజ్ శాఖమంత్రి టి.పద్మారావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గుడుంబాను పూర్తిగా నిర్మూలించి, ఇప్పటి వరకు 6,180 మంది గుడుంబా తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాది కల్పించామని ఎక్సైజ్ శాఖ మంత్రి టి. పద్మారావు తెలిపారు. బైండోవర్ ఆయిన వారికి మాత్రమే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. మంత్రి చేసిన ప్రకటనపైన స్పీకర్ మధుసూదనాచారితో పాటుగా పలువురు అధికార, ప్రతిపక్ష సభ్యులు విబేదించారు. 10 వేలకు పైగా గ్రామాల్లో గుడుంబా, సారా తయారీతో జీవనోపాధి పొందుతున్నవారు సుమారు 50 వేల మందికి పైగా ఉంటారని స్పీకర్ తెలిపారు. బైండోవరైనవారికి మాత్రమే పునరావాసం కల్పించాలని భావించిన పక్షంలో గుడుంబాను రూపుమాపలేమ న్నారు.

ప్రతి నియోజకవర్గంలో అంబులెన్సులు

● వైద్య ఆరోగ్యశాఖమంత్రి సి. లక్ష్మారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజక వర్గానికి రెండు చొప్పున ఇప్పటికే 2410 అమ్మ ఒడి అంబులెన్సులను ప్రారంభించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. లక్ష్మారెడ్డి తెలిపారు. మండలానికి ఒక అమ్మ ఒడి అంబులెన్స్ ఇవ్వడం సాధ్యం కాదని, 102 అంబులెన్స్ సేవలు అన్ని గ్రామాలకు అందుబాటులో ఉంచడానికి అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అజ్మీరారేఖ, బొడిగ శోభ, కోవాలక్ష్మి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 102కు ఫోన్ చేసిన వెంటనే అమ్మఒడి అంబులెన్సులు అవసరమైన వారి ఇంటి ముందుకు వచ్చే ఏర్పాటు చేశామన్నారు. ఇంటి నుండి ఆసుపత్రికి, అసుపత్రి నుండి తిరిగి ఇంటికి గర్భిణీ స్త్రీలను, ప్రసవం అనంతరం తల్లి బిడ్డలను ఉచితంగా చేర్చేందుకు ఈ అంబులెన్స్‌లను వినియోగించడం జరుగుతుందన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాసిటీ ఏర్పాటు

● 46 వేల ఎకరాల్లో 53 పారిశ్రామిక పార్కులు

● విజయవాడ హైవేలో డ్రైపోర్టు ● స్టార్టప్‌లకు రూ.698కోట్లు: కేటీఆర్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాసిటీని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కే.టి.రామారావు వెల్లడించారు. శుక్రవారం శాసనమండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో కర్నె ప్రభాకర్ రావు, ఎమ్మెస్ ప్రభాకర్ రావు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ బదులిస్తూ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ ఫార్మాసిటి ప్రపంచంలోనే అతిపెద్దదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో 46వేల ఎకరాల్లో 53 పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. వరంగల్‌లో మెగా జౌళి పార్క్, జహీరాబాద్‌లో జాతీయ పెట్టుబడి తయారీ జోన్ , సుల్తానాపూర్‌లో వైద్య పరికరాల పార్క్ ,మహేశ్వరంలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లు, బుగ్గపాడు వద్ద మెగా ఫుడ్ పార్క్ , దండు మల్కాపూర్‌లో ఎంఎస్ఎంఇ పారిశ్రామిక పార్క్ వంటి మెగా పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేల్పూరులో స్పైస్ పార్క్ , బండమైలారంలో విత్తన పార్క్ , మిర్యాలగూడెం, పెద్దపల్లి, కుందనపల్లి రామగుండంలో ఆటోనగర్‌లు ,తుమ్మలూరులో ప్లాస్టిక్ పార్క్ వంటి పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా పెద్ద ఎత్తున రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు.గత 14ఏళ్లలో ప్రభుత్వం నుంచి భూములు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేయని వారి నుంచి మొత్తం 1035 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. అంతే కాకుండా జెమ్స్ పరిశ్రమకు ఇచ్చిన 196 ఎకరాలు కూడా తిరిగి వెనక్కు తీసుకుంటున్నట్టు తెలిపారు.2005 తర్వాత రాష్ట్రానికి ఒక్క పరిశ్రమకూడా రాలేదన్నారు. హైదరబాద్ చుట్టు బహుముఖంగా ఐటి రంగం విస్తరింస్తోందన్నారు. ఇప్పటికే 35 వేల ఎకరాల భూసేకరణ పూర్తి చేశామన్నారు.రాష్ట్రంలో డ్రైపోర్టు ఏర్పాటుకు అనువైన ప్రాంతం కోసం దుబాయ్‌కి చెందిన సంస్థతో అధ్యయనం చేయించామన్నారు. విజయవాడ హైవే మార్గంలోనే ఈ పోర్టు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు .అయితే ఈ అంశంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ పరిశ్రమల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ ఉపాధి లభిస్తుందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్రంలో స్టార్ట్‌అప్ ఇండియా కార్యక్రమం కింద 778 బ్యాంకులనుంచి ఇప్పటివరకూ రూ.698కోట్ల రుణాలు మంజూరు చేయించినట్టు మరో ప్రశ్నకు మంత్రి కేటీఆర్ బదులిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామిక వేత్తలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 35 ఇంక్యుబేటర్లు , కో-వర్కింగ్ స్పేసులు ఉన్నాయ న్నారు. టీ-హబ్ , వి-హబ్‌లను ప్రభుత్వం నేరుగా ఏర్పాటు చేసిందన్నారు. మిగిలిన వాటిని విశ్వవిద్యా లయాలు, పరిశోధనాల సంస్థలు ,ప్రైవేటు కంపెనీలు ఏర్పాటు చేస్తున్నాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

పురపాలక సంస్థల స్వయం సమృద్ధికి కృషి

స్థానిక సంస్థలు, పురపాలక సంఘాలు స్వయం సమృద్ధి సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో భాగంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఆయన మాట్లాడారు. మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్రంలోని 43 పట్టణాలకు నేరుగా రూ.1000 కోట్లకుపైగా నిధులను అందించనున్నట్లు ఆయన చెప్పారు.

దక్షిణాది దండయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. దక్షిణాదికి రావాల్సిన రెవెన్యూ ఆదాయం ఉత్తరాది రాష్ట్రాలకు దారిమళ్లుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రానికి చేరుతున్న ఆదాయంలో సింహభాగం దక్షిణాది రాష్ట్రాలదే. 15వ ఆర్థిక సంఘం నిర్ణయం తో తీరని అన్యాయం జరగబోతోంది అని చంద్రబాబు ఎలుగెత్తారు. దీనిపై కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తెలంగాణ రాష్ట్రాలు స్పందించాయి. కేంద్ర పన్నుల్లో కర్నా టక వాటా 10 ఉంటే, తాము తిరిగి పొందు తున్నది ఐదు శాతం కూడా లేదని ముఖ్య మంత్రి సిద్ధ రామయ్య వ్యాఖ్యా నించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో తాను ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. ఫెడరలిజం స్ఫూర్తి కి విఘాతం కలిగిస్తున్నారం టూ కేరళ ఆర్థిక మంత్రి టీఎం థామస్ కేంద్రాన్ని తప్పుబట్టారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆర్థిక అసమాన తలు ప్రమాదస్థాయికి చేరుతున్నాయని అన్నారు. కుటుంబ నియంత్రణను కచ్చితంగా అమలు చేసినందుకు మాకు శిక్షవిధిస్తారా? పన్ను ఆదాయంలో తగ్గిస్తారా? అంటూ థామస్ కేంద్రాన్ని నిలదీశారు. దీనిపై వచ్చేనెల 10న దక్షిణాది రాష్ట్రాలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. మరోవైపు తమిళనాడులోని డీఎంకే నేత స్టాలిన్ ఈ వాదనకు మద్దతు పలికారు. కేంద్ర బాధ్యతలను విస్మరించి, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా ఎంత?

పన్నుల రూపంలో కేంద్రానికి చేరుతున్న సొమ్ము లో రాష్ట్రాల వాటాను నిర్ధా రించే బాధ్యతలను ఆర్థిక సంఘం నిర్వర్తిస్తుంది. కేంద్ర- రాష్ట్రాల మధ్య పంపిణీ నిష్పత్తిని ప్రతి ఐదేళ్లకోసారి ఆర్థిక సంఘం సమీక్షిస్తుంది. ప్రస్తుతం 58:42 నిష్పత్తిలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విభజింప బడుతోంది. కేంద్రం తన వాటా నిధులను జాతీయ సంక్షేమానికి, దేశ ప్రయోజనాలకు ఖర్చుచేస్తుంది. 27 నవంబర్ 2017న ఎన్‌కేసింగ్ చైర్మన్‌గా 15వ ఆర్థికసంఘాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2020- 25 మధ్య కాలానికి పన్నుల పంపిణీ నిష్పత్తికి సంబంధించి నివేదికను, 30 అక్టోబర్ 2019 నాటికి కేంద్రానికి సమర్పించాల్సి ఉంది. ఇందుకోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సదరు నోటిఫికేషన్‌లో ఆర్థికశాఖ పేర్కొంది. అయితే ఈ నిర్ణయాన్ని దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

వివాదం ఎందుకు?

జనాభా నియంత్రణ చర్యలను 1971నుంచే వేగవంతం చేసినందున, పన్నుల పంపిణీకి నాటి గణాంకాలనే ప్రామాణికంగా తీసుకోవడం సంప్రదాయంగా వస్తోంది. 1971-2011 మధ్య కాలంలో జనాభా నియంత్రణ చర్యల వల్ల ద.భారతంలో జనసంఖ్య గణనీయంగా తగ్గింది. ఉత్తర భారత దేశంలో కు.ని. ప్రభావం ఆశించిన ఫలితాలను చేరుకోలేదు. అందువల్ల గత నాలుగు దశాబ్దాల్లో అక్కడ జనాభా నియంత్రణలో పెద్దగా మార్పులు రాలేదన్నది దక్షిణాది రాష్ట్రాల వాదన. అందువల్ల 1971 నాటి జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ గణాంకాల ప్రకారమే లోక్‌సభ నియోజక వర్గాల విభజన జరిగిందని, 2026 వరకు కూడా ఈ సంప్రదాయాన్నే కొనసాగించాలని పట్టుబడుతున్నాయి. కాగా, 14వఆర్థిక సంఘం తొలిసారి 2011 గణాంకాలను ప్రాతిపదికగా తీసుకుంది. తద్వారా కేంద్ర రాబడుల్లో రాష్ట్రాలకు 10శాతం వెయిటేజీ ఇచ్చింది.

దక్షిణాది రాష్ట్రాలకు నష్టదాయకం

సంతాన వృద్ధిరేటును దేశవ్యాప్తంగా 2.1 స్థాయికి నియంత్రిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు 13వ ఆర్థిక సంఘం సంయుక్త కార్యదర్శి వి.భాస్కరన్ గతంలో వెల్లడించారు. ఈ క్రమంలో 18 రాష్ట్రాలు లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఇందులో దక్షిణాది రాష్ట్రాలు అన్నీ ఉన్నాయి. మిగతా రాష్ట్రాలు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించింది. లేనిపక్షంలో 18 రాష్ట్రాలు తమకు అన్యాయం జరిగిందని భావించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మహిళా అక్షరాస్యత శాతం తమిళనాడు , కేరళ రాష్ట్రాల్లో అధికంగా ఉండటం మూలంగా, కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు చేయగలిగారు. ఈ క్రమంలో 1971-2011 మధ్యకాలంలో ఈ రాష్ట్రాల్లో జనభావృద్ధి వరుసగా 56, 75 శాతంగా నమోదైంది. దేశం

బీహార్ రాష్ట్రం 30వేల కోట్లు కేంద్ర పన్నుల నుంచి ఆదాయం పొందుతుండగా, 20వేల కోట్లు చెల్లించే మహారాష్ట్ర ప్రభుత్వానికి దక్కేది కేవలం రూ. 4800 కోట్లు కావడం గమనార్హం. తమిళనాడు పౌరులు చెల్లించే ప్రతి 100 రూపాయల్లో వారికి తిరిగి లభిస్తున్నది రూ. 34 మాత్రమే. ఉత్తరాది విషయంలో ఇది విరుద్ధంగా ఉంటున్నది.

మొత్తంలో ఈ రెండు రాష్ట్రాలదే కనిష్ట స్థానం. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల 100శాతం మించింది. యూపీలో 138.02, జమ్ము-కాశ్మీ ర్‌లో 171.82 శాతంగా నమోదైంది. 14వ ఆర్థిక సంఘం 2011 గణాంకాలను పరిగణలోకి తీసుకున్నందన తమిళనాడు రూ. 6000 కోట్లు రెవెన్యూ ఆదాయాన్ని కోల్పోయింది. 15వ ఆర్థికసంఘం కూడా ఇదే బాటలో పయనిస్తే, ఈ రాష్ట్రానికి పన్ను రాబడుల్లో 70శాతం నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

వ్యవసాయ రుణమాఫీల మాటేమిటి?

50వేల కోట్ల లోటు బడ్జెట్‌ను ఎదుర్కొంటున్న ఉత్తరప్రదేశ్, గతేడాది రైతులకు రుణ మాఫీ ప్రకటించింది. ఇందుకు రూ. 36వేల కోట్లను కేటాయించింది. ఈ మొత్తాన్ని యూపీ సొంతంగా సమకూర్చుకోవడం సాధ్యమయ్యే పనికాదు. కేంద్ర ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వడం వల్లే సాధ్యమైంది. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్ను రాబడుల్లో సగభాగం కేవలం మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కర్నాటక నుంచే వస్తోంది. మహారాష్ట్ర ఏటా 33వేల కోట్లు, గుజరాత్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి రమారమి 20వేల కోట్ల రూపాయలు కేంద్ర ఖజానాకు చేరుతోంది. యూపీ నుంచి కేవలం 7000 కోట్లు మాత్రమే కేంద్రానికి చేరుతోంది. కొత్త పద్ధతి కొనసాగితే, ఉత్తర-దక్షిణాది రాష్ట్రాల మధ్య ఆర్థిక, సామాజిక అసమానతలు పెచ్చుమీరే ప్రమాదం ఉంది.

సోనియాకు స్వల్ప అస్వస్థత



షిమ్లా: యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆమె హుటాహుటిన షిమ్లానుంచి ఢిల్లీ పయనమ య్యారు. సోనియా గాంధీకి ఒంట్లో అస్వస్థత లక్షణాలు కనిపించడంతో అంబులెన్సు రావడం కంటే ముందే ఆమె తన సొంతకారులో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. షిమ్లాలోని చరబ్రాలో నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులు పర్యవేక్షించేందుకు సోనియా షిమ్లా వెళ్లారు. సోనియా గాంధీ (71) వెంట ఆమె కుమార్తె ప్రియాంక గాంధీ కూడా ఆమెతో ఉన్నారు. ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్ సీనియర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ చాంద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సోనియా గాంధీ వెంట ఉన్న వ్యక్తిగత వైద్యుడు తమకు ఫోన్‌చేసి సోనియా కోసం అంబులెన్స్ పంపించవలసిందిగా కోరారు అన్నారు. వెంటనే అంబులెన్సు, వైద్యబృందాన్ని పంపించామని కానీ అప్పటికే ఆమె తన సొంతకారులో బయలుదేరి తిరుగుబాట పట్టారని తెలిపారు. మధ్యమార్గంలో అంబులెన్సుతో కూడిన వైద్యబృందం ఆమెకు తోడయ్యారని తెలిపారు. ప్రయాణమార్గంలోని పంచకులలో ఆమె స్వల్ప విరామం తీసుకున్నారని డాక్టర్ చాంద్ తెలిపారు. సోనియా గాంధీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని డాక్టర్ రమేశ్ తెలిపారు.

లోక్‌పాల్ కోసం అన్నాహజారే దీక్ష



న్యూఢిల్లీ: సామాజిక కార్యకర్త అన్నా హజారే శుక్రవారం నుంచి మరోసారి నిరవధిక నిరాహార దీక్షకు పూ నుకున్నారు. స్వామినాథన్ కమిషన్ అందించిన నివేదిక ప్రకారం కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తను నియమించాలని అన్నాహజారే డిమాండ్ చేస్తూ నిరాహార దీక్షకు దిగారు. 2011లో సత్యాగ్రహం చేపట్టిన ఢిల్లీలోని రాంలీలా మైదానం నుంచే మరోసారి ఆయన ఆందోళనకు శ్రీకారం చుట్టారు. గతంలో యూపీఏ నేతృత్వంలోని మన్మోహన్ సర్కార్ హయాంలో దీక్ష చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అన్నా హజారే ఏడు సంవత్సరాలు అనంతరం మళ్లీ మోడీ నేతృత్వంలోని కేంద్రంపై ధ్వజమెత్తుతూ నిరాహార దీక్షకు దిగారు. రైతులు సమస్యలతో సతమతం అవుతుంటే వాటి పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని అన్నా ఆరోపించారు. తాను తుది శ్వాస విడిచేవరకూ ప్రజల కోసం పోరాడుతూనే ఉంటానని తెలిపారు. కాగా దీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో నిరసనకారులు ఢిల్లీ రాకుండా కేంద్రం రైళ్లను రద్దు చేసిందని ఆరోపించారు. ఢిల్లీకి రైళ్లలో తరలివస్తున్న నిరసనకారులను నిలిపివేస్తూ వారిని హింసకు పాల్పడేలా ప్రభుత్వం ప్రేరేపిస్తుందన్నారు. తనకు ఎటువంటి భద్రత అవసరం లేదని, తన దీక్షపై ప్రభుత్వం సరైనరీతిలో స్పందించటం లేదన్నారు. అవినీతి కేసుల విచారణకు లోక్‌పాల్ నియామకంపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నా రు. తొలుత అన్నా రాజ్‌ఘాట్‌ను సందర్శించి అనంతరం రాంలీలా మైదాన్ చేరుకుని దీక్షకు పూనుకున్నారు.

ఫ్రాన్స్‌లో ఐఎస్ ఉగ్రవాది ఉన్మాదం

- సూపర్ మార్కెట్ దిగ్బంధం
- కాల్పుల్లో ముగ్గురు దుర్మరణం
- ఉగ్రవాదిని మట్టుబెట్టిన భద్రత బలగాలు
- మూడు గంటల హైడ్రామాకు తెర



ట్రిబెస్, ఫ్రాన్స్: దక్షిణ ఫ్రాన్సులోని కార్‌కస్సొన్నె పట్టణం, దానికి సమీపంలోని ట్రెబెస్ ప్రాంతంలో శుక్రవారం ఒక దుండగుడు దారిలో పోయేవారిపై కాల్పులు జరపడంతో పాటు సూపర్ మార్కెట్‌ను దిగ్బంధం చేసిన ఘటనలో ముగ్గురు మరణించారు. అనంతరం భద్రతా బలగాలు హంతకుని మట్టుపెట్టాయి. దుండగుడు తమ వర్గీయుడేనని ఇస్లామిక్‌స్టేట్(ఐఎస్) జిహాదీ మూక ప్రకటించింది. పోలీసు వర్గాల కథనం ప్రకారం మొరాకో దేశస్థుడిగా భావిస్తున్న దుండగుడు మొదటగా కార్‌కస్సొన్నెలో ఒక కారును హైజాక్ చేశాడు. ప్రయాణికుని కాల్చి చంపాడు. డ్రైవర్‌ను గాయపరిచాడు. ఆ తర్వాత సహచరులతో కలిసి జాగింగ్ చేస్తున్న ఒక పోలీసుపై కాల్పులు జరిపాడు. అనంతరం ట్రెబెస్ పట్టణంలోని ఒక సూపర్‌యు సూపర్‌మార్కెట్‌కు కారు నడుపుకుంటూ వెళ్ళాడు. దాంట్లోకి చొరబడి మార్కెట్‌లో వారిని బందీలుగా చేసుకున్నాడు. దాదాపు మూడు గంటల సేపు ఉద్రిక్త వాతావరణం సృష్టించాడు. కనీసం ఇద్దర్ని కాల్చి చంపాడు. దాడికి పాల్పడిన వ్యక్తి వద్ద కత్తులు, ఒక తుపాకీ, గ్రెనేడ్‌లు ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అల్లాహో అక్బర్ అని నినదిస్తూ సూపర్‌మార్కెట్‌లోకి అడుగుపెట్టాడని చెప్పారు. ఒక వ్యక్తి నినాదాలు చేస్తూ పలు మార్లు కాల్పులు జరిపాడని సూపర్‌మార్కెట్‌కు వచ్చిన కొనుగోలుదారుల్లో ఒకరు ఫ్రాన్స్‌ఇన్ఫో రేడియో స్టేషన్‌కు తెలియపరిచారు. మొత్తం 10 మందిమి వెనుకవైపు అత్యవసర ద్వారం నుంచి వెలుపలకు వచ్చామని ఆమె వివరించారు. బందీలను వెలుపలకు వెళ్ళనిచ్చిన దుండగుడు ఇద్దరు పోలీసు అధికారులను బందీలుగా చేసుకొని సూపర్ మార్కెట్‌లో ఉండిపోయాడు. అప్పటిదాకా వెలుపల వేచి చూస్తున్న తీవ్రవాద నిరోధక బలగాలు మార్కెట్‌లోకి చొచ్చుకువెళ్ళాయి. దుండగుని మట్టుపెట్టాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. దక్షిణ ఫ్రాన్సులో కాల్పులు, బందీల వ్యవహారానికి తామే బాధ్యులమని ఐఎస్ జిహాదీ మూక ప్రకటించింది. ట్రెబెస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తి ఇస్లామిక్ స్టేట్ సైనికుడు. ఐఎస్ వ్యతిరేక అంతర్జాతీయ కూటమిలో దేశాలను లక్ష్యంగా చేసుకోవాలని ఇచ్చిన పిలుపునకు స్పందనగా అతడు దాడికి పాల్పడ్డాడు అని ఐఎస్ ప్రచార ఏజెన్సీ అమక్ ఏజెన్సీ సోషల్ మెస్సేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

జిగ్నేష్ షాపై సీబీఐ మరో కేసు

న్యూఢిల్లీ: మాజీ ఎంసీఎక్స్ ఎండీ జిగ్నేష్ షా, మరో నలుగురు మాజీ చైర్‌పర్సన్‌లపై తాజాగా కేసు నమోదు చేశామని సీబీఐ అధికారులు వెల్లడించారు. ముంబైలోని జిగ్నేష్‌షా కార్యాలయంతోసహా గ్వాలియర్, షిమ్లా తదితర తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు జరిపినట్టు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఆయనతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని సీబీఐ తెలిపింది. నిందితులు నిర్దేశించిన నిబంధనలు పూర్తి చేయకుండానే నేషనలిస్ట్ మల్టీ కామొడిటీ ఆఫ్ ఇండియా లిమి టెడ్ (ఎంసీఎక్స్) ఎక్స్ఛేంజ్ హోదా పొందేందుకు సహకరించారని సీబీఐ ఆరోపించింది. కాగా షా ఇప్పటికే వివిధ కేసులలో సీబీఐ విచారణ ఎదుర్కొంటున్నారు.

కార్తీ చిదంబరానికి బెయిల్



న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మాజీ కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. ఫిబ్రవరి 28న అరెస్టైన కార్తికి శుక్రవారం ఢిల్లీ హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేస్తూ పాస్‌పోర్టును తమకు సమర్పించాలని, విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. బెయిలు మంజూరు కోసం పదిలక్షల పూచీకత్తు సమర్పించాలని న్యాయస్థానం కోరింది. కాగా మార్చి 16న కార్తీ, సీబీఐ వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తాజాగా శుక్రవారం బెయిలు మంజూరు చేస్తున్నట్టు తెలిపింది. మందుగా ఈ కేసులో సాక్ష్యాధారాలును కార్తి తారుమారు చేశారని అందుకని ఆయనకు బెయిలు మంజూరు చేయరాదని సీబీఐ వాదించింది. కాగా సీబీఐ ఆరోపణలను కార్తీ లాయర్లు ఖండించారు. కస్టోడియన్ ఇంటరాగేషన్ సీబీఐ కోరనపుడు ఇంకెందుకు జ్యుడిషియల్ కస్టడీలో ఉంచారని ప్రశ్నించారు. కార్తీపై ఇప్పటివరకూ ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కింద కేసు నమోదు చేయలేదని వాదించారు. ఈ కేసులో ఇప్పటివరకూ ఇంకెవరినీ కూడా అరెస్టు చేయలేదన్నారు. కాగా ఐఎన్ఎక్స్ మీడియా కేసులో యూకే నుంచి వస్తున్న కార్తీని చెన్నై ఎయిర్‌పోర్టులో సీబీఐ అధికారులు అరెస్టు చేసిన సంగతి విదితమే. ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశాల నుంచి వచ్చిన 307కోట్ల నిధులు విదేశీ పెట్టుబడుల విషయంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో కార్తీకి 10లక్షలు ముడుపులు అందాయని తొలుత సీబీఐ ఆరోపించింది. అనంతరం ఆ మొత్తం 6.5 కోట్లుగా సీబీఐ పేర్కొంది.

ఫేస్‌బుక్‌తో ఈసీ అనుబంధం కొనసాగింపు

న్యూఢిల్లీ: ఎన్నికలను ప్రభావితం చేసే చట్టవ్యతిరేక కార్యకాలపాల నివారణకు సూచనలకోసం కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్(ఈసీ) సమన్వయం నెరుపుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒ.పి.రావత్ శుక్రవారం తెలిపారు. బ్రిటిష్ ఎన్నికల కన్సల్టెన్సీ కేంబ్రిడ్జి అనాలిటికా ఫేస్‌బుక్ ద్వారా అక్రమంగా యూజర్ల డేటా పొందిన వైనం వెలుగులోకి వచ్చిన తరుణంలో రావత్ వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈసీ భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడానికి రానున్న రోజుల్లో ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి ఒక వాస్తవిక నివేదికను సైతం కోరుతుందని ఆయన చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వానికి చట్టంలో మార్పులు చేయాలని సిఫార్సు చేయడం సహా పలు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్ల నమోదుపై యువతను ప్రోత్సహించడంలో ఫేస్‌బుక్‌తో ఈసీకి అనుబంధంపై మాట్లాడుతూ అది కేవలం ఫేస్‌బుక్ పేజీ వరకు మాత్రమే పరిమితమని ఆయన స్పష్టం చేశారు. అందులో తమకు ఎలాంటి తేడా కనిపించలేదని తెలిపారు. తద్వారా ఫేస్‌బుక్‌తో ఈసీ అనుబంధం కొనసాగుతుందని సూచించారు.

గుజరాత్‌లో జీఎస్టీ చట్టంపై కేంద్రానికి నోటీసులు

అహ్మదాబాద్: గుజరాత్ జీఎస్టి చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను పురస్కరించుకుని గుజరాత్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికీ,కేంద్రానికీ నోటీసులు జారీ చేసి గుజరాత్ జీఎస్టీచట్టం రాజ్యాంగం ప్రకారం చెల్లుబాటుకాదని పిటిషనర్ వాదించారు.దీనిపై జస్టిస్ అఖిల్ ఖురేషీ,బీఎన్ కర్లాలతో కూడిన డివిజన్ బెంచ్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడమే కాకుండా, కేంద్ర ఆర్థిక మంత్రి నేతృత్వంలోని జిఎస్‌టి కౌన్సిల్ నుంచికూడా సమాధానాల కోసం నోటీసు లు ఇచ్చింది. ఇన్‌పుట్ టాస్ క్రెడిట్ కోరే సంస్థలపై ఆంక్షలు విధించడం సమంజసం కాదని కోరారు.

డొల్ల కంపెనీలపై ఈడీ విశ్లేషణ


న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో దర్యాప్తులో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఈడి) అధికారులు 120 డొల్ల కంపెనీల వివరాలను , ఖాతాలను విశ్లేషిస్తున్నారు.

ప్రస్తుతం విదేశాల్లో ఉన్న మోడీపైనా, అతడి బంధువు,వ్యాపార సహచరుడుఅయిన మెహల్ చోక్సీపైనాసీబీఐ కేసులు నమోదు చేసింది. లోక్ సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా ఈ కేసు దర్యాప్తు సందర్భంగా అందిన సమాచారం మేర కు 120 డొల్ల కంపెనీల వివరాలు,ఖాతాలను విశ్లేషిస్తున్నట్టు చెప్పారు.మోడీ, చోక్సీల పై ఈడీ కూడా కేసులు నమోదు చేసిందని ఆయన చెప్పారు.ఫిబ్రవరి నెలాఖరు వరకూ మొత్తం 7,638 కోట్ల రూపాయిల మేరకు నిందితులకు చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

15లక్షల ఎన్‌సీసీ వాలంటీర్లకు చేరువకానున్న ప్రధాని

న్యూఢిల్లీ: రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎన్‌సిసి వాలంటీర్లతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరింత చేరువకానున్నాయి. 15 లక్షల మంది ఎన్‌సీసీ సభ్యుల వివరాలను ప్రధాన మంత్రి కార్యాలయం ఇప్పటికే సేకరిస్తోంది.ఇప్పటివరకు 80 శాతం ప్రక్రియ పూర్తియింది. ఫోన్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీల సేకరణ పూర్తయిన తర్వాత ప్రధాని వారందరితో టచ్‌లో ఉంటారు. ఎన్‌సిసికి మరింత చేరువకావాలన్న తన అభిమతం మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. గతనెలలో లెఫ్ట్ నెంట్ జనరల్ సహ్వావత్ ఇప్పటికే అన్ని రాష్ట్రాల డైరెక్టరేట్‌లకు లేఖలు రాశారు. అయితే ప్రధాని 15 లక్షల మందితో ఎలా కనెక్ట్ అవుతారనేదానిపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు తెలిపారు.నరేంద్ర మోడీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని వాలంటీర్లకు ఎలాంటి సూచనలు చేయలేదని పేర్కొన్నారు.

భద్రతా సలహాదారును మార్చేసిన ట్రంప్



వాషింగ్టన్ డీసీ: సంచలనాత్మక నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు హెచ్‌ఆర్ మెక్ మాస్టర్‌ను ఇంటికి సాగనంపారు. మెక్ మాస్టర్ స్థానంలో ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి జాన్ బోల్టన్‌ను నియమించారు. బోల్టన్ ఏప్రిల్ 9న పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఉత్తరకొరియా, ఇరాన్ దేశాలపై తీవ్ర విమర్శలు చేసి ట్రంప్ మెప్పు పొందిన బోల్టన్‌పై ట్రంప్ కు మంచి అభిప్రాయం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ట్రంప్ స్పందిస్తూ.. అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా సేవలందించిన మెక్ మాస్టర్‌గా కృతజ్ఞతలు తెలియజేశారు. మెక్ మాస్టర్ తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించడంలో శాయశక్తుల కృషి చేశారని కొనియాడారు.

తొలి సైన్ లాంగ్వేజ్ నిఘంటువు విడుదల

న్యూఢిల్లీ: భారతదేశంలో తొలిసారిగా బధిరులకు సేవలందించేందుకు తొలి సైన్ లాంగ్వేజ్ నిఘంటువును రూపొందించారు. ఆ నిఘంటువును ఈరోజు అధికారికంగా విడుదల చేయడం గమనార్హం. మూగ, చెవిటి వారు ఈ నిఘంటువు ద్వారా సైన్ లాంగ్వేజ్ (సైగలతో భావాలను వ్యక్తపరచడం) అర్థాలను తెలుసుకోవచ్చు. ఇండియన్ సైన్ లాంగ్వేజ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో తయారుచేసిన ఈ నిఘంటువులో 3000 హిందీ, ఇంగ్లీష్ పదాలు, వాటిని సైగలతో ఎలా అర్థమయ్యేలా చెప్పవచ్చో తెలిపే చిత్రాలు కూడా ఉన్నాయి. ఈ నిఘంటువును ప్రింట్ ఫార్మట్‌తో పాటు వీడియో ఫార్మట్‌లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఈ నిఘంటువు రూపకర్తలు తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి తావార్ చంద్ గెహ్లాట్ శుక్రవారం ఈ నిఘంటువును ఆవిష్కరించారు.

ఎయిర్ ఇండియా కొత్త రికార్డు

- భారత్- ఇజ్రాయెల్ మధ్య తగ్గిన దూరం

న్యూఢిల్లీ: భారత్ రాజధాని న్యూఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు ఎయిర్ ఇండియా విమాన సేవలు ప్రారంభమయ్యాయి. ఇది భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాల్లో నూతన అధ్యాయమనే చెప్పవచ్చు. మొట్టమొదటి విమానం గురువారం టెల్ అవీవ్ చేరుకుంది. అంతేకాకుండా సౌదీ అరేబియా గగనతలంపై ప్రయాణించడంపై దశాబ్దాల నుంచి అమలవుతున్న నిషేధం ఎత్తివేయడం మరో విశేషం. ఎయిరిండియా విమానం ఏఐ 139 ఇజ్రాయెల్ సమయం ప్రకారం 22.15 గంటలకు బెన్ గురియన్ విమానాశ్రయంలో దిగింది. ఆ దేశ పర్యాటక శాఖ మంత్రి యరివ్ లెవిన్ మాట్లాడుతూ ఇది చాలా చరిత్రాత్మక సమయమని పేర్కొన్నారు. మనం నవ శకంలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు అత్యధిక సంఖ్యలో భారతీయ పర్యాటకులు రావడం ఖాయమనే నమ్మకం తనకు ఉందన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్ పర్యాటకులు కూడా భారతదేశాన్ని సందర్శిస్తారన్నారు. ప్రత్యక్ష అనుసంధానం వల్ల ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని అభిప్రాయపడ్డారు.

అమెరికా బాటలో ఆస్ట్రేలియా

- 457 వీసాలు రద్దు

మెల్‌బోర్న్: హెచ్1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠిన వైఖరి ఆందోళన కలిగిస్తుండగా, తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వ నిర్ణయం భారత టెకీలకు భారీ షాక్‌నిచ్చింది. అమెరికా బాటలో పయనిస్తున్న ఆస్ట్రేలియాలో విదేశీ ఐటీ నిపుణులకు ఉద్దేశించిన 457 వీసాలను రద్దు చేసింది. దీని స్థానంలో ఓ కొత్త తాత్కాలిక నైపుణ్య కొరత (టెంపరరీ స్కిల్ షార్టేజ్) వీసాను తీసుకువచ్చింది. మార్చి 18 నుంచి ఈ కొత్త వీసా పద్ధతిని అమలుచేస్తోంది. ఈ నిర్ణయం భారతీయ ఐటీ నిపుణులను భారీగా దెబ్బతీయనుంది. 90 వేల మంది విదేశీ ఉద్యోగుల్లో అత్యధికులు భారతీయులే(22 శాతం) కావడం గమనార్హం. ఆస్ట్రేలియా తాజా నిర్ణయం అక్కడి భారతీయులకు తీవ్ర ఎదురుదెబ్బగా పరిణమించనున్నది.

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- అనర్హత నిర్ణయాన్ని పునస్సమీక్షించండి
- ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచన
- న్యాయస్థానం తీర్పుపట్ల కేజ్రీ వాల్ హర్షం



న్యూఢిల్లీ: రాజకీయంగా సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఊరట లభించింది. అనర్హత ఎదుర్కొంటున్న 20 మంది ఆప్ ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పు సాంత్వన ఇచ్చింది. లాభదాయక పదవుల్లో కొనసాగుతు న్నారన్న కారణంగా కేజ్రీ పార్టీకి చెందిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలంటూ జనవరిలో ఎన్నికల సంఘం చేసిన ప్రతిపాద నను రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆమోదించా రు. దీనిపై ఆ పార్టీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం ఎమ్మెల్యేలకు మద్దతుగా తీర్పు వెలువరించింది. ''ఈసీ నిర్ణయం సహేతుకం కాదు. ఇక్కడ సహజన్యాయ సూత్రాలను ఉల్లంఘించింది. అనర్హత నిర్ణయానికి ముందు, ఎమ్మెల్యేల వాదనలను పూర్తిగా వినలేదు. ఈ అంశాన్ని పునస్సమీక్షించండి'' అంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చంద్రశేఖర్‌తో కూడిన బెంచ్ ఈ మేరకు తీర్పు వెల్లడించింది. అనర్హత ఎమ్మెల్యేల స్థానంలో తిరిగి ఎన్నికలకు కేంద్రం ఇచ్చిన నోటీసులను కోర్టు కొట్టివేసింది. ఈసీ ప్రతిపాదనలు చట్ట సమ్మతం కాని, వైవిధ్య నిర్ణయంగా వ్యాఖ్యానించింది.

న్యాయస్థానం ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే 10మంది ఎమ్మెల్యేలు శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు. స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్ వారిని సభలోకి అనుమతించారు. ఈ క్రమంలో సహచర ఆప్ ఎమ్మెల్యేలు భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. హైకోర్టు తీర్పును ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్వాగతించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల పై అక్రమంగా వేటువేశారని, ఢిల్లీ ప్రజలకు కోర్టు ద్వారా న్యాయం చేకూరిందని హర్షం వ్యక్తంచేశారు. ఇది సత్యం గెలుపు. ఢిల్లీ పౌరులకు అభినందనలు అంటూ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ఎన్నికైన ప్రభుత్వంపై తీవ్ర చర్యగా ఈసీ నిర్ణయాన్ని అభివర్ణించారు. ఇదిలా వుండ గా హైకోర్టు తీర్పుపై కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని నిర్ణయించింది. న్యాయస్థానం అనర్హతను రద్దుచేయలేదు.. కాకుంటే పునస్సమీక్షకు ఆదేశించింది అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్ చెప్పారు. పార్లమెంటరీ కార్యదర్శులుగా వ్యవహరించిన ఈ ఎమ్మెల్యేలకు ప్రభుత్వం కార్యాలయాలు, ఫర్నీచర్, రవాణా సౌకర్యాల పేరిట భారీగా ఖర్చు చేసిందని ఆయన ఆరోపించారు.

బీజేపీ.. అబద్ధాల ఫ్యాక్టరీ

- కమల దళంపై కాంగ్రెస్ ఎదురుదాడి
- కేంబ్రిడ్జ్ అనలిటికాతో బీజేపీది రహస్య ఒప్పందమని ఆరోపణ
- ప్రజల దృష్టి మరల్చేందుకు కొత్త నాటకమని మండిపాటు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నకిలీ వార్తలను సృష్టించడంలో బీజేపీ ఆరితేరిందని ఆరోపించారు. బీజేపీని అవాస్తవాలను మలిచే అబద్ధాల ఫ్యాక్టరీగా అభివర్ణించినరాహుల్ గాంధీ... బీజేపీ తమ పార్టీకి వెన్నుపోటు పొడుస్తోందని..ఇందుకోసం కేంబ్రిడ్జ్ అనాలిటికాను వేదికగా మార్చుకుందని మండిపడ్డారు. ట్విట్టర్ వేదికగా బీజేపీపై విమర్శలు సంధిస్తూ.. బీజేపీ అబద్ధాల కంపెనీ పనిలో మునిగిపోయింది. కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచేలా.. 2012 లో కేంబ్రిడ్జ్ అనాలిటికా ఎలా చొరబాట్లు జరిపేందుకు చెల్లింపులు ఎలా జరిగాయి అనే కథనం సిద్ధమౌతుండగా..బీజేపీ కేంబ్రిడ్జి అనాలిటికాతో కలిసిపనిచేసింది.. బీజేపీ నేతలు కేంద్ర మంత్రి వద్దకు వెళ్లి నకిలీవార్తలు మీడియాలో చక్కర్లు కొట్టించేలా చేశారు. అని విమర్శలు గుప్పించారు. కేంబ్రిడ్జ్ అనాలిటికా సంస్థ (సీఏ)ను ఉపయోగించుకుని నకిలీ వార్తలను సృష్టిస్తున్నారని.. బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటునే ఉన్నాయి. 2014 సాధారణ ఎన్నికల్లో..ఉప ఎన్నికల్లోనూ ఇరు పార్టీలు సీఏను ఉపయోగించుకుని లబ్ది పొందాయని పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. 39 మంది భారతీయులు ఇరాక్ లో ఐసిస్ చెరలో చిక్కుకుని హతమైన వార్త నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ ప్రభుత్వం సీఏ నాటకానికి తెరతీసిందని రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే.

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్‌కు కాంగ్రెస్ డిమాండ్

ఎస్సీ,ఎస్టీల అకృత్యాల చట్టం కింద కేసు నమోదైతే వెంటనే అరెస్టులు చేయకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును పునఃస మీక్షించాలం టూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నేతృ త్వం లో పార్లమెంట్ లోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళ నకు దిగింది. సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షిం చేలా కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయ స్థానం పిటిషన్ దాఖలు చేయాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. సుప్రీం తీర్పుపై ప్రభు త్వం సరైన రీతిలో స్పందించడం లేదని..వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని నినాదాలు చేశారు.ఎస్సీ, ఎస్టీల అకృత్యాల నిరోధక చట్టంలోనూ సవరణ చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జునఖర్గే డిమాండ్ చేశారు.దళితుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు... ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాలు ఆపాలంటూ నినదించారు. అంతకు ముందు పార్లమెం ట్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో భేటీ అయిన ఎంపీలు.. ఈ అంశంపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.



కేంబ్రిడ్జ్ అనలిటికాపై దర్యాప్తు

ఫేస్ బుక్ యూజర్స్ డేటాను కేంబ్రిడ్జ్ అనాలిటికా(సీఏ) దుర్వినియోగం చేస్తోందని వస్తున్న వార్తలపై లాటిన్ అమెరికన్లు స్పందించారు. సీఏపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపనున్నట్లు బ్రెజిల్ న్యాయవాదులు ప్రకటించారు. సీఏ ఫేక్ ఫేస్ బుక్ అకౌంట్లను వాడిందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. అమెరికాకు చెందిన 50 మిలియన్ల మంది ఫేస్ బుక్ యూజర్ల సమాచారం దుర్వినియోగం అయిందని.. ఓటర్ల వ్యక్తిగత ప్రొఫైల్ రూపొందించా రన్న ఆరోపణలపై విచారణ జరపనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక కన్సల్టెన్సీ సంస్థలు కూడా కేంబ్రిడ్జ్ అనలిటికాతో కలిసి పనిచేశాయా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తామని ప్రకటించారు.



ఆరో రోజూ అదే తీరు

చర్చకు రాని అవిశ్వాస తీర్మానం... రంగంలోకి కాంగ్రెస్

- లోక్‌సభలో కొనసాగిన టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీల ఆందోళన
- అధికార పక్షం చర్చకు సిద్ధంగా ఉందన్న స్పీకర్
- సభ సజావుగా లేదని అవిశ్వాసం చేపట్టని స్పీకర్
- 27న అవిశ్వాసానికి నోటీసు ఇచ్చిన కాంగ్రెస్
- ఎంపీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలి: రాజ్యసభ చైర్మన్ వెంకయ్య

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆరోసారి అవిశ్వాస తీర్మానం స్తంభించిపోయింది. మూడో వారం పార్లమెంటు సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. లోక్‌సభ వెల్‌లో అన్నాడిఎంకె, టిఆర్ఎస్ ఎంపీల ఆందోళనతో అవిశ్వాసం తీర్మానం ముందుకు కదల్లేదు. శుక్రవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో 30 సెకన్లలోనే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే టిఆర్ఎస్, అన్నాడిఎంకె టిఆర్ ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనలు ప్రారంభించారు. నినాదాల మధ్యే స్పీకర్ సుమిత్రా మహాజన్ ఏడోవేతన సంఘం సిఫారసుల నేపథ్యంలో పార్లమెంటు ఉద్యోగులకు జీతభత్యాల నిర్ణయంపై కమిటీ ఏర్పాటును ప్రకటించారు. అనంతరం అవిశ్వాస తీర్మానాలకు సంబంధించిన నోటీసులను లోక్‌సభలో చదివి వినిపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. అధికార పక్షం కూడా చర్చకు సిద్ధంగా ఉందని, అందరూ దీనికి అంగీకరిస్తే నోటీస్‌ను చేపడతామని చెప్పారు. వెల్‌లో ఆందోళన చేస్తున్న ఎంపీలంతా తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని కోరారు. సభ సజావుగా ఉండేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా లేదా అనే దానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలు తమ తమ స్థానాల్లో నిలబడితే లెక్కించాల్సి ఉందన్నారు. అయితే స్పీకర్ విజ్ఞప్తిని పట్టించుకోకుండా టిఆర్ఎస్, అన్నాడిఎంకె పార్టీ ఎంపీలు వెల్‌లో ఆందోళన కొనసాగించారు. కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని నినాదాలుచేశారు. దాంతో సభ కార్యక్రమాలు సజావుగా నడిచే పరిస్థితి లేనందున అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అవిశ్వాసానికి నోటీసిచ్చిన కాంగ్రెస్

టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల అవిశ్వాస తీర్మానాలకు తోడుగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ కూడా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చింది. కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత మల్లికార్జున ఖర్గే ఈ మేరకు సెక్రటరీ జనరల్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. 27వ తేదీన అవిశ్వాసం చేపట్టాలని లేఖలో కోరారు.

వెంకయ్య అసహనం

ఇటు రాజ్యసభలోనూ వాయిదాల పర్వం కొనసాగింది. విపక్షాల ఆందోళనతో సభా కార్యక్రమాలు ముందుకు సాగలేదు. సభ జరుగుతున్న తీరుపై చైర్మన్ వెంకయ్య నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దల సభలో మూడు వారాలు సభా కార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోవడంపై ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

సభలో ప్రతిష్టంభన తొలగించేందుకు తాను అన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదన్నారు. కనీసం వచ్చే వారమైనా బిల్లులు పాసయ్యేలా సహకరించాలని కోరారు. అయితే అదే సమయంలో విపక్షాల సభ్యులు, సభ సజావుగా నడపాల్సిన బాధ్యత అధికారపక్షానిదే అని నినాదాలు చేశారు. టీడీపీ, అన్నాడిఎంకె ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేయగా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు అంశంపై కాంగ్కెస్ సహా విపక్షాలు వెల్‌లోకి వెళ్లి నిరసన కొనసాగించాయి. ఆందోళనలు కొనసాగడంతో సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు.

గిరిజనులతో కేంద్రం చెలగాటం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: గిరిజనుల జీవితాలతో ఆడుకోవడం కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదని తెరాస ఎంపీ సీతారాం నాయక్ హితవు పలికారు. పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం విజయ్ చౌక్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఖ్యా బలముందనే అహంకారంతో ప్రవర్తించడం సరికాదని సీతారాం నాయక్ మండిపడ్డారు. ప్రధాని మోడీని కలిసేందుకు అనుమతి లభించడం లేదని ఆయన తెలిపారు. స్పీకర్, అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్‌లను ఈ విషయంపై విజ్ఞప్తి చేశామనీ అన్నారు. హామీ ఇస్తే చాలు నిరసన ఆపేస్తామని చెప్పినా కేంద్రం నుంచి స్పందన లేదని సీతారాం ఆరోపించారు. స్పష్టమైన హామీ రాకుండా మధ్యలో ఆందోళన విరమించే ప్రసక్తే లేదని ఆయన వెల్లడించారు. సెలవులు పూర్తయ్యాక మంగళవారం నుంచి మళ్లీ తమ నిరసనను కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఆంధ్ర- తెలంగాణా వేర్వేరు కాదు. ఆంధ్ర ప్రజల మనసులో విష బీజాలను నాటకండని కేంద్రానికి సూచించారు. ఎవరికైనా న్యాయం జరగాలంటే కలిసి పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని సీతారాం నాయక్ వివరించారు.

మా అవిశ్వాసంతో బీజేపీ తప్పించుకోలేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 27న కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు లోక్‌సభలో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ మల్లిఖార్జున్ ఖర్గే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులను శుక్రవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు అందజేశారని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ, ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్రం నెరవేర్చాల్సిందేనన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాను కల్పించే విషయంలో మోదీ సర్కార్ వివక్ష చూపిస్తోందని ఆయన మండిపడ్డారు. ఏపీకు న్యాయం చేసే విషయంలో కేంద్రం ఆడుతున్న నాటకాలను ఏపీ ప్రజలు ఎప్పటికప్పుడు గ్రహిస్తున్నారని హెచ్చరించారు.

అవిశ్వాసానికి మేము 'సై'తం

- కాంగ్రెస్ పార్టీ అస్త్ర ప్రయోగం
- నోటీసిచ్చిన మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా పోరాటం రోజురోజుకీ కొత్త రూపు సంతరించుకుంటోంది. హోదాయే ప్రధాన డిమాండ్‌గా అవిశ్వాస తీర్మానం అస్త్రాన్ని ప్రయోగిస్తున్న తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు కాంగ్రెస్ పార్టీ జతకలిసింది. హోదా పోరులో మొదటి నుంచి ఆ పార్టీ రాష్ట్ర నేతలు కదం తొక్కుతున్నారు. అడపాదడపా ఆ పార్టీ జాతీయస్థాయి నాయకత్వం సైతం స్వరం కలుపుతూ వస్తోంది. రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీ డా. కేవీపీ రామచంద్రరావు ఒంటరిపోరు మినహా దీనిపై లోక్‌సభలో మాత్రం నేరుగా ఎప్పుడూ రంగంలోకి దిగలేదు. కానీ ఇప్పుడు అవిశ్వాస తీర్మానం నోటీసుతో కాంగ్రెస్ పార్టీ నేరుగా కదనరంగంలోకి అడుగుపెట్టింది. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలత శ్రీవాస్తవకు నోటీసులు అందజేశారు. అంతకంటే ముందు పార్టీ నేతలు పార్లమెంటులో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి జేడీ శీలం మీడియాకు వెల్లడించారు. ప్రత్యేక హోదా సహా ఇతర జాతీయాంశాలపై కేంద్ర ప్రభుత్వ తీరుతో విభేదిస్తున్నందునే ఈ అస్త్రాన్ని తాము సైతం ప్రయోగిస్తున్నామని ఆయన తెలిపారు. నిజానికి ఏ సందర్భంలో అవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నామన్నది నోటీసులో పేర్కొనాల్సిన అవసరం లేదని, కానీ తమ అవిశ్వాసానికి కారణాల్లో ప్రత్యేక హోదా కూడా ఉందని శీలం చెప్పారు.



ప్లీనరీ తీర్మానంతో పెరిగిన జోరు

గతవారం కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని తమ రాజకీయ తీర్మానంలో చేర్చింది. హోదాతో పాటు విభజన హామీలను అమలు చేస్తామని పేర్కొంది. ఇంతకాలం పాటు ప్రత్యేక హోదా అంశాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నేతలు మినహాయిస్తే మిగతావారు పెద్దగా పట్టించుకోలేదు. ఒక దశలో నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ హోదాను అమలు చేయాలంటూ కేంద్రానికి లేఖ రాసినప్పటికీ, అదే సమయంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత వీరప్ప మొయిలీ ఏపీకి ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తూ సభలోనే మాట్లాడారు. అంతేకాదు ఆంధ్రప్రదేశ్‌కు హోదా ఇస్తే తమ రాష్ట్రం నుంచి పరిశ్రమలన్నీ తరలిపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడింది. ఆ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలుగు రాష్ట్రాల నేతలు విమర్శలు చేశారు. నిజానికి ఏపీకి హోదా ఇవ్వాలని ఆ పార్టీ జాతీయస్థాయిలో గట్టిగా మాట్లాడితే మిగతా రాష్ట్రాలు సైతం తమకూ ఇవ్వాలని పట్టుబడతాయని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం భావించింది. అందుకే నేరుగా ఎప్పుడూ ఈ విషయంపై రంగంలోకి దిగకుండా, పోరాడుతున్నవారికి తమ మద్దతును ప్రకటిస్తూ, తాము సైతం పోరాడుతున్నామని చెప్పుకుంది. అయితే తాజాగా గతవారం ప్లీనరీలో ఈ అంశాన్ని రాజకీయ తీర్మానంలో చేర్చడంతో ఆ పార్టీ జాతీయస్థాయిలో ఆమోదముద్ర వేసినట్టయింది. అప్పటికే వైకాపా, తెలుగుదేశం పార్టీలు ఒకసారి అవిశ్వాస తీర్మానం నోటీసులిచ్చాయి. ఆ నోటీసులను సభ స్వీకరించడానికి అవసరమైన సంఖ్యాబలం తామిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చింది. అందుకు తగ్గట్టే ప్రతిరోజూ ఆ పార్టీ ఎంపీలు లేచి నిలబడి మద్దతు పలికారు. కానీ స్పీకర్ మాత్రం సభ గందరగోళంగా ఉందంటూ వాయిదాలపర్వాన్ని కొనసాగించడంతో, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేరుగా రంగంలోకి దిగి అవిశ్వాసాన్ని ప్రకటించింది. సభలో కాంగ్రెస్ ఎంపీలకు తోడుగా మరొక ఇద్దరు లేచి నిలబడితే చాలు, ఈ తీర్మానాన్ని స్వీకరించడానికి తగిన సంఖ్యాబలం సాధించినట్టవుతుంది. తెలుగుదేశం, వైకాపాలు ఇప్పటికే ఈ ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నందున, అందుకు తగ్గ సంఖ్యాబలం ఉన్నట్టే. అయినా సరే జాతీయపార్టీగా, యూపీఏ కూటమి సారథిగా తాము మిగతా పార్టీల సహాయం కూడా కోరతామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

అసెంబ్లీ సభ్యత్వాల రద్దుపై లోక్‌సభలో ప్రస్తావిస్తా

కోమటిరెడ్డి, సంపత్‌లకు ఖర్గే హామీ

మరోవైపు తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లకు ఎదురైన పరాభవం గురించి కూడా లోక్‌సభలో ప్రస్తావించేందుకు మల్లికార్జున ఖర్గే సిద్ధపడ్డారు. శుక్రవారం సభ వాయిదాపడ్డ తర్వాత పార్లమెంటర్ సెంట్రల్ హాల్‌లో ఖర్గేను సంపత్‌తో పాటు కోమటిరెడ్డి సోదరులిద్దరూ కలిశారు. తెలంగాణ అసెంబ్లీలో జరిగిన వ్యవహారం పూర్తిగా ఆయనకు వివరించారు. చట్టాలను రూపొందించే సభలోనే చట్ట విరుద్ధంగా తమను బహిష్కరించారని ఖర్గేకు చెప్పారు. మార్చి 12న సభలో జరిగిన వ్యవహారానికి సంబంధించి వీడియో క్లిప్పులు, పేపర్ కటింగ్‌లను ఆయనకు అందజేశారు. ఉద్దేశపూర్వకంగానే తమపై కక్షసాధింపు కోసం ఈ చర్యలు తీసుకున్నారని వివరించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ తీరు లోక్‌సభ సాక్షిగా ఎండగడతానని ఖర్గే హామీ ఇచ్చారు.

ఈ-నామ్ మరింత పటిష్టం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: డిమాండ్ ఉన్న మార్కెట్లో ఆన్‌లైన్ ద్వారా తమ పంటను అమ్ముకునే అవకాశం కల్పిస్తున్న ఈ-నామ్‌ను మరింత పటిష్టపరచేందుకు ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శుక్రవారం రాజ్యసభలో వెల్లడించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ-నామ్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేస్తే, అనేక మంది రైతులు, వ్యాపారులు ఈ వ్యవస్థతో అనుసంధానం కావడానికి ముందుకొస్తారని చెప్పారు. ఈ-నామ్ ప్లాట్‌ఫామ్ మీద దాదాపు 90 రకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అనుమతించినట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ-నామ్ పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని 8 జిల్లాల్లో 22 మండీలు, తెలంగాణలోని 21 జిల్లాలలో 46 వ్యవసాయ మార్కెట్లు ఈ-నామ్ వ్యవస్థతో అనుసంధానం చేసినట్టు కేంద్ర మంత్రి వివరించారు.

రైతు ఆదాయం 6 వేలే

దేశంలో ఒక రైతు కుటుంబం అన్ని వనరుల నుంచి పొందే ఆదాయం సగటున నెలకు కేవలం రూ. 6,426 మాత్రమేనని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. దేశంలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాల వార్షిక ఆదాయ గణాంకాలను జాతీయ శాంపిల్ సర్వే ఆధ్వర్యంలో 2013 జనవరి నుంచి డిసెంబర్ వరకు సేకరించినట్లు తెలిపారు. ఆ సర్వే వివరాల ప్రకారం దేశంలో ఒక రైతు కుటుంబం అన్ని వనరుల నుంచి పొందే నెలసరి ఆదాయం సగటున రూ. 6,426 గా అంచనా వేసినట్లు చెప్పారు.

'కలిసుందాం రా' ఓ కట్టుకథ



- అలాంటి సంకేతాలు లేవు
- స్పష్టం చేసిన సుజనా చౌదరి
- వరుసగా 10వ రోజు కొనసాగిన టీడీపీ ఎంపీల ధర్నా
- పోలవరంపై రైతు వేషంలో ఎంపీ శివప్రసాద్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బీజేపీతో మళ్లీ సయోధ్య కోసం ప్రయత్నిస్తున్నారంటూ వస్తున్న వార్తల్ని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్. చౌదరి (సుజనా) కొట్టిపడేశారు. తాము అటువంటి ప్రయత్నమేదీ చేయడం లేదని స్పష్టం చేశారు. ఆ అవసరం ప్రస్తుతం తమకు లేదని, అలాగే భారతీయ జనతా పార్టీ వైపు నుంచి కూడా ఎలాంటి ఆహ్వానం లేదన్నారు. శుక్రవారం ఉభయ సభలు వాయిదాపడ్డ అనంతరం పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీతో కలిసి సయోధ్య కోసం మంతనాలు సాగిస్తున్నట్టు వచ్చిన వార్తలపై విలేకరులు ప్రశ్నించగా ఆయన ఈ విధంగా జవాబిచ్చారు. రాజ్యసభలో ఎదురుపడ్డప్పుడు మర్యాదపూర్వకంగా పలకరించడం మినహా జైట్లీతో ఎటువంటి ప్రత్యేక భేటీ జరగలేదని వివరణ ఇచ్చారు. 'కలిసుందాం రా' అంటూ వస్తున్న కథనాలు, ఆ కథనాలపై వైకాపా ఎంపీలు చేస్తున్న వ్యాఖ్యలపై కూడా సుజనా స్పందించారు. అవన్నీ వైకాపా నేతల మైండ్ గేమ్‌లో భాగమని ఎదురుదాడి చేశారు. వారి ట్రాప్‌లో తాము పడబోమని ఆయన వ్యాఖ్యానించారు. అంతకంటే ముందు ఉదయం యధావిధిగా టీడీపీ ఎంపీలంతా కలిసి పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలన్న డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో నిరసన తెలిపారు.

రైతు కంట కన్నీరు

గురువారం పారిశుద్ధ్య కార్మికుడి వేషధారణతో వచ్చిన చిత్తూరు ఎంపీ ఎన్. శివప్రసాద్, శుక్రవారం రైతు వేషధారణతో వచ్చారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అన్నదాతలైన తెలుగు రైతులకు పోలవరం ప్రాజెక్టు 75 ఏళ్ల కల అన్నారు. 5 కోట్ల ఆంధ్రుల దాహార్తిని తీర్చడంతో పాటు, 23 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే గొప్ప ప్రాజెక్టు పోలవరం విషయంలో కేంద్ర ప్రభుత్వం కొర్రీలు పెడుతూ అడ్డుకుంటోందని విమర్శించారు. 'నిన్నగాక మొన్న పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన సొమ్ములో రూ. 400 కోట్లు కోత విధించారు. ఇది తగదు. రైతు కన్నీరు కింద పడొద్దు. అలా జరిగితే ప్రకృతి ప్రకోపిస్తుంది. రైతులతో పెట్టుకున్నవాళ్లెవరూ బాగుపడలేదు' అంటూ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి శాపనార్థాలు పెట్టారు.



క్షేత్రస్థాయిలో పర్యటిద్దాం

- ప్రతిపక్షాలను ఎండగడదాం
- సభను అడ్డుకుంటున్నవారి బండారం బయటపెడదాం
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో దిశానిర్దేశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను అడ్డుకుంటున్న రాజకీయ పార్టీల భరతం పట్టాలని బీజేపీ పార్లమెంటరీ పార్టీ నిర్ణయించింది. గత సాంప్రదాయాలకు భిన్నంగా శుక్రవారం సాయంత్రం పార్టీ నూతన కార్యాలయంలో పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ప్రధానంగా పార్లమెంటు సమావేశాలను అడ్డుకుంటున్న రాజకీయ పార్టీల తీరుపైనే చర్చ జరిగింది. బీజేపీని దోషులుగా చిత్రీకరిస్తూ ఆ పార్టీలు ఆడుతున్న నాటకాన్ని బయటపెట్టాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించాలని అధినాయకత్వం పార్టీ ఎంపీలకు సూచించింది. సభ్యులంతా తమ తమ నియోజకవర్గాల్లో ఆయా రాజకీయ పార్టీల తీరును ఎండగడుతూ విస్తృతంగా ప్రచారం చేయాలని అమిత్ షా సూచించారు. పార్లమెంటు సమావేశాలను ఎవరెవరు అడ్డుకుంటున్నారన్న విషయంపై ఆయన ఎంపీలకు స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు నిరాశ, నిస్పృహల్లో ఉన్నాయని వ్యాఖ్యానించారు. అందుకే బీజేపీని లక్ష్యంగా చేసుకుని పార్లమెంటు వేదికగా నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. దీనికి ధీటుగా ప్రజాక్షేత్రంలోనే జవాబివ్వాలని ఎంపీలను ఆయన ఉత్సాహపరిచారు.

తెలుగు పార్టీల తీరుపై గుర్రు

పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నేరుగా తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రస్తావన రానప్పటికీ, పరోక్షంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సమావేశాలను అడ్డుకుంటున్న పార్టీల్లో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి, అన్నాడీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలే ముందు వరుసలో ఉన్నాయి. వీరికి తోడుగా కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, కమ్యూనిస్టులు కూడా కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. గత 6 పనిదినాలు పూర్తిగా అవిశ్వాస తీర్మానం నోటీసుల కారణంగానే లోక్‌సభ వాయిదాపడ్డ విషయంపైనా పార్లమెంటరీ పార్టీ చర్చించింది. పైగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అవిశ్వాస తీర్మానానికి నోటీసులివ్వడంతో బీజేపీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ప్రత్యేక హోదా సహా విభజన హామీలు అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేస్తున్న పోరాటమే మిగతా అన్ని పార్టీలను అవిశ్వాసం విషయంలో ఏకం చేస్తోందని అధినేతలు భావించారు. నిన్నమొన్నటి వరకు మిత్రపక్షంగా ఉండి, ఒక్కసారిగా తమను దోషిగా బోనులో నిలబెట్టిన తెలుగుదేశం పార్టీ తీరుపై అధినేతలు ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. నేరుగా ఎంపీల ముందు ఈ విషయాన్ని ప్రస్తావించకపోయినా, పరోక్షంగా తెలుగుదేశం తీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అందుకే ఆ పార్టీ చేస్తున్నదంతా ఒక డ్రామా అని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియాను కూడా మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుని దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. శని, ఆదివారాలకు తోడు సోమవారం కూడా శ్రీరామనవమి కారణంగా పార్లమెంటుకు సెలవు ప్రకటించడంతో ఎంపీలకు వరుసగా 3 రోజులు విరామం దొరికింది. ఈ సమయాన్ని క్షేత్రస్థాయి పర్యటన కోసం వినియోగించాలని అమిత్ షా సూచించారు.



ఢిల్లీ: తెలంగాణ భవన్‌లో రిసెప్షన్ కౌంటర్‌ను ప్రారంభించిన రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్

అవినీతిపై చర్చకు సిద్ధమా?

- చంద్రబాబుకు వైసీపీ సవాల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: చంద్రబాబు తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఓపెన్ డిబేట్‌కు రావాలని వైకాపా సవాల్ విసిరింది. చంద్రబాబుపై వస్తున్న ఆరోపణలను తాము రుజువులతో సహా నిరూపిస్తామని ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన, ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం విజయ్ చౌక్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎంపై నిప్పులు చెరిగారు. తన అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని తిరిగి బీజేపీలో చేరడానికి ప్రయత్నిస్తున్నారని విజయసాయి రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి కార్యాలయం నేరస్తుల అడ్డాగా మారిందని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బ్రీచ్ ఆఫ్ ప్రివిలేజ్, అందుకు ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిస్తానని హెచ్చరించారు.



మావేమీ గొంతెమ్మ కోరికలు కాదు: మేకపాటి

వైఎస్సార్సీపీ తరపున ప్రవేశపెట్టిన తీర్మానాలకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. తీర్మానం చర్చకు రాకపోతే చివరగా రాజీనామాలు చేస్తాం. మాకు సహకరించమని ప్రతి ఒక్కరినీ వేడుకున్నాం. మా పార్టీ తరపున ప్రతి రోజూ నోటీసులు ఇస్తూనే ఉన్నాం. మేమేమీ కేంద్రాన్ని గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడుగుతున్నాం. ఇది తీరని అన్యాయం. పార్లమెంట్‌కు మచ్చ. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి హామీలు నెరవేర్చాలి. ప్రజలు అన్నీ చూస్తున్నారు. టీడీపీ వారు గొప్ప మేధావులు. ప్రచార సాధనాలను పెట్టుకొని మాపై బురద జల్లుతున్నారు. నేనేమీ తప్పు చేయలేదంటూనే చంద్రబాబు భయపడుతున్నారు. మిగతా పార్టీల నాయకులను చూసి చంద్రబాబు నేర్చుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను చంద్రబాబు మంట కలిపారు. బాబు నిజాయితీగా ఉంటే ఛాలెంజ్ చేయవచ్చు కదా. రోజు నీతి పాఠాలు మాత్రం చెబుతారు.



మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్‌తో సమావేశమైన జే.డీ. లక్ష్మీ నారాయణ (ఐపీఎస్)

క్రీడాప్రభ



ముక్కోణపు మహిళా టీ 20 సిరీస్

ఇంగ్లండ్ శుభారంభం

ఆసీస్‌పై 8వికెట్ల తేడాతో గెలుపు

ముంబై: ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ మహిళా జట్టు శుభారంభం చేసింది. ఆస్ట్రేలియాను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టాస్ గెలిచి ఫీల్డింగ్‌ను ఎంచుకున్న ఇంగ్లండ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆస్ట్రేలియాను 149/8 పరుగులకే కట్టడి చేసింది. ఆస్ట్రేలియా బ్యాట్స్‌వుమన్లలో రాచెల్ హేన్స్ అత్యధికంగా 65 పరుగులు చేసింది. ఇందుకు ఆమె 45 బంతులను ఎదుర్కొంది. ఇంగ్లండ్ మీడియం పేసర్ జెన్నీ గన్ 3 వికెట్లు తీయగా, షివెర్ 2 వికెట్లు చేజిక్కించుకుంది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఓపెనెర్లు తొందరగానే ఔటయినప్పటికి, అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన వికెట్ కీపర్ టమ్మి బీమోంట్(58), నటాలియా షివెర్(68) జట్టును విజయ పథంలో నడిపించారు. ఇంకా మూడు ఓవర్లు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించారు. టామి, షివెర్లపై ఆసీస్ బౌలింగ్ ఏమాత్రం పనిచేయలేకపోయింది. బౌలింగ్‌లో 2/29తో రాణించి బ్యాటింగ్‌లో 68 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన షెవెర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును గెలుచుకుంది. బౌలింగ్‌లో ఆసీస్ భరతం పట్టిన షివెర్, బ్యాటింగ్‌లోను ఆసీస్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. అటు బీమోంట్ కూడా దూకుడును కొన సాగించింది. 34 పరుగులకే రెండు వికెట్లు పోగొట్టుకున్న దశలో వరుసగా నాలుగు ఫోర్లు కొట్టిన బీమోంట్ స్కోరును 51 పరుగులకు దూకించింది. షివెర్ కూడా బోమోంట్‌కు తీసిపోకుండా ఎనిమిదో ఓవర్లో రెండు సిక్సులు బాదింది. 10వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్ చివరివరకు తన జోరును కొనసాగించింది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా 149/8 (20 ఓవర్లు) (రాచెల్ హేన్స్ 65, అలీస్సా హీలీ 31) (జెన్నీ గన్ 3/26, షివెర్ 2/29), **ఇంగ్లండ్:** 150/2(17 ఓవర్లు). (నటాలియా షివెర్ 68 నాటౌట్, టమ్మి బీమోంట్ 58 నాటౌట్) (డి కిమ్నెన్సీ 1/12)



రాచెల్ హేన్స్ ఆస్ట్రేలియా కెప్టెన్



ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌వుమన్ ఎలిసా పెర్రీని ఔట్ చేసిన ఆనందంలో ఇంగ్లండ్ బౌలర్ డేనిఎల్లీ హాజెల్



మణిపూర్‌పై కేరళ గెలుపు

అరడజను గోల్స్‌తో కేరళ అద్భుతం

సంతోష్ ట్రోఫీ

కోల్‌కతా: ఫుట్‌బాల్ క్రీడలో దేశీయంగా జరిగే టోర్నీల్లో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సంతోష్ ట్రోఫీ పోటీల్లో భాగంగా శుక్రవారం కేరళ, మణిపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ 6-0 తేడాతో మణిపూర్‌ను మట్టి కరిపించింది. ఆట తొలి అర్ధ భాగంలో ఇరు జట్లు ఒక్క గోల్ కూడ చేయలేకపోయాయి. ఆట రెండో అర్ధ భాగం కేరళ పుంజుకుని అర డజను గోల్స్‌ను చేసి ప్రత్యర్థికి అందనంత దూరంలోకి చేరిపోయింది. ఆట 62 నిమిషంలో ఒకసారి, 84వ నిమిషంలో మరోసారి కేరళ ఆటగాడు జితిన్ గోపాలన్ రెండు గోల్స్ చేయగా, మణిపూర్ క్రీడాకారుడు చింగాఖమ్ ఒక సెల్ఫ్ గోల్ చేసి కేరళ ఆధిక్యాన్ని పెంచాడు. కేరళ తొలి గోల్‌ను వీకే అఫ్దల్ ఆట 47వ నిమిషంలో సాధించాడు. అండర్-17 భారత జట్టులో అద్భుత ప్రతిభను చూపిన రాహుల్ కెపి ఆట 59 నిమిషంలో గోల్ చేసి కేరళకు ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. కేరళ ఆటగాళ్లు గోపాలన్, జితిన్ ఎంఎస్ చెరొక గోల్ చేసి కేరళకు అర డజను గోల్స్ ఆధిక్యాన్ని సాధించిపెట్టారు. ఈ టోర్నీలో కేరళ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచుల్లో మొత్తం 11 గోల్స్ చేసి తన గ్రూప్‌లో అగ్ర స్థానంలో ఉంది. రెండో స్థానంలో బెంగాల్ జట్టు ఉంది. ఈ టోర్నీలో మొత్తం పది టీంలు రెండు గ్రూప్‌లుగా పాల్గొంటున్నాయి.

ఛండీగఢ్‌పై 2-1 తేడాతో మహారాష్ట్ర గెలుపు

శుక్రవారం జరిగిన మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు చండీగడ్ సెమీఫైనల్ ఆశలకు గండి కొట్టింది. రవీంద్ర సరోవర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆట ఐదో నిమిషంలో మహారాష్ట్ర ఆటగాడు శుభం ఖన్విల్కర్ తొలి గోల్ చేయగా, 9వ నిమిషంలో డియాన్ మెనిజెస్ మరో గోల్ చేశాడు.

ఛండీగఢ్ ఆటగాడు రెండో ఆటలో మహారాష్ట్ర గోల్ పోస్ట్‌పై దాడి చేసినప్పటికి ఓటమి నుంచి తప్పించుకోలేక పోయింది. ఆట 88వ నిమిషంలో ఛండీగఢ్ ఆటగాడు విశాల్ శర్మ ఒక గోల్ చేశాడు.

నెంబర్ వన్ జాన్సన్ ఓటమి



ఆస్టిన్(టెక్సాస్): ప్రపంచ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచ నం.1 గోల్ఫర్ డస్టిన్ జాన్సన్ టోర్నీలో వరసగా రెండో ఓటమిని చవిచూశాడు. డిఫెండింగ్ ఛాంపియన్ జాన్సన్ బుధవారం జరిగిన పోటీలో ఆస్ట్రియాకు చెందిన బెర్న్ వెయిస్‌బెర్గర్ చేతిలో ఓడగా, శుక్రవారం నాటి పోటీలో కెనడాకు చెందిన హాడ్విన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ ఓటమితో రౌండ్ రాబిన్ పద్ధతిలో సాగుతున్న పోటీల్లో.. గ్రూప్‌వన్‌లో ఉన్న జాన్సన్ నాకౌట్ దశకు చేరుకునే ద్వారాలు మూసుకుపోయినట్లే.

శుభాంకర్‌కు మరో ఓటమి

ఈ పోటీల్లో భారత తరపున బరిలోకి దిగిన శుభాంకర్ శర్మ ట్రోఫీను గెలుచుకునే సామర్థ్యం లేకున్నప్పటికి పోరాడుతూ ఓటమి చెందాడు. శుక్రవారం జరిగిన పోటీలో 21 ఏళ్ల శుభాంకర్ స్పెయిన్‌కు చెందిన మాస్టర్స్ ఛాంపియన్ సెర్జియో, గ్రేసియా చేతిలో ఓటమి చెందాడు. రెండు ఓటమిలతో శుభాంకర్ నాకౌట్ దశకు దూరమయ్యాడు. మూడో లీగ్ మ్యాచ్‌లో డేలన్ ఫ్రిటెల్లిని ఓడిస్తే శుభాంకర్ ఆత్మవిశ్వాసం పెంచుకున్న వాడవుతాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
శనివారం 24 మార్చి 2018



పచ్చిమామిడి కాయలంటే...అదో ప్రత్యేకమైన రుచి. ఇవి వంటలకు పులుపుతో పాటు చక్కని ఫ్లేవర్‌ని కూడా తెస్తాయి, ఈ ఏడాది మామిడి... మార్కెట్లలోకి వస్తున్న సందర్భంలో...దానితో తయారు చేయుగల పసందైన రుచులివి

పచ్చిమామిడి పసందులు!

రక్తలేమికి ఔషధంగా...

పచ్చి మామిడిలో శరీరానికి చలువచేసే గుణాలు ఉన్నాయి. అందుకే అత్యంత మధురమైన పళ్లతో పాటు ఆరోగ్యాన్నిచ్చే కాయలను సైతం ఎక్కువగా తినటం మంచిది. పచ్చిమామిడితో తయారైన ఆమ్ పన్నా వడదెబ్బకు మంచి విరుగుడని ఆయుర్వేదం చెబుతోంది. పచ్చిమామిడిలో సి విటమిన్ అధికంగా ఉంది. ఇది పొట్టకు సంబంధించిన సమస్యలను తగ్గిస్తుంది. సి విటమిన్ అధిక మోతాదులో ఉంటే...అది శరీరం ఇనుముని శోషించుకోవటంలో ఉపయోగపడుతుంది. అందుకే రక్తలేమితో బాధపడేవారికి పచ్చిమామిడి ఎంతో మేలుచేస్తుంది. ఇందులో...ద్రాక్ష, యాపిళ్లలో ఉన్నట్టుగా పెక్టిన్ ఉంటుంది. ఇది మన గుండెకు ఎంతో ఉపయోగకరం. మేలు చేస్తుంది. అలాగే మామిడి పళ్లు, కాయల్లో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. వీటిని చల్లని ప్రదేశంలో ఉంచితే మూడు నుండినాలుగు రోజుల పాటు తాజాగా ఉంటాయి.



ఖోబా రోటీతో ...రుచికరమైన కూర

(రాజస్థాన్‌కి చెందిన ఈ వంటకాన్ని అక్కడివారు వారి సాంప్రదాయ వంటకం ఖోబా రోటీతో కలిపి తింటారు.)

పచ్చిమామిడి కాయలు-450 గ్రాములు (తోలుతో సహా ముక్కలుగా చేసుకోవాలి)
ఆవనూనె-మూడు టేబుల్ స్పూన్లు
జీలకర్ర, సోంపు, ఉల్లి గింజలు- ఒక టీ స్పూను చొప్పున
బిర్యానీ ఆకులు-రెండు
ఇంగువ-పావు టీ స్పూను
శనగపిండి-రెండు టేబుల్ స్పూన్లు
పసుపు- అర టీస్పూను
తురిమిన బెల్లం- ఒక టేబుల్ స్పూను
కారం, ధనియాల పొడి-ఒక టీస్పూను చొప్పున
ఉప్పు తగినంత

తయారీ విధానం

ముందుగా పాన్‌లో నూనె వేసుకునివేడి చేసుకోవాలి. దీంట్లో జీలకర్ర సోంపు ఉల్లిగింజలు కూడా వేసుకుని...అవి వేగేలా బాగా తిప్పాలి. ఇందులో బిర్యానీ ఆకులను తుంచి వేసుకోవాలి. ఇంగువ, శనగపిండి, పసుపు, కారం, ధనియాల పొడికూడా వేసుకుని అన్నీ బాగా కలిసేలా తిప్పాలి. తరువాత పచ్చి మామిడి ముక్కలు వేసి నీరు పోసి...రెండు మూడు నిముషాలు ఉడికించాలి. ఇప్పుడు ఉప్పు వేసుకుని మూత పెట్టి మంటని సిమ్‌లో ఉంచి పది నిముషాలు ఉడికించాలి. బెల్లంకూడా వేసి..అది కూడా బాగా కలిసేంత వరకు ఉడికించి...చివరగా కొత్తిమీరతో అలంకరించి...ఖోబా రోటీతో వడ్డించుకోవాలి.

ఖోబా రోటీ తయారీ విధానం

మూడు కప్పుల గోధుమపిండిలో అరకప్పుకి కాస్త తక్కువగా నెయ్యి, తగినంత నీరు ఉప్పు వేసి బాగా కలిపి...ఈ పిండిని పావుగంట పాటు పక్కన పెట్టుకోవాలి. పిండిని సమాన ముద్దలుగా చేసుకుని, ఒక్కోముద్దని ఆరు అంగుళాలు వెడల్పుతో మందంగా ఉండేలా చపాతీ చేసుకోవాలి. దీనిని పెనంమీద వేశాక...ఒక అరనిముషం తరువాత...రొట్టెని పొయ్యిమీదే ఉంచి..దానిని గిచ్చినట్టుగా చేయాలి. ఇప్పుడు రొట్టె పైభాగం చేప పొలుసుల్లా కనబడుతుంది. ఈ రొట్టెని నెయ్యితో బ్రౌన్ రంగు వచ్చే వరకు వేయించుకోవాలి.



తీపి పులుపుల కలయికతో... ఆమ్ పన్నా

(ఇది మహారాష్ట్రకు సంబంధించిన వంటకం)
పచ్చిమామిడి-500 గ్రాములు
పంచదార- అరకప్పు
ఉప్పు- రెండు టేబుల్ స్పూనులు
నల్లుప్పు- రెండు టేబుల్ స్పూనులు
వేయించి పొడిచేసిన జీలకర్ర- రెండు టేబుల్ స్పూనులు
సన్నగా తరిగిన పుదీనా- రెండు టేబుల్ స్పూనులు
నీళ్లు - రెండు కప్పులు

తయారీ విధానం

ముందుగా మామిడి కాయలను నీళ్లలో వేసి...తోలు రంగు మారే వరకు ఉడికించాలి. చల్లారనిచ్చి తోలుతీసి గుజ్జుని తీసుకోవాలి. దీంట్లో ఉప్పు, నల్ల ఉప్పు, జీలకర్ర పొడి అన్నీ వేసుకుని బాగా కలుపుకుని తరువాత నీళ్లు పోయాలి. గ్లాసుల్లో ఐస్ ముక్కలు వేసుకుని ఈ పానీయం పోసి సర్వ్ చేయాలి.





నోరూరించే... చారు

కావలసినవి
టమాటా-20 గ్రాములు
కందిపప్పు-ఒక గుప్పెడు
పచ్చిమామిడి-50 గ్రాములు
పసుపు ఆయిల్- ఒక్కో టేబుల్ స్పూను చొప్పున
ఉప్పు కరివేపాకు ఎండుమిర్చి. మిరియాలు, ధనియాలు, జీలకర్ర, ఆవాలు , అల్లం వెల్లుల్లి ఇవన్నీ కూడా చారుకి సరిపడా తగినంత మోతాదులో

తయారీ విధానం

ముందుగా మిరియాలు ధనియాలు జీలకర్రలను వేయించుకుని పొడి చేసుకోవాలి. పచ్చిమామిడి కాయలను నీళ్లలో వేసి బాగా ఉడికించాలి. తరువాత వాటిలోని గుజ్జుని తీసుకోవాలి. కందిపప్పుని కూడా ఉడికించుకోవాలి. అలాగే టమోటాలు అల్లం వెల్లుల్లి రసం పొడులను కలుపుకుని ఉడికించి వడబోసి.... ఆ నీటినివేరుగా పెట్టుకోవాలి. ఈ మిశ్రమానికి పప్పు మామిడి గుజ్జు కలుపుకోవాలి. నూనెలో ఆవాలు ఎండుమిర్చి కరివేపాకు పసుపు వేసి తాలింపు పెట్టుకుని తయారు చేసుకున్న చారులో పోసుకుంటే పచ్చిమామిడి చారు రెడీ.



అందరికీ నచ్చే... మ్యాంగో రైస్

కావలసినవి
అన్నం-ఒక కప్పు
తురిమిన పచ్చిమామిడి-అరకప్పు
ఆవాలు, మినప్పప్పు, పచ్చిశనగపప్పు-అర టీస్పూను చొప్పున
పల్లీలు - ఒక టీ స్పూను
కరివేపాకు, పసుపు తగినంత
పచ్చిమిర్చి-రెండు
నువ్వుల నూనె- మూడు టేబుల్ స్పూన్లు
ఉప్పు తగినంత

తయారీ విధానం

పొయ్యిమీద పాన్ పెట్టి నూనె పోయాలి. ఆవాలు వేసి అవి చిటపటలాడాక మినప్పప్పు, పచ్చిశనగపప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు, పసుపు, ఇంగువ వేసి వేయించాలి. ఇప్పుడు ఇందులోఅన్నం, తురిమిన మామిడిని వేసి అన్నీ బాగా కలిసేలా తిప్పితే చాలు మ్యాంగో రైస్ సిద్ధమైనట్టే.

పుల్ల మామిడితో... తీపి మురబ్బా

కావలసినవి
మామిడి కాయలు - ఒకకేజీ (ఏడు లేదా ఎనిమిది కాయలు)
ఉప్పు -రెండు టీస్పూన్లు
కుంకుమ పువ్వు-పావు టీస్పూను
పంచదార- ఒకకేజి
ఏలకులు - నాలుగు లేదా ఐదు

తయారుచేయు విధానం

కాయలను బాగా కడిగి 12 గంటలపాటు నీటిలో నాననివ్వాలి. తరువాత వాటిని బాగా తుడిచి ఆరనివ్వాలి. ఎక్కడా ఆకుపచ్చ అనేది కనబడకుండా తోలు తీయాలి. కాయలను పెద్ద ముక్కలుగా కోసుకుని...ముక్కలను ఫోర్క్‌తో పొడుస్తూ రంధ్రాలు పెట్టుకోవాలి. ఒక గిన్నెలో నీరు తీసుకుని మామిడి ముక్కలను అందులో వేసి, దాంట్లో ఉప్పు కూడా వేసుకుని మరో 12 గంటల పాటు నానబెట్టాలి. ఈ ముక్కలను ఉప్పునీళ్లనుండి తీశాక మంచినీళ్లతో రెండుసార్లు శుభ్రంగా కడిగి ఆరనివ్వాలి. ఒక గిన్నెలో ముక్కలు మునిగేంత స్థాయిలో నీరుపోసి పొయ్యిమీద ఉంచి బాగా మరిగించాలి. ఈ నీటిలో మామిడి ముక్కలు వేసి మూడు లేదా నాలుగు నిముషాలు ఉడకనివ్వాలి. నీరు తీసేసి ముక్కలను నీరు వడగట్టే గిన్నెలో వేసి ఉంచాలి. ఇప్పుడు ఈ ముక్కలు కుంకుమపువ్వు పంచదారలను డబ్బాలో పోసుకుని మూతపెట్టి రెండురోజులు అలాగే ఉంచుకోవాలి. ప్రతి 12 గంటలకు ఒకసారి డబ్బాని బాగా కుదుపుతూ ఉండాలి. దీంతో షుగర్ సిరప్ తయారవుతుంది. దీనిని పొయ్యిమీద ఉంచి 10 నుండి 15 నిముషాల వరకు ఉడికించాలి. ఇప్పుడది బాగా చిక్కబడుతుంది. ఇది ఎంతవరకు చిక్కబడాలంటే...ఒక ప్లేటులో ఒక చుక్క పాకం వేసుకుని దాన్ని బొటనవేలు చూపుడు వేళ్లకు మధ్యన ఉంచుకుని...వేళ్లను నిదానంగా దూరంగా జరిపితే తీగలా పాకం కనబడుతుంది. ఇక పొయ్యి కట్టేసి యాలకుల పొడిని అందులో కలపాలి. దాంతో మామిడి మురబ్బా తయారయినట్టే. దీనిని ఒక గాజు లేదా ప్లాస్టిక్ డబ్బాలో వేసి పెట్టుకుంటే...సంవత్సరం పాటు నిలవ ఉంటుంది.



పొట్టని తగ్గించే.. పాద సంచలనాసనం!





యోగా ట్రైనర్
గాయత్రి

యోగా టైమ్



నేలపై వెల్లకిలా పడుకోవాలి. తలకింద చేతులు పెట్టుకుని రెండు చేతుల వేళ్లనూ కలిపి ఉంచాలి. రెండు కాళ్లను మొదట 30డిగ్రీల కోణంలో పైకెత్తి...ఎడమకాలిని మడిచి..కుడిమోచేయిని ఎడమ మోకాలికి తాకించాలి. తరువాత అదే విధంగా కుడికాలిని మడిచి...కుడి మోకాలికి ఎడమమోచేయి తగిలేలా చేయాలి. ఇలా వీలైనంతవేగంగా చేయాలి. 25సార్ల నుండి మొదలుపెట్టి వందసార్ల వరకు చేయవచ్చు. తరువాత శవాసనంలో విశ్రాంతి తీసుకోవాలి.

ఫలితాలు

ఈ వ్యాయామంతో పై పొట్ట కింది పొట్ట పక్కటెముకలు, తొడల వద్ద పేరుకున్న కొవ్వుతగ్గి కండరాలు బలపడతాయి. చేతులు సన్నబడతాయి.

పేషంట్ల ఎంపికకూ...గూగులే శరణ్యం!

ఉద్యోగాలు ఇచ్చేవారు...తాము ఉద్యోగాలు ఇవ్వబోతున్న అభ్యర్థుల గురించి.. సోషల్‌మీడియాలో వారి ఖాతాల ద్వారా ముందుగానే తెలుసుకుంటున్నారు. ఇద నడుస్తున్న ట్రెండే. ఇప్పుడు మరొక కొత్త ట్రెండ్...మన కళ్లముందుకు వచ్చింది. ఏ డాక్టరు దగ్గర చూపించుకోవాలో తెలుసుకునేందుకు పేషంట్లు గూగుల్‌ని వెతకటం సాధరణమే కానీ...ఇప్పుడు డాక్టర్లు కూడా తాము చికిత్స చేయబోయే పేషంట్లను గురించి గూగుల్ ద్వారా తెలుసుకుని...చికిత్స ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయించుకుంటున్నారట. గూగుల్ వెళ్లని చోటు లేదు...అది చేయని పనీ లేదు కదా-

ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక కొంతమంది మానసిక వైద్యులను...మీరు చికిత్సకు ముందు పేషంట్ల గురించి తెలుసుకుంటున్నారా అని అడిగినప్పుడు చాలామంది వైద్యులు అవునని సమాధానం చెప్పారు. మానసిక అనారోగ్యాలు ఉన్నవారి వలన తమకు సమస్యలు ఎదురు కాకుండా వైద్యులు ఈ పని చేస్తున్నారు. నైతిక విలువల దృష్ట్యా అలా చేయటం సమంజనం కాదుకానీ...మా రక్షణ మేము చూసుకోవాలి కదా..అని వైద్యులు సమాధానం చెబుతున్నారు.

న్యూ మెక్సికోలో ప్రొఫెషనల్ కౌన్సెలర్ మిఛీలీ మూరే ఈ విషయం గురించి స్పందిస్తూ...'నా ఆఫీస్ ఇంట్లోనే. మరి నా భద్రత దృష్ట్యా నేను చికిత్స చేయబోతున్న వ్యక్తి ఎలాంటివారో తెలుసుకోవటం చాలా ముఖ్యం. ఫోన్ ద్వారా నేను తెలుసుకున్న వివరాలు...ఆయా వ్యక్తుల ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లు చూపించే సమాచారం ఒకటేనా కాదా....ఏమైనా తేడాలున్నాయా అనేది తెలుసుకుంటాను...నేనేమీ ప్రయివేట్ పరిశోధనలు చేయను...కానీ గూగుల్ ఫేస్‌బుక్‌లో మాత్రం చూస్తాను' అంటున్నారు.

మానసిక వైద్యుల వినూత్న ట్రెండ్



క్లినికల్ సోషల్ వర్కర్ షేరీ హెల్లర్...తన స్వీయ అనుభవాన్ని చెబుతూ...ఒక వ్యక్తి ఒక కోర్టు కేసు విషయంలో అబద్ధాలు చెబుతున్నాడని, అది అతనికి ఇతరులకూ కూడా హాని కరమని అర్థమై...ఆ కేసు గురించి గూగుల్‌లో తెలుసుకున్నానని... ఆమె చెప్పుకొచ్చింది.


గూగుల్ తో చిక్కే... అయినా

నిజానికి గూగుల్‌లో పేషంట్లను గురించి తెలుసుకుని చికిత్సని మొదలుపెడితే తప్పకుండా అది చికిత్సపై ప్రభావాన్ని చూపుతుంది. అందుకే వైద్యులు తమ పేషంట్ల గురించి ఇంటర్నెట్‌ని చూడాలనే కుతూహలాన్ని తగ్గించుకోవాలని కొలరాడోలో క్లినికల్ సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న ఇరిన్ కె టెర్నో అంటున్నారు. తమ వృత్తిలో ఉన్న అత్యంత ముఖ్యమైన విషయం పేషంటు... తన గురించి తాను పూర్తిగా నిజాలు చెప్పగలుగుతున్నాడా లేదా...అనేది తెలుసుకోవడమేనని...దానిమీదే...తాము వారితో కొనసాగే కాలంలో ఎంత సురక్షితమనేది ఆధారపడి ఉంటుందని ఇరిన్ అభిప్రాయపడ్డారు. అయితే ఇలా ఇంటర్నెట్ ద్వారా తెలుసుకున్న అంశాలు ఒక్కోసారి నిజం కాకపోవచ్చని, సెలబ్రిటీల విషయంలో ఎన్నో విషయాలు ప్రచారంలో ఉంటాయని...వారి గురించి బయట చెప్పుకుంటున్నది, ఒక రకంగా...వారి వ్యక్తిగత ఆలోచనలు మరో రకంగా ఉండే అవకాశం ఉందని కూడా ఇరిన్ పేర్కొంది. మొత్తంమీద ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వినబడుతున్నాయి. ఇవి వైద్యుల నైతిక విలువలకు భిన్నమని కొంతమంది అభిప్రాయపడుతుంటే...నిజాలు తెలుస్తాయని, చికిత్సలో తాము సురక్షితంగా ముందుకు సాగవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా డాక్టర్లు పేషంట్ల చరిత్రను తెలుసుకుని చికిత్స అందించడం...కాస్త విచిత్రమే.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

చేసేదెవరు? చేయబడేదేమి?



శ్రీరమణాశ్రమం

8-9-47

ఈ దినం ఉదయం ఒక ఐరోపియన్ శ్రీవారికి ఎదురుగా కూర్చుని, ఒక భక్తుని ద్వారా ఇట్లా అడిగించాడు. ''ధ్యానం చేసినా, తపస్సు చేసినా, సమాధిని అభ్యాసం చేయందే మోక్షం లేదని మాండుక్యోపనిషత్కారికలో చెప్పారే, నిజమేనా? సమాధి సిద్ధించక మోక్షం లేదా?''

భగవాన్ సావధానంగా ''అదేనండీ, సమాధి అనుకోండి, ధ్యానమనుకోండి, తపస్సనుకోండి, ఏమన్నా అనుకోండి, ఎగతెగని ఆజ్యధారవలె ఎప్పుడూ స్థిరంగా ఉండేది ఏదో అదే తపస్సూ, ధ్యానం, సమాధీను. తానుతానుగా ఉండడమే సమాధి'' అన్నారు.

''మాండూక్యంలో సమాధి అవశ్యంగా చేకూరాలన్నారే'' అన్నాడాతడు. ''కాదని ఎవరన్నారు. మాండూక్యంలోనే కాదు; అన్నిటిలోనూ చెప్పారు. తానెవరో తెలుసుకుంటే గదా సమాధి యొక్క ఉపయోగం. కొంతసేపు ఒళ్లు తెలియకుండా జడం వలె కూర్చున్నంతనే ప్రయోజనం ఏమిటి? చేతికి కురుపు లేస్తుంది. శస్త్ర చికిత్సార్థం క్లోరోఫారం ఇచ్చి కురుపు కోస్తారు. అప్పుడు నీకు ఏమీ తెలియదు. అంతమాత్రాన అది సమాధి అవుతుందా? ఇదీ అంతే. సమాధి అంటే యేమో తెలుసుకోవాలి ముందు. తానెవరో తెలియకుండా సమాధి సమాచారం ఎట్లా తెలియడం? ముందు అది తెలుసుకుంటే, సమాధి తానుగానే వస్తుంది'' అన్నారు భగవాన్.

చాలాకాలంగా వస్తూ పోతూ వున్న ఆంధ్రులొకరుండి ''సమాధిని అభ్యసించి, వస్తువును తెలుసుకున్న వెనుక గూడా అనుసంధానం చేయవలెనా?'' అన్నారు. ''అనుసంధానం చేయటం అంటే చేసేవాడు ఒకడు, చేయబడేది ఒకటి, వస్తువు ఒకటి, మూడు కాలేదా? ఉన్నది వస్తువు ఒక్కటే. దాన్ని తెలుసుకున్న వెనుక తానే (అహమే)ఉండడే. ఇక చేసేదెవరు? చేయబడేదేమి?'' అన్నారు భగవాన్. ఇంతలో ఒక తమిళ భక్తుడు తిరువాచకం తెరచి, 'పిడిత్తవిత్తు' (పట్టుకొను పదికం) పాడటం ప్రారంభించాడు. ఆ పది పాటల్లోనూ ఒక దానిలో, ''ఓ ఈశ్వరా, నీవు పారిపోదామని చూస్తూ ఉన్నావు. నేను గట్టిగా పట్టుకున్నాను సుమా. ఇక నన్ను విడిచి ఎక్కడికి పోగలవు?'' అనే భావం వస్తుంది.

భగవాన్ ఆ పాట విని మందహాసంతో ''వారు పారిపోతారట. వీరు పట్టుకుంటారట. పోయేదెక్కడికి? లేనిదెక్కడ? తానెవరు? ఇది ఒక తమాషా. దీనిలోనే ఇంకొక పదికం వున్నది. అందులో ఒక పాట తాత్పర్యం చూడండి. ''నా చిత్తమే కోవెలగా చేసుకొన్న నా దైవమా. తిరుప్పెరుందురై పరమేశ్వరా, నిన్ను నాకిచ్చి, అందుకు ప్రతిగ నన్ను నీవు తీసుకొన్నావు. శంకరా!మన ఇద్దరిలో చతురులు ఎవరు? నిన్ను నాకిస్తే, నేను అంతులేని ఆనందం పొందుతాను. నన్ను తీసుకుంటే నీకేం లాభం? జనకా, దైవమా, నా శరీరం గూడా దేవాలయంగా చేసుకొన్న నీ ఈ ప్రియతర కార్యానికి ప్రత్యుపకృతి చేసేటందుకు నాకు ఏమీ లేదే?'' అంటాడు. అంటే నేనంటూ వేరే లేనని తాత్పర్యం. చూడండి చిత్రం. భక్తిగానీ, అనుసంధానం గానీ, సమాధిగానీ తానే ('అహమే) లేనప్పుడు చేసేదెవరు? చేయబడేదేమి?'' అని సెలవిచ్చారు భగవాన్.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభ మవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేక పోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు ఉపకరిస్తాయి. ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరో గ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు/ లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవి చూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శుభవార్తలు వింటారు. అవకాశాలను సద్వినియోగపరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com




పరిశ్రమించి, మెలకువతో ఒళ్ళు దాచుకోకుండా శక్తి కొద్దీ పని చేయడం ద్వారా మాత్రమే పనులు సాధించబడతాయి. మృగరాజే అయినా నోరు తెరుచుకుని నిద్రపోతూ 'ఆహారం నా నోటి వద్దకే వస్తుందనుకుంటే ఏ జింకా ఆ సింహం నోటిలో దూరదు' అని ఒక సంస్కృత నీతి శ్లోకార్థం. వేమన చెప్పినది అదే!

సాధనమున పనులు సమకూరు ధరణిలోన

ఏ పని చేయాలన్నా అంతో ఇంతో కష్టపడాలి. పెద్ద కార్యాలు సాధించడానికి మరింతగా కష్ట పడాలి. కృషితో నాస్తి దుర్భిక్షం అనేది అందరికీ తెలిసిందే. ఇటువంటిదే ఒక సంస్కృత శ్లోకం ఉంది. అదే

ఉద్యమేనహి సిద్ధ్యంతి కార్యాణి నమనోరథైః
నహి సుప్తస్య సింహస్యప్రవిశంతి ముఖే మృగాః

పరిశ్రమించి, మెలకువతో ఒళ్ళు దాచుకోకుండా శక్తి కొద్దీ పనిచేయడం ద్వారా మాత్రమే పనులు సాధించబడతాయి. మృగరాజే అయినా నోరు తెరుచుకుని నిద్రపోతూ 'ఆహారం నా నోటి వద్దకే వస్తుందనుకుంటే ఏ జింకా ఆ సింహం నోటిలో దూరదు' అని దీని అర్థం. ఇదే మాట స్వామి వివేకానంద ఇలా చెప్పారు. 'ప్రతివారు తమ శక్తి కొలది పాటు పడనిచో ఏ కార్యమైనా సాధ్యమౌతుందా? కార్యశూరుణ్ని, పురుషసింహుణ్ని, విజయలక్ష్మి వరిస్తుంది. వెనుకకు చూడనవసరంలేదు'.



ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒకటి సాధించాలనుకుంటాడు. అటువంటప్పుడు సాధ్యాసాధ్యాల గురించి బాగా ఆలోచించాలి. ఏమీ చేయకుండా కలెక్టర్ కావాలనుకుంటే కాగలడా? దానికి కావలసిన సన్నాహాలు చేసుకుంటూ పోవాలి. కలెక్టర్ కావాలంటే ఏది అవసరం. చిన్నతనం నుంచి చదువు మీద శ్రద్ధ ఉండాలి. ఏకాగ్రత ఉండాలి. ఇతర ఆలోచనలు మనస్సులో చేరకుండా జాగ్రత్తపడాలి. కలెక్టరు కావాలన్నది ఆశయమా లేక పగటికలా అన్నది నిర్ధారించుకోవాలి. ఏమంటే కళ్ళెంలేని గుర్రంలాంటిది మనస్సు. ఏవేవో చేయాలనే కోర్కెలు స్వభావసిద్ధంగా జనిస్తాయి. కలెక్టరు కావాలనుకున్న వాడు దానికే అంటిపెట్టుకుని ఉండాలి. తొలి దశలో నిష్ఠ ఒక్కటే మార్గం. చిత్తశుద్ధి ఉంటే సంకల్పించింది సాధించవచ్చు. నిష్ఠ లేనిదే పురోభివృద్ధి సాధ్యం కాదు. వేమన అదే హితవు చెప్పాడు.

అనగఅనగ రాగమతిశయిల్లుచునుండు
తినగతినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ॥

పాడగాపాడగా రాగం పట్టుబడుతుంది. చేదైన వేపాకు కూడా నమలగా నమలగా తియ్యగా ఉంటుంది. కష్టమైన పనైనా కూడా నిష్ఠతో, నైపుణ్యంతో, ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో, సంకల్పంతో చేయాలి. అదే సాధన. సాధన ద్వారా చేపట్టిన పని నెరవేరుతుంది. మన ఆశయానికి అవరోధం కలిగించే విషయాల జోలికి ఏ మాత్రం పోరాదు. చంచల చిత్తులకు నిష్ఠ ఉండదు. భగవద్గీత రెండవ అధ్యాయం 41వ శ్లోకంలో శ్రీకృష్ణభగవానుడిలా పలికాడు.


వ్యవసాయాత్మికా బుద్ధిః
ఏకేహ కురు నందన
బహుశాఖా హ్యనంతాశ్చ
బుద్ధయో వ్యవసాయినామ్

(అర్జునా నిష్కామ యోగ నిష్ఠానమున కర్మయే ఈశ్వరారాధన అని, అదియే శ్రేయోమార్గమని నిశ్చయాత్మకమగు బుద్ధి ఒక్కటే నిలుస్తుంది. చంచలచిత్తుల బుద్ధులు శాఖోపశాఖలుగా విడివడి అనంత ముఖములవుతున్నవి). దృఢని శ్చయంగల బుద్ధితో పనిచేసే వాడి మనస్సు ఒక విషయంపై పట్టు సడలకుండా నిమగ్నమై ఉంటుంది. కాని అలాంటి దృఢ నిశ్చయం లేనివాని మనసు పరిపరి విధాల పరుగులు తీస్తుంటుంది.

పురాణాలలో భగీరథ చక్రవర్తి కథ ఉంది. అతని సంకల్పంతో గంగ భూమి మీద అవతరించింది. గంగను భూమి మీదకు తెచ్చేం దుకు భగీరథుడు ఎంతో శ్రమకోర్చి తపస్సు చేశాడు. గంగా మాతను ప్రసన్నం చేసుకున్నాడు. ఆమె పాటును భూమి భరించలేదని తెలియడంతో శివుని కోసం తపస్సు చేసి మెప్పించి అయన గంగను తన శిరసు మీదకి దూకేలా ఒప్పించాడు. ఆయన జటాజూటంనుంచి విడిచిన ఒక గంగ జలధారే భూమి మీదకు వచ్చింది. ఇంత శ్రమ పడడం వల్ల గంగ వచ్చింది. వచ్చిన గంగ జహ్ను ముని ఆశ్రమాన్ని కొట్టి వేసింది. దానితో ఆయన గంగను పానం చేశాడు. మళ్ళీ భగీరథుడు ఆయనను ప్రసన్నం చేసుకుని వదలమంటే ఆయన తన చెవి ద్వారా గంగను విడిచాడు. గంగను భూమికి తీసుకురావడానికి, ఆమెకు ఎదురయ్యే అవరోధాలను ఎదుర్కొని ఆయన గంగను భువిపై నిలిపాడు. ఏ పనైనా సాధించడానికి ఎంతో కష్టపడాలి. దారిలో ఎదురయ్యే అవరోధాలను ఎదుర్కోవాలి. వాటితో బెంబేలెత్త కూడదు. నిరాశా నిస్పృహలకు లోను కారాదు. అంతిమ లక్ష్యం చేరుకునే వరకూ శ్రమించాలి.

- గుమ్మా ప్రసాదరావు
భిలాయ్ నుంచి
09755110398

ఏది ఉత్తమ ప్రశ్న?



కొన్ని పనులు చేయడానికి వివిధ మార్గాలున్నపుడు ఏది అన్నిటి కన్న మంచిదని చూస్తాము. అయితే ఈ విధానాలు ఉత్తమం, మధ్యమం, అధమంగా పేర్కొనడం ఉంటుంటుంది. ఉదాహరణకు శిష్యుల గురించి చెబుతూ గురువు చెప్పక ముందే ఆయన అభిప్రాయం గ్రహించి వర్తించేవాడు ఉత్తముడని, గురువు చెప్పిన తర్వాత చేసేవాడు మధ్యముడని, గురువు చెప్పాక కూడా ఆలస్యం చేసేవాడు

ఆధ్యాత్మిక రహస్యాలు

అధముడని ఇలా చాలా విషయాలకు ఉత్తమ, మధ్యమ, అధమాలను మన పూర్వులు నిర్ధారించారు. ఇదే విధంగా ప్రశ్నలకు సంబంధించి ఒక వర్గీకరణ ఉంది. ఎవరికైనా ఏదైనా సందేహం వచ్చినపుడు దానిని తీర్చుకునేందుకు తమ కంటె పెద్దల వద్దకు, శ్రేయోభిలాషుల వద్దకు, తమ సందేహాలు తీర్చుకునేందుకు వెడతారు. అయితే ప్రశ్నలు అడగడంలో నాలుగు విధానాలున్నాయి. ప్రశ్నలు, సందేహాలను అనుసరించి పెద్దలు వాటిని ఇలా విడమరిచారు. వీటిలో మొదటిది తుచ్ఛము, రెండవది కనిష్టము, మూడవది మధ్యమము, నాల్గవది ఉత్తమము.

తుచ్ఛము

తుచ్ఛమైన ప్రశ్న ఏది అంటే వివా దార్థమైనది. అంటే ఒకరిని ఓడిం చాలనో, అధిగమించాలనో వేసే ప్రశ్న. దీని వల్ల ప్రశ్న అసలు ఉద్దేశమైన సందేహ నివృత్తి మూలన పడుతుంది. ఇతరులను తమ ప్రశ్నతో ఇబ్బంది పెట్టా లని, వారిని అధిగమించాలనే ఉద్దేశంతో వేసే ప్రశ్నలు ఈ తరహాలోనికి వస్తాయి.

కనిష్టము

ఇది తమ వాక్చాతుర్యాన్ని ప్రద ర్శించుకునేందుకు వేసే ప్రశ్న. ఇక్కడా సందేహ నివృత్తి ముఖ్యం కాదు. అనగా తమకూ పరిజ్ఞానం ఉందని అవతలి వారికి తెలియజెప్పేందుకు వేసే ప్రశ్న. తమకు ఆ విషయం తెలుసునని చెప్పేం దుకు వేసే ప్రశ్న ఈ తరహాలోనికి వస్తుంది.

మధ్యమం

ఇది తమ బుద్ధి చాతుర్యాన్ని ప్రదర్శించేందుకు వేసే ప్రశ్న. తమ తెలివి తేటలు ప్రదర్శించేందుకు యుక్తి యుక్తం గా మాట్లాడాలని ఆరాటపడే వాళ్లు ఈ విధంగా ప్రశ్నలు వేస్తారు.

ఉత్తమం

ఇది ప్రశ్న అసలు ఉద్దేశమైన సందేహ నివృత్తి కోసం వేసే ప్రశ్న . తమకున్న సందేహాలను తీర్చుకునేందుకు పెద్దలను వేసే ప్రశ్న ఈ తరహాలోకి వస్తుంది. ఋషుల వద్ద శిష్యులు, ఇంకొందరు ఉత్తములు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలు వేస్తారు. వారు ఉత్తములు.

సందేహాల విషయానికి వస్తే అవి అర్థవంతమైనవై ఉండాలి. ప్రశ్నను బట్టి అవతలి వారి స్థాయి తెలుసుకోవచ్చు. వారు నిజంగా సందేహంతో వచ్చారో లేదా కాలక్షేపానికి, మరో ఉద్దేశంతో వచ్చారో తెలుసుకోవచ్చు. ఇక కుశంకలు ఉంటాయి. మరీ చనువు ఉన్నచోట ఇటువంటి కుశంకలు పుడుతంటాయి. ఇవి అనవసర ప్రశ్నలు. ఈ కుశంకలకు సంబంధించి పెద్దలు చెప్పే ఉదాహరణ ఒకటుంది. వ్యాసుల వారు తన కుమారుడు శ్రీశుకునికి బ్రహ్మ విద్య ఉపదేశం చేయించడానికి జనక మహారాజు వద్దకు పంపాడు. వ్యాసుడంతటి వానికి తెలియని విద్య ఉంటుందా. ఉండదు. అయితే కుమారుడు తన వద్ద విద్యాభ్యాసం చేస్తే చనువు వల్ల కొత్త కుశంకలు వస్తాయనే ఆయన తన కుమారుని జనక మహారాజు వద్దకు పంపాడు. అక్కడ జనకుడు మూడు రోజుల పాటు శుకుని పరిశీలించి, పరీక్షించి ఆయనకు బ్రహ్మ విద్యోపదేశం చేశాడని చెబుతుంటారు. పెరటి మొక్క వైద్యానికి పనికిరాదనే సామెత. పెరటిలో గొప్ప ఔషధీయుత మొక్క ఉన్నా అది వైద్యానికి ఉపయోగించాలని ఎవరైనా చెప్పినా అది పెరటి మొక్క అనే చిన్న చూపు వస్తుంది. వైద్యులు అదే మొక్కను అడవి నుంచి తీసుకొస్తే దానిని గొప్ప ఔషధంగా భావించి వాడడం జరుగుతూంటుంది.

(భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ఉపన్యాసాల ఆధారంగా)

సేకరణ: ఆదూరి హైమావతి (చికాగో)

భగవద్గీత



భక్తియందు స్థిరుడయితే భగవద్ధామం

అధ్యాయం 8
శ్లోకం 27

నైతే సృతీ పార్థ జానన్
యోగీ ముహ్యతి కశ్చన।
తస్మాత్ సర్వేషు కాలేషు
యోగయుక్తో భవార్జున॥

తాత్పర్యం

ఓ అర్జునా! భక్తులు ఈ రెండు మార్గాలను ఎరిగినప్పటికిని ఎన్నడు మోహమునొందరు. కనుక నీవు భక్తియందు సదా స్థిరుడవగుము.

భాష్యం

ఈ శ్లోకము నందు శ్రీకృష్ణుడు అర్జునునికి, జీవుడు మృత్యు సమయంలో వేరు వేరు గమ్యాల ద్వారా కొనిపోబడతాడని విని కలత చెందవద్దని అభయాన్నిస్తున్నాడు. భక్తుడు ఏర్పాటు ద్వారా లేదా అకస్మాత్తుగా మరణించినా భయపడవలసినదంటూ ఏమీ లేదు. భక్తుడు కృష్ణచైతన్యములో స్థిరమయితే 'హరే కృష్ణ' మంత్రాన్ని జపించటమే అతడి కర్తవ్యం. 'యోగయుక్త' అనే పదము ఇక్కడ ముఖ్యమైనది. భగవంతుని సేవలో నియుక్తుడగుటచే అన్ని కార్యాలలోను కృష్ణుణ్ని స్మరిస్తూ యోగములో స్థిరంగా ఉండవచ్చును. దీనినే 'యుక్త వైరాగ్యము'ని శ్రీల రూప గోస్వామి చెప్పి ఉన్నారు. ఈ విధంగా భగవత్సేవలో నియుక్తుడైన వ్యక్తి నిస్సందేహంగా భగవద్ధామం చేరగలడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



వేమన పద్యాలు

చినుగు బట్టకాదు చీనాంబరము గాని
మురికి యెడలు గాదు ముక్తిగాని
పరమయోగి మహిమ పరికింప నరుడురా
విశ్వదాభిరామ వినురవేమ

తాత్పర్యం: పరమయోగుల మహిమను తెలుసుకోలేము. పరమయోగి చినుగు బట్టను చీనాంబరంగా భావిస్తాడు. మురికిబట్టిన ఈ శరీరాన్ని ముక్తి సాధనంగా భావిస్తాడు. బాహ్య విషయాలు వేషాలు యోగికి అవసరం లేదు.

బాలప్రభ

పొడుపు కథ



అరచేతిలో 60 నక్షత్రాలు

మంచి పోటీ

"నీ కిష్టమైన మామిడిపండు ఇదిగో" దీపక్ ముందు మామిడి పండు ముక్కలు కోసిన పళ్లెం ఉంచింది శారద.

నాకేం వద్దు అన్నాడు సీరియస్‌గా హోం వర్క్ చేసుకోవటంలో లీనమవుతూ దీపక్.

"అరె.. ఎప్పుడూ లేంది ఇష్టమైన పండుకూడా తినకుండా హోంవర్క్ చేస్తున్నావంటే నాకేదో డౌట్‌గా ఉంది" అంది శారద. బదులు పలకలేదు దీపక్. టీపాయ్ మీదే ప్లేటు పెట్టి మూతవేసి పనిలో పడింది. అంతలో దీపక్ తండ్రి వెంకట్ వచ్చాడు. "దీపక్ ఇదిగో నువ్వడిగిన పెన్సిల్ బాక్స్" అన్నాడు. దీపక్ అదేం పట్టించుకోకుండా ముభావంగా రాసుకోసాగాడు. ఏమైంది అన్నట్టు చూశాడు శారద వంక. తెలియదన్నట్టు తల అడ్డంగా ఊపింది ఆమె. రాత్రి భోజనం తర్వాత బెడ్డెక్కారు ముగ్గురూ. అర్ధరాత్రి దీపక్ కలవరింతలకు మెలకువ వచ్చింది శారదకు.



"నేనే ఫస్ట్. నేనే ఫస్ట్. నువ్వేం కాదు. నిన్ను ఏం చేస్తానో చూడు" అంటూ కోపంతో ఊగిపోతూ అరుస్తుంటే వెంకట్ కూడా లేచాడు. దీపక్‌ని తట్టిలేపి మంచినీళ్లు తాగించాక నిద్రపోయాడు మళ్లీ.

ఉదయం లేచి స్నానం చేసి వచ్చిన దీపక్ చేతికి పాలగ్లాస్ ఇచ్చింది శారద. ఏం మాట్లాడకుండా త్రాగుతున్న దీపక్‌ని చూస్తూ "నాన్నా దీపు. సాయంత్రం మనింటికి ఎవరొస్తున్నారో తెలుసా?" అంది సస్పెన్స్‌లా ఆగి. "ఎవరు?" అన్నట్లు ఆసక్తిగా చూశాడు దీపక్. నా ఫ్రెండ్స్ స్వప్న ఆంటీ.. వాళ్లబ్బాయి కూడా వస్తున్నాడు. ఎంచక్కా మీరిద్దరూ ఆడుకుందురు అంది.

"ఆంటీ తెలుసుగాని వాళ్లబ్బాయి నాకు తెలీదుగా?" అన్నాడు దీపక్ త్రాగేసిన గ్లాస్ శారద చేతికిస్తూ

"వాడు కూడా నీలాగే. సెవెంత్ క్లాస్ చదువుతున్నాడు. ఎప్పుడూ వాడే క్లాస్ ఫస్ట్ అట. ఈసారి ఎందుకో రెండు మార్కులు తగ్గి వేరే అబ్బాయి ఫస్ట్ వచ్చాడని ఏడుస్తున్నాడట. అది మరిపించడానికి ఇక్కడికి తీసుకొస్తోంది చెప్పింది శారద వాటర్ బాటిల్‌లో నీళ్లు నింపుతూ.

"దానికి నేనేం చెయ్యాలి?" అన్నాడు మళ్లీ ముభావంగా మారుతూ.

"వాడెక్కడో పిచ్చి పిల్లాడిలా ఉన్నాడు. ఆటలో పోటీ లేకుంటే మనం ఫస్ట్ ఎలా వస్తాము? అలాగే చదువులోనూ కూడా ఎప్పుడూ మనమే వస్తే ఏం థ్రిల్ ఉంటుంది? నిర్లక్ష్యంగా చదువుతాం. అప్పుడు వేరెవరైనా ఫస్ట్ వస్తారు. మనకు పట్టుదల వచ్చి మళ్లీ ఫస్ట్ రావచ్చు. అప్పుడు ఫస్ట్ రాలేదనే కోపంతో మళ్లీ ఈసారి ఫస్ట్ వచ్చిన అబ్బాయి ప్రయత్నిస్తాడు. నిజానికి నా క్లాస్‌మేట్ అయిన స్వప్న ఆంటీ, నేను కూడా ఒకసారి నేను, ఒకసారి తను ఫస్ట్ వచ్చే వాళ్లం. ఒక్కోసారి సమానంగా కూడా మార్కులు వచ్చేవి. కాబట్టి వాళ్లబ్బాయికి నీలాంటి బ్రేవ్ బాయ్ బుద్ధి చెబితే తెలుసుకుంటాడు కదూ అందుకు" అంది శారద ఆటో ఎక్కిస్తూ

"నువ్వన్నట్టు ఆ అబ్బాయి పాపం మూతి ముడుచుకునే ఉన్నాడు మమ్మీ చాలాసేపు. తర్వాత నేను నచ్చజెప్పా. మా క్లాస్‌లో కూడా ఈసారి వేరే అబ్బాయి ఫస్ట్ వచ్చాడు. కానీ నేను నీలాగా ఏడవను. అతనితో కూడా ఫ్రెండ్లీగానే ఉంటా. ఇంకా బాగా చదువుతా. ఈసారి మనం ఇద్దరం మన క్లాస్‌లో ఫస్ట్ వచ్చి చూపిద్దాం అని."

"అవునవును. నువ్వు చక్కగా చెబుతుంటే నేను, స్వప్న ఆంటీ కూడా విన్నాం. స్వప్న నిన్ను చాలా మెచ్చుకుంది. మీవాడు చాలా గ్రేట్" పిల్లల మధ్య పోటీ ఉండాలి కానీ ఈర్ష్య ఉండకూడదు అని చక్కగా చెప్పాడు అంది. ఇంకా ఫస్ట్ రావడం మాత్రమే చదువుకు కొలమానం కాదు. ఎంత బాగా అర్థం చేసుకుని ఎంత ఇష్టంతో నేర్చుకున్నావన్నదే ముఖ్యం. కాబట్టి సంతోషంతో చదవాలి కానీ ఒత్తిడితో చదవకూడదు" అంది శారద.

"అవునా? మీ ఇద్దరిలాగే నేను ఈ సారి ఫస్ట్ వచ్చిన సాత్విక్ కూడా బెస్ట్‌ఫ్రెండ్స్‌గా వుంటాం. చూసుకో మమ్మీ" ఆనందంగా అన్నాడు దీపక్. అనుకున్నట్టే దీపక్ మనసు మార్చిన శారద వంక మెచ్చుకోలుగా చూశాడు వెంకట్.

నీతి: ఆరోగ్యకర పోటీ ఎప్పుడూ సత్ఫలితాలను ఇస్తుంది కానీ ప్రథమ శ్రేణి అనేది చదువుకు కొలమానం కాదని విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే పరీక్షలను ఆస్వాదిస్తూ రాయగలరు.

-డేగల అనితాసూరి

బాలగేయ సుమాలు

ఏమర్రా! చిన్నారులు ఏమిటి సంగతులు? ఉగాది పండుగను అందరూ ఘనంగా చేసుకున్నారు కదూ! అమ్మ చేసిన ఉగాది పచ్చడి ప్రతి సంవత్సరం తప్పకుండా తిని తీరాలి. ఎంతో ఆరోగ్యం కూడా. ఇక ఈ వారం మన పుస్తకాల తోటకు వెళదాం.



ఈ సారి మీకు ఒక వెరైటీ పుస్తకం గురించి చెబుతానే! జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వాసాల నరసయ్య తాతయ్య వ్రాసిన బాలగేయసుమాలు తెలుసుకుందాం. దీనిలో ఒకే పుస్తకంలో మీకు ఇష్టమైన రెండు అంశాలు అందించారు తెలుసా? అవి ఏంటంటే ఒకటేమో చక్కని గేయాలు రెండోది ఎంచక్కని పొడుపు కథలు ఈ పొడుపు కథలు అన్న నేటి ఆధునిక కాలానికి సంబంధించిన గమ్మత్తయినవి తెలుసా? ఎంత బాగున్నాయో!!

ఇక గేయాల విషయానికి వస్తే మొత్తం 20 గేయాలు. అన్నీ ఒకదానిని మించి ఒకటి అర్థవంతంగా రాగయుక్తంగా చక్కగా ఉన్నాయి.

ఇందులో నరసయ్య తాతయ్య భయం గురించిన గేయంలో చావు జన్మకు ఒక్కసారే గాని భయం రోజూ చావుతో సమానం అని చెబుతూ ధైర్యమే నాపాలి/ దైవమే గదరా/ సాహసములేకున్నా/ శవము నీవేరా అంటూ అందరికీ కావాల్సిన ధైర్య గుణాల గురించి చెప్పారు. అలాగే గ్రంథము గురించి గ్రంథాలయం గురించి ఎంత గొప్పగా చెప్పారో వినడం కన్నా చదివితేనే బాగుంటుంది.

కండ కరిగేదాకా/ కష్టించి పనిచెయ్యి/ తిండికేమి కొదవ/ దండిగా దొరికేను అంటూ కష్టం విలువ కళ్లకు కట్టినట్లు చెబుతారు. అలాగే పొదుపు గీతం, దువ్వెన, బొమ్మల బండి, కోతిబావ, చిలకమ్మా, మా చెల్లి వంటి గేయాలు ఎంత బాగున్నాయో! తెలుసా? చక్కని లయతో సరళమైన పదాలతో ఎంచక్కగా సాగుతాయి. ఈ గేయాలు ఒక్కసారి చదివితేనే ఇట్టే గుర్తుండిపోతాయి. ఇక ప్రతి పేజీకి క్రింద ఒక పొడుపు కథ తలక్రిందులుగా అంటే జవాబుతో అదనపు ఆనందాన్ని పంచిపెట్టారు.

ఇంటింటా ఉంటుంది. ఈలవేస్తుంది. గుండ్రంగా ఉంటుంది. ఏమిటది చెప్పండి అంటూ కుక్కర్ గురించిన భలే పొడుపు కథ చదవవచ్చు. వెలుగునిస్తుంది. చలువ చేస్తుంది. రాత్రయిన పగలన్నా వెన్నెల ఇస్తుంది. ఏమిటది? ఇలాంటి బోలెడు పొడుపు కథలు ఇందులో మనం చదువుకోవచ్చు.

ఎంచక్కని ఈ పుస్తకం ఖరీదు రూ 25/-, పేజీలు 58, దొరికేది వాసాల నరసయ్య 2-1-110, మెట్‌పల్లి-505325, జిల్లా: జగిత్యాల, తెలంగాణ రాష్ట్రం, సెల్: 9490977459.


పరిచయకర్త: డాక్టర్ అమ్మిన

వేగంగా పరిగెత్తే జంతువు చిరుత




హాయ్ ఫ్రెండ్స్! ఈ భూమి మీద అత్యంత వేగంగా పరిగెత్తే జంతువు చిరుతపులి. తన వేగం ద్వారా తాను వేటాడే జంతువును తక్కువ సమయంలో పట్టేస్తుంది. ఐతే ఇది మరీ ఎక్కువ దూరం వేగంగా పరిగెత్తలేకపోవడం విశేషం. చిరుత గురించి ఇటువంటి ఎన్నో విశేషాలు మీ కోసం.

భూమిపై అత్యంత వేగంగా పరిగెత్తే జంతువుగా చిరుత గుర్తింపు పొందింది. ఇది 460 మీటర్ల దూరం గరిష్ట వేగంతో పరిగెత్తగలదు. ఇదిలా ఉంటే మూడు సెకన్లలోనే గంటకు 103 కి.మీ వేగాన్ని అందుకునే సామర్థ్యం దీని సొంతం. అనేక సూపర్‌కార్ల కంటే ఎక్కువ వేగంతో పరిగెత్తగలదు. తన వేగం ద్వారా తాను వేటాడే జంతువులను తక్కువ సమయంలో పట్టేస్తుంది. చిరుతకు కురచ బొచ్చు గల చర్మంపై గుండ్రని ఆకారంలో నల్లటి చుక్కలు ఉంటాయి. ఈ చుక్కలు సెంటీమీటర్‌కు రెండు నుంచి మూడు చొప్పున శరీరవ్యాప్తంగా ఉంటాయి. ఇవి వేటాడే సమయంలో చిరుత ఉనికి తెలియకుండా కొంతవరకు కప్పివుంచేందుకు ఉపయోగపడతాయి. చిరుతకు తెలుపు వర్ణంలో ఉండే శరీర భాగంలో ఎటువంటి చుక్కలు ఉండవు. తోకపై మాత్రం చుక్కలు ఉంటాయి. చివరిలో నాలుగు నుంచి ఆరు నల్లటివలయాలు ఏర్పడేలా ఈ చుక్కలు కలిసిపోయి ఉంటాయి. చిరుత కళ్లు బాగా కనిపించే విధంగా చిన్న తలను కలిగి ఉంటుంది. నల్లటి కంటిచారలు రెండు కళ్ల మూల నుంచి ముక్కు, పక్కవైపుగా నోటిలోకి వ్యాపించి ఉంటాయి. సూర్యరశ్మి కళ్లపై పడకుండా ఉండేందుకు వేటలో సాయపడేందుకు సుదూర దృష్టికోసం ఇవి ఉపయోగపడతాయి. అధిక వేగాలు అందుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ దాని శరీరం బాగా ఎక్కువదూరం పరిగెత్తేందుకు అనుకూలించదు. తక్కువ దూరాన్ని ఎక్కువ వేగంతో పరిగెత్తుతుంది. పెద్ద చిరుతలు 36 నుంచి 65 కేజీల బరువు కలిగి ఉంటాయి. ఆడ చిరుతలకంటే మగ చిరుతలు కొంచెం పెద్ద ఆకారం కొంచెం పెద్ద తలలు కలిగి ఉంటాయి. అయితే చిరుతల పరిమాణంలో పెద్ద తేడా ఏమీ ఉండదు. కనిపించే ఆకారం ఆధారంగా మగ ఆడ చిరుతల మధ్య వ్యత్యాసం కనిపెట్టడం కష్టం.



పిల్లలు - జాగ్రత్తలు




పిల్లల విషయంలో న్యూజిలాండ్ ప్రభుత్వం ఎన్నెన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. పిల్లలు పుట్టింది మొదలు వారికి 17 సంవత్సరాలు వచ్చేంతవరకు అన్ని బాధ్యతలు ప్రభుత్వమే తీసుకుంటుంది. వారి ఆరోగ్యం, తల్లిదండ్రులకు సలహాలతో పాటు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తుంది. పిల్లలకు క్రీడామైదానాలు, పాఠశాల భవనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తారు. సరే అవన్నీ తర్వాత తెలుసుకుందాం కానీ పుట్టగానే ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దాం. పుట్టింది మొదలు వారికి ఐదునెలలు వచ్చే వరకు ప్రతివారం ఆరోగ్య సిబ్బంది వచ్చి పరీక్షలు జరుపుతారు. తల్లిదండ్రులకు పిల్లల విషయంలో జాగ్రత్తలు చెబుతారు. ఎప్పుడు ఏ అనుమానం వచ్చినా ఫోన్ చేయగానే అందుబాటులో ఉంటారు. ఇక్కడ పిల్లలను ఎత్తుకోవడం, గారాబం చేయడం ఉండదు. బయటకు వెళ్ళితే పిల్లల క్యాప్సుల్స్‌లో తీసుకువెళ్లాలి. అంటే ఆరునెలల వరకు ఇలాగే తీసుకువెళ్లాలి. కారులో కూడా వారికోసం ప్రత్యేకంగా సీటు కేటాయించాలి. కారులో కూడా ఎత్తుకోవడం, పైన కూర్చోపెట్టుకోకూడదు. అలా చేస్తే పోలీసులు పట్టుకుంటారు. అందుకు ప్రధాన కారణం ఏమిటి? అనే ప్రశ్న మీరు వేయవచ్చు. ఎందుకంటే పిల్లలకు బాల్యం నుంచే మంచి అలవాట్లు చేయాలి. అంతేకాదు ఒకరిపై ఆధారపడకుండా స్వంతంగా పనులు చేసుకోవడం అలవాటు చేయడం... అంటే ఇతరులపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకోవడం అలవాటు అవుతుంది కదా.. అంతేకాదు పిల్లలకు ఎప్పుడూ అన్ని విషయాలు చెబుతుండాలి. వారికి సున్నితత్వం అలవాటు చేయకూడదు. అన్న లక్ష్యంతో ఇలాంటి చర్యలు చేపట్టారు. ఇంతెందుకు 14 సంవత్సరాలలోపు పిల్లలను ఇంట్లో బయట ఒంటరిగా ఉంచడానికి వీలులేదు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎంత జాగ్రత్తలు తీసుకుంటారో ప్రభుత్వం కూడా అన్ని రక్షణలు తీసుకుంటుంది. అంతేకాదు మన దగ్గర పిల్లలను చూడగానే ఎత్తుకోవడం, బిగ్గరగా పట్టుకోవడం, ముద్దు పెట్టుకోవడం సాధారణంగా చేస్తుంటారు. కానీ ఇక్కడ అలా చేయడానికి ఎవరూ అంగీకరించరు. ఎదుటివారి మనోభావాలకు ఎలాంటి విలువ ఇస్తామో అదే విధంగా పిల్లల మనో భావాలకు అంతటి గౌరవాన్ని ఇస్తారు. వారికి ఇష్టం లేని ఏ పనీ చేయరు. వారిని తల్లిదండ్రులు కొట్టినా.. లేకుంటే పక్కింటివారు ఏమన్నా వెంటనే వారు పోలీసులకు 111 నెంబర్‌కు ఫోన్ చేసి చెబితే వెంటనే వారిని అదుపులోకి తీసుకుంటారు. ఎవరితో ఎలా ఉండాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో బాల్యం నుంచే శిక్షణ ఇస్తారు.

మరి ఇంతటి శ్రద్ధ మన దేశంలో తీసుకుంటే ఎంతో మంది ఉత్తమ పౌరులుగా, నిజాయితీగల వారిగా ఉండేవారు.

-టి. వేదాంతసూరి

ఇతర భాషల్లో బాలసాహిత్యం ఎక్కువ

బాలసాహితీ బంధువులు-45



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్: 9247564699

తపాలా శాఖలో ఉద్యోగం చేస్తూ బాలసాహిత్యంలో కృషి చేస్తున్న రచయితలు చాలామంది ఉన్నారు. అందులో ఐతా చంద్రయ్య తాత ఒకరు. నాటి మెదక్ జిల్లా సిద్దిపేట మండలం చింతమడ్క గ్రామంలో జనవరి 3 1946న పుట్టారు. అమ్మ లక్ష్మి, నాన్న లింగయ్య బిఏ (లిట్) చదివారు. పోస్ట్ మాస్టర్‌గా పదవీ విరమణ చేశారు. జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్నారు.

ఐతా చంద్రయ్య బాల్యం నుంచే బాలగేయాలు రాశారు. 400కి పైగా కథలు రాశారు. పెద్దలకోసం సాంఘిక కథలు రాయటంలో ఎంత కృషి చేశారో.. పిల్లల కోసం బాలసాహిత్యంలోనూ అంతే కృషిచేశారు. హిందీనుండి తెలుగులోకి, ఆంగ్లం నుండి తెలుగులోకి అనేకం అనువాదం చేశారు. డోలు డప్పు, నవోదయం, దిలీపుడు వంటి 17 అనువాదాలు ప్రచురించారు. బాలలకోసం తేనె చినుకులు, కుందేలు, తెలివి, బాలవివేకం కథా సంపుటాలు ప్రచురించారు. తేనె చుక్కలు, వెన్నెల కెరటాలు, రామచిలుక పలుకులు గేయ సంపుటాలు ప్రచురించారు.

ఎన్‌బిటి వారికోసం యుధిష్టరుడు అనే అనువాద పుస్తకం రాశారు. అద్భుత సాహసం, రాణీ రుద్రమదేవి హిందీ నుండి తెలుగులోకి అనువాదం చేశారు. పొట్టి శ్రీరాములు, కందుకూరి వీరేశలింగం, ప్రకాశం పంతులు, మహాత్మాగాంధీ, సతీసక్కుబాయి, గురునానక్, బసవేశ్వరుడు, నందన్ లాల్‌బోస్, బకించంద్ర ఛటర్జీ, రాజేంద్రప్రసాద్ వంటి 24 ప్రముఖుల జీవిత చరిత్రలు రాశారు. పాల్కురికి సోమనాథుడు, వందేమాతరం బాలల నవలలు ప్రచురించారు.

నేడు తెలుగులో కన్నా ఇతర భాషల్లో బాలసాహిత్యం ఎక్కువగా వస్తుంది. హిందీ, ఇంగ్లీషు భాషల్లో వస్తున్న బాలసాహిత్యాన్ని తెలుగు బాలలకు అందించడానికి కృషి చేస్తున్నారు. వీరి కథలు హిందీ, ఇంగ్లీషు, కన్నడం, మళయాళం, ఒరియా, మరాఠి సంస్కృతంలోకి అనువదించబడ్డాయి. బాలలకోసం కొన్ని రేడియో నాటికలు కూడా రాశారు. పిల్లలు తమ తోటి బీద పిల్లవాడి చదువుకోసం సహాయం చెయ్యటం ఇతివృత్తంగా ఆకాశవాణి హైదరాబాద్‌లో ప్రసారమైన 'బాబోయ్ బాల్యం' మంచి గుర్తింపు తీసుకువచ్చింది.

చంద్రయ్య తాత సాహిత్యకృషికి గుర్తింపుగా కథాశిల్పి, కథా కళానిధి, కనిశేఖర బిరుదులు పొందారు. కుందేలు తెలివి కథా సంపుటికి ప్రతిష్ఠాత్మక వాసాల నరసయ్య బాలసాహిత్య పురస్కారం పొందారు 2010లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం పొందారు. సిద్దిపేట జిల్లా బాలసాహిత్య రచయితలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.



చిరునామా
ఐతా చంద్రయ్య
4-4-11, శేర్‌పురా
సిద్దిపేట జిల్లా - 502103
తెలంగాణ
సెల్: 9391205299

పకపక

వచ్చే సంవత్సరం



డుంబు ఒక పెద్ద కంపెనీలో ఇంటర్వ్యూ ఇవ్వడానికి వెళ్లాడు

బాస్: కంగ్రాట్స్, మీరు సెలక్ట్ అయ్యారు. మీ మొదటి సంవత్సరం ఐదు లక్షల రూపాయలు / సంవత్సరానికి ఉంటుంది. రెండో సంవత్సరం 10 లక్షల రూపాయలు/ సంవత్సరానికి ఉంటుంది.

ఇది విన్న డుంబు లేచి వెళ్లిపోతున్నాడు.

బాస్: ఏమయ్యింది?

డుంబు: అయితే నేను వచ్చే సంవత్సరం వస్తాను.

ఈతరాదు



ముగ్గురు వ్యక్తులకు ఉరిశిక్ష ఖరారయ్యింది. వారిని ఉరికంభం ఎక్కించే సమయంలో మొదటివ్యక్తి ఉరితాడు ముడి విచ్చుకుంది. అతను నీటిలో పడిపోయాడు. ఈతకొడుతూ బయటకొచ్చేశాడు. రెండో వ్యక్తిని ఉరికంభం ఎక్కించారు. అతని ఉరితాడు ముడి ఊడిపోయింది. అతనూ నీటిలో పడిపోయాడు. ఈతకొడుతూ బయటకొచ్చేశాడు.

ఇక మూడో వ్యక్తిని ఉరికంభం ఎక్కించారు. అతనికి ఉరితాడు కూడా ఊడిపోతూ కనిపించింది. దీంతో అతను పెద్దగా అరుస్తూ "అరె వెధవల్లారా ఉరితాడు ముడిని సరిగ్గా కట్టండి. నాకు ఈతరాదు" అన్నాడు.

యాంటీ వైరస్



చెర్రీ ఇంటికి ఒక విదేశీయుడు వచ్చాడు. తలుపుల మీద నిమ్మకాయ, పచ్చిమిర్చి వేలాడటం చూసి ఇది ఏమిటి అని ఆరాతీశాడు.

చెర్రీ: ఇది యాంటీవైరస్. ఇండియాలో తయారుచేస్తారు.

యాక్సిడెంట్




డాక్టర్: మీరు చాలా ఆలస్యం చేశారు. గంట ముందు తీసుకువస్తే మాత్రం ఇతను బతికేవాడు.


చందు: అరె సన్నాసీ: ఇతనికి ఐదునిమిషాల ముందే యాక్సిడెంట్ అయ్యింది. గంటముందు ఎలా తెస్తాం?

బంగారు పలుకు

కష్టాలు ఎదురైనప్పుడే
మనిషి విజయం విలువ
ఏంటో తెలుస్తుంది
- అబ్దుల్ కలాం



అమెరికాలో ఆటాపాట


అల్లు అర్జున్

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న నా పేరు సూర్య (నా ఇల్లు ఇండియా) చిత్రం కోసం ఓ రొమాంటిక్ పాటను అమెరికాలో చిత్రీకరిస్తున్నారు. అల్లు అర్జున్‌తో పాటు కథానాయిక అను ఇమ్మాన్యుయేల్ పై ఈ పాటను తీస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ప్రస్తుతం అమెరికాలో చిత్రీకరిస్తున్న పాట పూర్తికాగానే చిత్రబృందం తిరిగి హైదరాబాద్ చేరుకుని ఓ ప్రత్యేక పాటను తీయనుంది. ఈ పాటను అల్లు అర్జున్, బాలీవుడ్ భామ ఎలీ అవరమ్‌పై చిత్రీకరించనున్నట్లు సమాచారం. సందేశంతో కూడుకున్న చక్కటి సాహిత్యంతో ఈ పాట ఉంటుందని అంటున్నారు. అల్లు అర్జున్ ఆర్మీ సోల్జర్ (సైనికుడు)గా తన అద్వితీయమైన నటనను ఈ చిత్రంలో ప్రదర్శించారని, ఆయనపై తీసిన ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రానికి ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్మాత లగడపాటి శ్రీధర్ వెల్లడించారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం ఆడియో వేడుకను నిర్వహించి, మే 4న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్, శేఖర్ సంగీతాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజీవ్ రవి, ఎడిటింగ్‌ను కోటగిరి వెంకటేశ్వరరావును అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బన్ని వాసు.

వేగం పెంచిన విక్టరీ

విజయాలను రమ్మని పిలిచిన కథానాయకుడు విక్టరీ వెంకటేష్. మూడు దశాబ్దాల నట ప్రయాణంలో ఎన్నో విజయాలతో బాక్సాఫీస్ చరిత్రలు రాశారు. కుటుంబ కథా చిత్రాల హీరోగా పేరు తెచ్చుకున్నారు. హోల్‌సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలతో అలరించారు. నటుడిగా తన జీవితంలో ప్రతి దశకు అనుగుణంగా మారుకుంటూ వచ్చారు వెంకీ. యువ కథానాయకుల జోరు పెరగగానే మల్టీస్టారర్ తరహాకు మారారు. పవన్, మహేష్ లాంటి స్టార్‌లతో తెర పంచుకున్నారు. గతేడాది గురు చిత్రంతో సోలో విజయాన్ని అందుకున్నారు విక్టరీ. ఇలా ఒకే దశలో మల్టీస్టారర్స్, సోలో హీరోగా నటిస్తూ సినిమాల వేగం పెంచారు వెంకటేష్. ప్రస్తుతం తేజ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్న విక్టరీ, వరుణ్ తేజ్, నాగ చైతన్యలతో మల్టీస్టారర్స్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నాగ చైతన్య ప్రేమమ్‌లో అతిథిగా డీసీపీ రామచంద్ర పాత్ర చేసిన వెంకీ ...ఈసారి పూర్తిస్థాయి చిత్రంలో నటించబోతున్నారు. ఈ సినిమాకు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహిస్తారు. వరుణ్‌తేజ్‌తో కలిసి దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించనున్న చిత్రంలో వెంకీ భాగమవుతున్నారు. ఇలా యువ హీరోలతో మల్టీస్టారర్స్, సోలోగా తన తరహాలో సినిమాలు చేస్తున్నారు విక్టరీ..


వెంకటేష్

ఆ కథకు ఓకేనా...?


అనుష్క

కథానాయికగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న అనుష్క, హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలకు అధిక ప్రాధాన్యమిస్తున్న సంగతి తెలిసిందే. అరుంధతి మొదలుకుని రుద్రమదేవి, భాగమతి వంటి ఆ తరహా చిత్రాలు ఆమెకు ఎనలేని పేరు తెచ్చిపెట్టడమే అందుకు కారణం. బాహుబలి-2, భాగమతి చిత్రాల తర్వాత తనకు తగ్గ కథలు రాకపోవడం వల్లే ఆమె నూతన చిత్రాలను అంగీకరించలేకపోయిందని అంటున్నారు. మరోవైపు పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఆమె కొత్త చిత్రాలను ఒప్పుకోలేదన్న వదంతులు ఆ మధ్య మిన్నంటాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమచారం ప్రకారం ఆమె వద్దకు రెండు, మూడు కథలు వచ్చాయని, వాటిలో ప్రముఖ దర్శకుడు గౌతమ్‌మీనన్ కథ కూడా ఒకటుందని చెబుతున్నారు. గౌతమ్‌మీనన్ కథకు దాదాపుగా ఆమె ఓకే చెప్పిందన్న మాటలు ఇప్పుడు టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రస్తుతం విక్రమ్ కథానాయకుడిగా ధృవనక్షత్రం సినిమాను చేస్తున్న గౌతమ్‌మీనన్ అది విడుదలకు సన్నద్ధమవుతుండటంతో ఈ నూతన ప్రాజెక్ట్‌ను ముందుగానే ప్లాన్ చేసుకుంటున్నారట. ధృవనక్షత్రం విడుదల కాగానే ఈ చిత్రాన్ని మొదలుపెడతారని పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. ఇందులో మరింత నాజూకుగా న్యూలుక్‌తో కనిపించాలని ఆమె కోరుకుంటోందట.

జంతు ప్రేమికురాలు రాశీ ఖన్నా



నవతరం నాయికల్లో జోరుమీదుంది రాశీ ఖన్నా. తాజాగా తొలి ప్రేమ విజయం ఆమె క్రేజ్‌ను నిలబెట్టింది. ఊహలు గుసగుసలాడే చిత్రంతో తెలుగు తెరకొచ్చిన ఈ ఢిల్లీ సుందరి. రాగానే ముందుగా అందంతో అందరినీ పడేసింది. నటిగా నెమ్మదిగా ఎదుగుతూ వచ్చింది. చాలా చిన్న వయసులో నాయిక కావడం వల్ల...పరిశ్రమలో ఆమెకంటూ ఓ ప్రత్యేక స్థానం దొరికింది. కుర్ర కథానాయకులతో పాటు కొత్తదనాన్ని కోరుకునే పేరున్న హీరోలతోనూ నటించింది. రెండు తరాల కథానాయకులతో నటిస్తూ తన అవకాశాల పరిధి పెంచుకుంది రాశీ ఖన్నా. తెలుగులో కొత్త చిత్రాలు అంగీకరిస్తూనే కోలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది రాశీ. తాజాగా విశాల్ సరసన ఓ కొత్త చిత్రాన్ని చేసేందుకు ఒప్పుకుంది. తెలుగులో ఎన్టీఆర్, కాజల్ జంటగా నటించిన టెంపర్‌ను తమిళంలో పునర్నిమిస్తున్నారు. ఈ రీమేక్‌లో కాజల్ పాత్రను రాశీ ఖన్నా పోషించబోతోంది. కాజల్ నటించిన జంతు ప్రేమికురాలి పాత్రలో రాశీ కనిపించబోతోంది. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను అక్కడ ఏఆర్ మురుగదాస్ శిష్యుడు వెంకట్ మోహన్ తెరకెక్కిస్తారు. ప్రస్తుతం రాశీ ఖన్నా తెలుగులో శ్రీనివాస కళ్యాణం అనే చిత్రంలో నటిస్తోంది.

జంబ లకిడి పంబ

ఆ సినిమా గౌరవాన్ని తగ్గించం

జంబ లకిడిపంబ సినిమా పేరు చెప్పగానే ఈ చిత్రాన్ని తీసిన ఇవివి.సత్యనారాయణ గుర్తుకువస్తాయి. అద్యంతం నవ్వించిన ఈ చిత్రం టైటిల్‌తో మరో సినిమా వస్తోంది. ఇందులో శ్రీనివాసరెడ్డి, సిద్ధి ఇద్నాని జంటగా నటిస్తున్నారు. జె.బి.మురళీకృష్ణ దర్శకుడు. రవి, జోజో జోస్, శ్రీనివాసరెడ్డి.ఎన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ లోగోను కామెడీ చిత్రాల హీరో అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ




కార్యక్రమంలో హీరో శ్రీనివాసరెడ్డి, నిర్మాత, దర్శకుడు, సహ నిర్మాత బి.సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అల్లరి నరేష్ మాట్లాడుతూ మా నాన్నగారు తీసిన జంబలకిడిపంబ చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఈ పదాన్ని రేలంగిగారు క్రియేట్ చేశారు. శ్రీనివాసరెడ్డి నటించిన జంబ లకిడి పంబ చిత్రం పెద్ద విజయం సాధించాలి. గోపీసుందర్ సంగీతం సినిమాకు ఆకర్షణ అవుతుంది అన్నారు. నిర్మాత రవి మాట్లాడుతూ మా సినిమా నిర్మాణదశలో ఉంది. బాగా వస్తోంది. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ నిజానికి జంబలకిడిపంబ అనే పదానికి అర్థం లేదు. ఇదే టైటిల్‌తో ఈవీవీగారు సినిమా తీసి కామెడీలో కొత్తకోణాన్ని ఆవిష్కరించారు. ఆ సినిమాకు మా సినిమాకు ఎలాంటి సంబంధం లేదు. కథకు సరిపోతుందని పెట్టాం. ఆ సినిమా గౌరవాన్ని మాత్రం తగ్గించం. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతున్నాం అని తెలిపారు.

సాహసాల సుందరి

నటనలో స్థిరపడాలంటే సహనం, ఓర్పు, శ్రమించే తత్వం కావాలంటారు. ఈ లక్షణాలకు అద్వితీయ అందం తోడైతే ఆ సుందరి విశిష్ట నాయికే అవుతుంది. హాలీవుడ్ అందాల తారగా పేరు తెచ్చుకున్న క్రిస్టినా హెండ్రిక్స్ అలాంటి ప్రత్యేకతనే తెచ్చుకుంటోంది. ద సెక్సియెస్ట్ వుమెన్ ఇన్ ద వరల్డ్, బెస్ట్ లుకింగ్ అమెరికన్ వుమెన్ లాంటి అరుదైన గుర్తింపులు అందుకున్న క్రిస్టినా హెండ్రిక్స్....నటిగా ప్రతిభ చూపించడంలోనూ ఉత్తమ నాయికే అని నిరూపించుకుంటోంది. ఆమె నట ప్రతిభకు, శ్రమించే తత్వానికి తాజా చిత్రం ద స్ట్రేంజర్స్, ప్రే ఎట్ నైట్ నిదర్శనంగా నిలుస్తోంది. పదేళ్ల కిందట ప్రేక్షకుల ముందుకొచ్చి విజయాన్ని అందుకున్న స్ట్రేంజర్స్ సినిమాకు ఇది కొనసాగింపు చిత్రం. ఇందులో కీలక పాత్రలో నటిస్తోంది క్రిస్టినా. ఈ సినిమా కథలో భాగంగా ప్రమాదకరమైన సన్నివేశాలు, సాహసోపేతమైన ఘట్టాలు ఉన్నాయి. అలాంటి సన్నివేశాల్లో నటించేందుకు ముందుగా అంగీకరించిందట క్రిస్టినా. ఈ విషయాన్ని దర్శకుడు రాబర్ట్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ...ద స్ట్రేంజర్స్, ప్రే ఎట్ నైట్ చిత్రానికి నాకు దొరికిన నటీనటులు అద్భుత ప్రతిభ గలవారు. ముఖ్యంగా క్రిస్టినా హెండ్రిక్స్....ప్రమాదకరమైన సన్నివేశాలు చేస్తానంటూ ముందుకొచ్చింది. చాలా కష్టమైన సన్నివేశాల్లో ఎలాంటి భయం లేకుండా నటించింది. అంటూ ప్రశంసించారు. సెక్లూడెడ్ మొబైల్ హోమ్ పార్క్‌లో సరదాగా గడిపేందుకు బయలుదేరిన ఓ కుటుంబాన్ని కొందరు అపరిచితులు అడ్డగిస్తారు. క్రూరులైన వాళ్ల నుంచి ఈ కుటుంబం ఎలా బయట పడిందన్నది ద స్ట్రేంజర్స్, ప్రే ఎట్ నైట్ కథాంశం. త్వరలో ఈ సినిమా తెరపైకి రాబోతోంది.


క్రిస్టినా హెండ్రిక్స్


75 ఏళ్ల కొడుకు, తండ్రికి 102


రిషీ కపూర్, అమితాబ్ బచ్చన్

అమితాబ్ బచ్చన్, రిషీ కపూర్...ఇద్దరు బాలీవుడ్ దిగ్గజ నటులు. దశాబ్దాలు హిందీ తెరను ఏలిన కథానాయకులు. సోలోగా ఘన విజయాలు అందుకున్న ఈ ఇద్దరు నటులు....కలిసి నటించి అలాంటి చరిత్రనే పునరావృతం చేశారు. కభీ కభీ, అమర్ అక్బర్ ఆంటోనీ, నసీబ్, కూలీ లాంటి పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించారు. 1991లో విడుదలైన అజూబ వీరిద్దరి కలయికలో వచ్చిన చివరి చిత్రం...మళ్లీ ఇన్నేళ్లకు వీళ్లు ఒక్కటై 102 నాటౌట్ సినిమాలో కనిపించబోతున్నారు. సౌమ్య జోషి రచించిన గుజరాతీ నాటకం 102 నాటౌట్ ఆధారంగా అదే పేరుతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు ఉమేష్ శుక్లా. ఈ చిత్రంలో 102 ఏళ్ల వయసున్న తండ్రిగా అమితాబ్, 75 ఏళ్ల కొడుకుగా రిషీ కపూర్ నటిస్తున్నారు. బాప్ కూల్, బేటా ఓల్డ్ స్కూల్ అనే ఉప శీర్షికతో 102 నాటౌట్ రూపొందుతోంది. అత్యధిక వయసున్న వ్యక్తిగా చరిత్ర సృష్టించాలనుకునే తండ్రి ప్రయత్నాలకు, వాటికి విసిగిపోయిన కొడుకు ప్రవర్తనకు మధ్య జరిగే వినోదంతో ఈ చిత్ర కథాంశం సాగుతుంటుంది. 102 నాటౌట్ తొలి పోస్టర్ శుక్రవారం విడుదలైంది. రిషీ కపూర్, అమితాబ్ తమ సామాజిక మాధ్యమాల ఖాతాలలో వీటిని పోస్టు చేశారు. అమితాబ్ వయసు ప్రస్తుతం 75 ఏళ్లు కాగా...శతాధిక వృద్ధుడిలా నటిస్తుండటం విశేషం. ఇద్దరు బాలీవుడ్ దిగ్గజాలు కలిసి నటిస్తున్న చిత్రంగా 102 నాటౌట్ ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగిస్తోంది. మే 4న ఈ సినిమా తెరపైకి వచ్చేందుకు సిద్ధమవుతోంది.

వయసెంతో మర్చిపోయా

డ్రైవింగ్ లైసెన్స్‌లో చూసినప్పుడు మాత్రమే తన వయసెంతో గుర్తొస్తుందని...ఆ విషయాన్ని తాను మర్చిపోయానని అంటున్నారు హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ స్వాష్‌నెగ్గర్. బాడీబిల్డర్ నుంచి మోడలింగ్ అక్కడి నుంచి వెండితెరకు చేరుకున్నారు ఆర్నాల్డ్. యాక్షన్ చిత్రాల విజయాలతో స్టార్ అయ్యారు. టెర్మినేటర్ సిరీస్ సినిమాలు ఈ కండల వీరుడిని హాలీవుడ్‌లో అగ్ర తారను చేశాయి. యాక్షన్ చిత్రాల్లో ప్రేక్షకులను మెప్పించడానికి కారణం తన శారీరక దృఢత్వమే అంటారు ఆర్నాల్డ్. ప్రస్తుతం ఆయన వయసు 70 ఏళ్లు. అయితే ఈ విషయం ధృవీకరణ పత్రాలలో చూసినప్పుడు మాత్రమే గుర్తొస్తుందని చెబుతున్నారు ఆర్నాల్డ్. తాను గత ఇరవై ఏళ్ల క్రితం ఎలా ఉన్నానో అలాంటి శక్తివంతమైన జీవితాన్నే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఆర్నాల్డ్ మాటల్లో వింటే.....నేను రెండు దశాబ్దాల క్రితం ఉన్నంత ఉత్సాహంగా ప్రస్తుతం ఉన్నాను. నా వయసు డ్రైవింగ్ లైసెన్స్ పైనే ఉంటుంది. వ్యాయామశాలకు వెళ్లని రోజంటూ ఉండదు. ఐదింటి లేచి కసరత్తులు ప్రారంభిస్తా. సైకిలింగ్, స్కిప్పింగ్, బరువులు ఎత్తడం లాంటి వ్యాయామాలు చేస్తా. నేను నా కార్యాలయానికి వెళ్లే సమయానికి రోజుకు కావాల్సినంత శ్రమించి సిద్ధంగా ఉంటాను. అని చెప్పారు.


ఆర్నాల్డ్ స్వాష్‌నెగ్గర్